# శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక సూత్రములు

## 1. ఉన్నదొక్కటే

**ఎద్ది లేదనుచుంటిమో అద్ది కలదు**
**ఎద్ది కలదనుచుంటిమో అద్ది లేదు**
**ఉన్నదొక్కటె, దైవంబు ఎన్నటికినీ**
**లేనిదయ్యెను, విశ్వంబు కానరయ్య.**

నామ రూపాత్మకమైన ఈ జగత్తునందు నిత్యశాంతిని పొందగోరి మానవుడు అనేక ప్రయత్నములకు, అనేక సాధనలకు గురి అవుచున్నాడు. నిత్యసత్యమైన ఆత్మతత్వాన్ని దృశ్య కల్పితమైన జగత్తునందు వెదుకుటకు ప్రయత్నిస్తున్నాడు. దృశ్యమును బహిర్ముఖము గావించుకొన్నంత కాలము దృశ్యమే గోచరిస్తుంది కాని దృక్ అనే సత్యతత్వము గోచరించదు. దృష్టిని అంతర్ముఖము గావించుకోవడం వల్లనే నిజమైన ఆనందం లభించును. కనుక మన దృష్టిని భగవత్ అభిముఖం గావించుకున్నపుడే మనము పవిత్రమైన మార్గమును అవలంబించువార మవుతాము.

మార్పు చెందే పదార్థము, మార్పు చెందే వ్యక్తికి, మార్పు చెందని ఫలితమును ఏమాత్రమూ అందించదు. సత్యమైన సుఖమును సత్యమైన పదార్థమే అందించును. నిత్యమైన పదార్థమే నిత్యసుఖాన్ని అందించును. కనుక ఈ సత్యనిత్యమైన పదార్థము ఆత్మ ఒక్కటియే. ఈ ఆత్మతత్వాన్ని గుర్తించడానికి గాఢప్రయత్నము చేసిన ఆత్మతత్వమేనే నుండి, ఆత్మానందాన్ని కూడా అనుభవించుటకు వీలగును.

## 2. నిన్ను నీవు వెదకుచుండు!

**అహంకారపడకు నరుడా!**
**ముందు వెనుక తరచిచూడు!**
**అహంకారము కలిగినపుడు**
**కన్ను తెరచి పైకి చూడు!**
**దుఃఖమావరించినపుడు**
**కన్ను తెరచి క్రింద చూడు!**

**నిన్ను నీవు వెదకుచుండు**
**సమభావము కలుగుచుండు;**
**శాంతి, తృప్తి ఫలమునొందు;**
**నిత్యానంద సుఖము పొందు.**

ఈనాటి నాయకులను, పెద్దలను, విద్యార్థులను యే మూల చూచినా, యెవరిని చూచినా అహంకారము వీరవిహారము సలుపుతూ చిందులు త్రొక్కుచున్నది. కాని వారిలో నిజముగా ప్రవేశించవలసినది నిరహంకారము. మానవుడు అహంకారమున్నంతవరకు ఏ విధముగా కూడా అభివృద్ధి గాంచలేడు.

ప్రాణములను పిడికిట పట్టుకొని, ఈ ప్రళయకాల గర్భమందు, భయాందోళిత మనస్కులై నివసించుచున్నారు. ఏ నిమిషాన, ఏ ప్రాంతాన, ఏలాంటి విషమ విపత్కర పరిస్థితి చెలరేగునో, చెప్పలేని నేటి కాలములో మానవునికి శాంతి యెక్కడిది? సుఖమెక్కడిది? నేడు సుఖమనునది కలలోని వార్తయైపోయినది. శాంతి అనునది అందనిపండై పోయినది.

ఇట్టి పరిస్థితులలో మానవుడు తనను తాను తెలుసుకోవాలి. అంటే ఎన్ని కాళ్లు, చేతులు, కళ్లు, ముక్కులు ఉన్నాయని కాదు. "నేను ఎవరు? నేను దైవత్వాన్ని, నేను నిమిత్తమాత్రముగా ఈ దేహాన్ని ధరించినాను. ఈ దేహంలోని సర్వశక్తులూ, సర్వభావములూ, సర్వసంకల్పములూ, భగవంతుని ప్రేరేపణతో వచ్చేవే అనే సత్యాన్ని గుర్తించాలి. అప్పుడే దైవత్వాన్ని గుర్తించి, అనుభవించటానికి వీలవుతుంది. అప్పుడే మానవుడు సంఘసేవ, నిరుపేదల సేవలలో ప్రవేశించగల్గుతాడు. ఈ సేవ మానవునకు ఉన్నత స్థాయినందిస్తుంది. అహంకారము నిర్మూలింపచేస్తుంది.

## 3. దైవమును గొల్వనిదే రాదు దండిశక్తి

**ఎమ్మేలు బిఏలు-ఏర్పడ చదివియు**
**పేరు గాంచిన పెద్ద-వారలైన**
**సంపదలుండియు, సద్దానపరులౌ చు**
**పుడమి కీర్తినిగన్న-పుణ్యులైన**
**ఆయురారోగ్యంబు-అనవరతంబుండి**

**పరిపూర్ణబలులగు-వారలైన**
**సతతంబు జపములు-చాలంగచేయుచు**
**వేదములను నేర్పు-విప్రులైన**
**సాటిరారు భక్తులకునే-నాటికైన**
**దైవమును గొల్వనిదె రాదు-దండిశక్తి**
**ఇంతకన్నను వేరెద్ది-యెరుకపరతు**
**సాధుసద్గుణగణ్యులౌ-చట్టులార!**

ఈనాటి విద్యను అభ్యసించడము అపవిత్రమైన దురాశను పెంచుకోవడమే జరుగుచున్నది. ఏ డిగ్రీ తీసుకుంటే ఏ విధమైన ఉన్నతస్థాయిని పొందగలను? ఏ పిహెచ్.డి. తీసుకుంటే ఎంతవరకు నేను శేలరీని పెంచుకోగలను? ఏ విధమైన ఉద్యోగము చిక్కితే దాని నుంచి సరియైన స్థానము పొందగలను అనే తన స్వార్థమును అభివృద్ధి పరచుకుంటూ, కేవలము కాకికంటే హీనంగా జీవించడానికి ప్రయత్నిస్తున్నాడు విద్యావంతుడు. ఇట్టి దురవస్థలు, దుర్బుద్ధులు, దుర్భావములు లేకుండా విద్యార్థులు అనేక విధములైన రంగములందు సత్యసాయి ఆశయములను, పవిత్రమైన భావములను ప్రచారము చేయవలెను.

నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, రాజకీయ, లౌకిక, విజ్ఞాన రంగములన్నిటి యందు విద్యార్థులు ప్రవేశించాలి. రంగములు మార్చవచ్చును కానీ రంగులు మార్చకూడదు. దైవద్రోహానికి గురి అయిన వ్యక్తి సర్వసామాన్యమైన మానవునికి ఎంత ద్రోహమైనా చేయగలడు. అందుకు విద్యార్థులు నిస్వార్థసేవ చేయుటకు బయట ప్రపంచమునందు ప్రవేశించి “మానవసేవయే మాధవసేవ”గా భావించాలని నిరూపించగల్గాలి అన్నదే సత్యసాయి యొక్క అనంతమైన ఆశ.

## 4. ఇకనైన కన్నులు తెరు

**ఆంగ్లవిద్యాభిమానంబు ఆవరించుటచే**
**స్వమత విజ్ఞానంబు సన్నగిల్లె.**
**స్వమత విజ్ఞానంబు సన్నగిల్లుటతో**
**సంస్కారాభావంబు సంభవించె;**
**సంస్కారాభావంబు సన్నగిల్లిననాడు**

**ధర్మంబు క్షీణించె ధరణియందు;**
**ధర్మంబు క్షీణమై ధరను తొలగిననాడె**
**భారతీయుల భక్తి భగ్నమయ్యె;**
**కాన, ఇకనైన కన్నులు తెరచి**
**తెలివితో కాంచడో భారతీయులారా!**

ఒక దుర్గుణము ఎన్నో దురవస్థలను తెచ్చుచున్నది. నేడు పరమ పవిత్రమైన భారతీయ సంస్కృతిని విస్మరించి, పాశ్చాత్య విద్యాభిమానులై, దురహంకారపూరితులై, అవిద్యాపరులై, మానవులు తమ పతనానికి తామే రాజబాట వేసుకొంటూ, ధనార్జనయందు, అధికార పదవులకొరకు, అజ్ఞానాంధకారములందు అన్యాయ, అక్రమ, అసత్యములందు మునిగితేలుతూ, అవే జీవిత లక్ష్యమని ఆరాటపడుతున్నారేగాని, విద్య యొక్క, జీవితముయొక్క నిజ లక్ష్యమేమిటని యిసుమంతైనా కన్నులు తెరచి కానకున్నారు.

ఇతరులకు ఆనందమును అందించేది, ఇతరులకు ఆదర్శములనందించేది, తనకు శాశ్వత సుఖమునిచ్చేది, లౌకిక వ్యవహారములందు న్యాయాన్యాయములను పరిశీలింపచేసి, న్యాయమార్గమునందే నడిపించేది అసలువిద్య.

'విద్య యొసగును వినయంబు, వినయంబు వలనను పడయు పాత్రత, పాత్రత వలన ధనము; ధనము వలనను ధర్మంబు; దానివలన ఐహిక, ఆముష్మిక సుఖంబు నందు నరుడు; అన్నారు పెద్దలు. విద్యార్థికి మకుటాయమాన శిరోభూషణము వినయము. అదే శ్రుతిస్మృతుల అమృత సందేశము.

విద్యార్థులారా! మంచిగా ఉండండి. మంచినే చూడండి. మంచినే ఆచరించండి. అదియే దైవమును చేర్చు మార్గము.

## 5(అ). నిష్ఫలమైన విద్యలు

**పుస్తకముల్ పఠించితిని-పూర్తిగ చూచితి సర్వ శాస్త్రముల్**
**నిస్తులమైన విద్యలను-నేర్చితినంచును గర్వమెందుకే**
**హస్తయుగంబు మోడ్చి పరమాత్ముని భక్తితొ కొల్వలేని యీ**
**ప్రస్తుత విద్యలన్నియు స్థి-రంబుగ నిష్ఫలమౌను మానవా!**

చదువు అనగా కేవలం ఒక్క గ్రంథ పరిచయమేనని భావించి, విద్యార్థులు విర్రవీగుతున్నారు. నిత్యజీవితములో మానవునికి సత్యమైన సూక్తులు, పవిత్రమైన నడతలు, దివ్యమైన భావములు ఏవియో గుర్తించడానికి ప్రయత్నించడమే విద్య యొక్క ప్రధాన లక్ష్యము. సత్యాన్వేషణయే విద్యార్థుల ప్రధాన కర్తవ్యము. త్యాగమే జీవిత పరమావధి. రాగద్వేషాలతో, అసత్యాలతో దూషితము కాని చిత్తము, వాక్కు, విద్యార్థులకు అవసరము. హింసాదులతో దూషితము కాని కాయము పవిత్రము గావించుకోవాలి.

## 5(అ). నేర్పవలసిన-నేర్వవలసిన విద్య

**సత్ప్రవర్తన, సద్బుద్ధి, సత్యనిరతి,**
**భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనము,**
**నేర్పునదే విద్య అద్దాని విద్యార్థి నేర్వవలయు**
**సత్యమును తెల్పుబాట శ్రీసాయి మాట.**

మానవ జీవితమునకు నడవడిక ప్రధానము. నడవడికకు గుణము అనునది ముఖ్యము. మానవుడు మరణించిన తర్వాత కూడనూ శాశ్వతముగా నిలిచియుండేది నడవడికయే. ఈ నడవడిక అనే బ్రతుకుకు జ్ఞానమే బలమని అనేకమంది భావింతురు. కాని నేడు గుణమే ప్రధానము. గుణమే బలము. గుణము ముందు ఎట్టి అధికారము కాని ఏమాత్రము పనికిరాదు. ఈ జగత్తునందు ధనవంతులు, గుణవంతులు, బలవంతులు, విద్యావంతులు వున్నప్పటికినీ గుణమునకు తగిన స్థానము మరొక వ్యవహారమునకు ఏమాత్రము సమన్వయము కాదు.

గుణములు గ్రంథముల చేత లభించునవి కావు. లేక అధ్యాపకునిచేత వచ్చేవి కావు. లేక మిత్రులచే అందుకునేవి కావు. మామూలు విద్యలన్నియు కృత్రిమమైనవి. ఈ కృత్రిమ విద్యలకు ఆధ్యాత్మిక విద్యను సంబంధపరచినపుడే సరియైన మార్గమును అవలంబింపచేస్తుంది.

## 6. పునాదిగోడలు నాల్గు

**సత్య ధర్మ ప్రేమశాంతులు లేకున్న**
**విద్యలన్నియు నేర్చి విలువ సున్న**

**సత్యధర్మ ప్రేమశాంతులు లేకున్న**
**దానధర్మాల సార్థకత సున్న**
**సత్యధర్మ ప్రేమ శాంతులు లేకున్న**
**పదవులనేలిన ఫలము సున్న**
**సత్యధర్మ ప్రేమ శాంతులు లేకున్న**
**బహుళ సత్కార్య లాభంబు సున్న**

**ఈ సనాతన ధర్మహర్మ్యంబు నిలువ**
**గుణములివి నాల్గు పునాది గోడలన్న**
**ఇంతకన్నను వేరేమి ఎఱుకపరతు**
**సాధు సద్గుణ జనులగు సభ్యులారా!**

భారతీయ సంస్కృతి యొక్క రెండు నేత్రాలు– సత్యంవద; ధర్మంచర అనే రెండు శ్రుతివాక్యములు. ఎవరేమనుకొనిన మీరు చలించక మీ దృష్టిని మార్చక, మనస్సును భ్రమింపనీయక, సత్యధర్మములను పాలించుకొని స్వార్థరహిత సేవను సలుపవలెను.

భూషణకు పొంగక, దూషణకు క్రుంగక, ఆధ్యాత్మిక మార్గముననుసరించి శాంతముగా ఆనందమునందుకోవాలి.

చుక్కలను చూచి కుక్కలు మొరుగుతే చుక్కలు రాలునా? చుక్కలెక్కడ? కుక్కలెక్కడ? సాయిస్వరూపము సత్యం. సత్యస్య సత్యం.

## 7. చిత్తశుద్ధి

**వేద వేదాంగములు వల్లె వేసియున్న**
**పద్య గద్యంబులను కూర్పబడసియున్న**
**చిత్తశుద్ధియు లేనిచో చెడును అతడు–**
**ఇంతకన్నను వేరెద్ది ఎరుకపరతు**

చావులేని చదువు చదువవలెనని వేమన బోధించినాడు. ఆధ్యాత్మిక విద్యయే అన్ని విద్యలలో శ్రేష్ఠమైనదని శ్రీకృష్ణుడు భగవద్గీతలో నొక్కి చెప్పినాడు. మానవునిలో దివ్యజ్యోతిని వెలిగించుటకు తగిన ప్రయత్నము చేయుటకే 'విద్య' అను పేరు

సరిపోవును. ఆ దివ్యజ్యోతి ద్వారా మానవత్వము ప్రకటమై, ప్రకాశమై వికసించును.

మానవుడు విద్య, దైవత్వము, ఆధ్యాత్మికము అను మూడింటి యొక్క ఏకత్వమును సాధించాలి. అపుడే మానవునియందు దివ్యజ్యోతి వెలుగును. కేవలము తర్కవితర్కముల యందే వినియోగింపబడిన ఆ విద్య వలన సరస్వతీదేవికి అపకీర్తి కలుగునే కాని వేరు ప్రయోజనము లేదు. విద్యను దుర్వినియోగపరచకూడదు. ఆచరణలో పెట్టి ఆత్మజ్ఞానమును అందుకోవలెను.

## 8. హీనుడవగుణంబు మానలేడు

**చదవులన్ని చదివి-చాల వివేకియై**
**మదిని తన్నెరుగడు-మందమతియు**
**ఎంత చదువు చదివి-ఏ నీతి విన్నను**
**హీనుడవగుణంబు-మానలేడు.**

సర్వసామాన్యముగా జగత్తునందు నిజమైన బలమును, నిజమైన బ్రతుకును జ్ఞానమని చెప్పుదురు. కానీ ఇదికాదు నిజమైన బ్రతుకు. ఇది కాదు నిజమైన బలము. నిజమైన బలమునకు, బ్రతుకునకు గుణమే ప్రధానము. అమోఘమైన కీర్తి ప్రతిష్ఠలకు విద్య కాదు ప్రధానం, గుణప్రవర్తన. అట్టి ప్రవర్తన లేకున్న పశువుతో సమానము.

మానవుడు విద్యావంతుడై, ప్రజ్ఞానవంతుడై, వివేకవంతుడై ఉండినప్పటికీ, దురాశకు లోనై ఉండుటచే దుఃఖమునకు గురి అగుచున్నాడు. అందుచే గుణసమ్మిళితమైన ప్రవర్తనయే మానవునకు నిజశాంతిని చేకూర్చును అను సత్యాన్ని గుర్తించాలి. సమాజములో దుమికి, సేవలు చేసి, జగత్తునకు సరియైన కీర్తిని తెప్పించే ప్రయత్నమునకు మన విద్యను అంకితం కావించాలి. ధనమును సంపాదించే దుర్భావముచేత విద్యార్థులు ఉద్యోగం చేయవద్దు. గుణమును పోషించుకునే ఉద్దేశంలో ఉద్యోగం చేయండి. Money comes and goes. Morality comes and grows అని ధన సంపాదన గొప్పది కాదు. దేశోద్ధారణ నిమిత్తమై, సమాజ పవిత్రత నిమిత్తమై, దేశాభివృద్ధి నిమిత్తమై విద్యను ఆశించాలి.

## 9. చావు లేని చదువు చదువవలయును

**తరచి, చదువు చదువ–తర్కవాదమెగాని**
**పూర్ణమైన యెఱుక–పొందలేడు.**
**చదువు చదివి, చదివి–చావంగనేటికి**
**చావులేని చదువు–చదువవలయు.**

**మదిని తన్నెరుగడు మందమతి**
**ఎంత చదువు చదివి, ఏ రీతి ఉన్ననూ**
**హీనుడవగుణంబు మానలేడు**

**తరచి చదువు చదువ తర్కవాదంబెగాని**
**పూర్ణజ్ఞానంబెపుడు పొందలేడు**
**చదువు చదువు చదివి చావంగ నేటికి**
**చావులేని చదువు చదువవలయు.**

చదువుకు అంతము లేదు. కాని మనము దానిని అంతము చేస్తున్నాము. సద్వినియోగములేని చదువు నిరర్థకము. దానికి సార్థకత లేదు. ఈనాడు బహుళ గ్రంథ పరిచయముకొరకు లైబ్రరీలో అనేక గ్రంథములు చదివి, ఉన్నదింత ఇంతంతవైనా లారీలు లారీలు matter ను చేర్చుకుంటున్నారు. ఇన్ని చేర్చుకుంటున్నా అది ఖాళీగానే ఉంటున్నది.

ఏమీలేని బుర్రలోన ఏమైనా చేర్చవచ్చు. ఏమేమో నింపియున్న తల(బుర్ర) ఖాళియగునె–ఖాళీ చెయ్యడమంటే వాటిని యీ చెవిలో విని, ఆ చెవిలో పంపడం కాదు. మరచిపోవడం కాదు. Practical గా అమలుపరచాలి. చెప్పినది ఒక్కటైన చెయ్యడానికి పూనుకోవాలి. Platform Speeches లో zero లుగా, Practical senseలో Heroలుగా ఉండాలి కానీ Platform speeches లో Hero లాగా, Practical sense లో zeroes గా ఉండరాదు. మనం ఎక్కడ ఉన్నా అమృతపుత్రులుగా ఉండాలి. మన బాలబాలికలందరూ తమ తమ ఇండ్లలో, సమాజమునందు దేశమునందు ఆదర్శ జీవితాన్ని ఆచరించి, అందరికీ ఆదర్శంగా ఉండాలి.

## 10. మంచిచెడ్డలు

### (అ) మంచిచెడ్డలు - దైవనిర్ణయం

**ఒకటి చెడు అటంచు, ఒకటి మంచి అటంచు**
**సృష్టియందు నిర్ణయింపతగునె?**
**ఇదియు అదియు ఒక్క యీశ్వరుడె చేసె**
**ఉన్నమాట తెలుపుచున్న మాట.**

మానవుని స్వభావమందు మంచి, చెడ్డ అన్నియునూ, వాని ఆహారమునెక్కువగా ఆశ్రయించును. మంచి పలుకులు, మంచి తలంపులు, మంచి భావములు, మంచి ప్రవర్తనలచే తమ మనస్సు మంచిగా మారును. మంచి దృష్టిచేత మంచిని పొందవచ్చును. చెడ్డని స్మరించితే, చెడ్డపలుకులకు, భావములకు, తలంపులకు స్వాగతమిచ్చిన, హృదయము చెడ్డదిగా మారును. కనుక ఎల్లప్పుడూ మంచిని చూచుటకు, మంచి స్మరించుటకు ప్రయత్నము చెయ్యాలి. పరుల దోషమును వెదకిన, ఆ సంస్కారము మీ హృదయమునే కల్మషపరచును. నిరంతరము పరుల చెడ్డనే చింతించిన మీరు కాలక్రమేణ చెడ్డవారుగా మారుదురు. కనుక చెడ్డ విషయమును చింతించుటకేమాత్రము ప్రయత్నము చేయకూడదు. మంచిని చింతించిన ఏదో ఒక సమయమందది హృదయ పరివర్తనము గావించును. 'యద్భావం తద్భవతి'.

### (ఆ). మంచిపని చేసి చెడ్డను చెందలేము

**చెడ్డపని చేసి మంచిని చెందలేము**
**మంచిపని చేసి చెడ్డను చెందలేము**
**నిమ్మను నాట చూత ఫలంబు కనునే**
**చూతమును నాట నిమ్మ ఫలంబు కనునే**

మీ యొక్క శ్రద్ధాభక్తులే మిమ్మల్ని పోషిస్తాయి. మీ యొక్క శ్రద్ధాభక్తులే మిమ్మల్ని కాపాడుతుంటవి. మీ శ్రద్ధాభక్తులే, మీ యొక్క ఉత్సాహమే మిమ్మల్ని కష్టముల నుండి దూరం చేస్తుంది. దైవము సాక్షీభూతము. దైవమునకు ఏమాత్రము ఆగ్రహముగానీ, అనుగ్రహముగానీ లేవు. ఆగ్రహమునకు, అనుగ్రహమునకు మీ యొక్క భావనలు, చేతలే కారణం.

నిమ్మ విత్తనము నాటితే మామిడిపండు కాస్తుందా? 'యద్భావం తద్భవతి'.

## (ఇ). చెడ్డపని చేసి మంచి చెందబోరు

**చెడ్డపని చేసి మంచిని చెందబోరు.**
**మంచిపని చేసి కీడును గాంచలేరు.**

ఎలాంటి పనో అలాంటి ఫలితము. కాబట్టి మనము జగత్తులో మంచినే చేసి, మంచినే అందుకోవాలి. మంచిని చేయకుండా మంచిని అందుకోవాలని అనుకోవడం ఒక రకమైన అమాయకత్వము. 'స్వామీ, మేము మంచిపని చేసినా మాకు చెడే జరిగింది' అని మీరు అనవచ్చు. కానీ మీ భావములలో దోషముండవచ్చు. లేకపోతే చెడు రావడానికి వీలు లేదు. స్వార్థము లేకుండ ఇది మంచి– ఇది చెడు అనుకోకుండ సర్వకర్మలు భగవత్ప్రీత్యర్థముగ చేస్తే– దానివలన మీకు ఎటువంటి నొప్పి, బాధ, నష్టము కలుగదు. అన్నింటికి కారణము మన దోషములు. కాని మన దోషములు మనకు కానరావు.

మనము ఏది చేసినా దానికి Reaction, Reflection, Resound ఉంటుంది. 'నన్ను మాత్రం అందరు గౌరవించాలి. నేను మాత్రం చేయను' అంటే ఎట్లా సాధ్యపడుతుంది. 'తీసుకోమ్మా ఉప్పు అంటే పట్టమ్మా పప్పు' అంటారు. ఎలాంటి పనో అలాంటి ఫలితము.

## 11. దుర్బుద్ధులు దూరము చేయి

**దుర్బుద్ధులు వినుతలలున్న**
**దూరులు చెప్పునోరున్న**
**పొంచి చూచు కనులున్న**
**పంచలు విను చెవులున్న**
**వంచిత గుణచిత్తమున్న**
**వంచించే మనసున్న**
**ఈ వికృతుల చూడగా**
**న్యాయము మరి బ్రతుకదన్నా!**

మానవుల మధ్య నివసించవలసిన న్యాయము, ధర్మము, అరణ్యములపాలై,

అరణ్యములలో ఉండవలసిన క్రూరత్వము, ద్వేషము మానవుల సమాజమున ప్రవేశించింది.

చిత్తశుద్ధి యొక్క చరిత్ర విషాదకరమైపోయింది. మందుకైనా దొరకకుండా యేనాడో గంగలో కలిసిపోయినది.

'న కర్మణా, న ప్రజయా, ధనేన త్యాగేనై కే అమృతత్వమానశుః' అన్నారు ఋషులు. అమృత పుత్రులైన మానవులు అనృతపుత్రులై అజ్ఞానములో పొరలుచున్నారు. స్వార్థభావములతో, సంకుచిత హృదయములను నింపుకొంటున్న యనేటి సమాజమందు త్యాగమునకు స్థానమెక్కడిది? త్యాగము లేక సత్యమును గుర్తింప వీలుకాదు.

త్యాగమనగా మనసులోని మాలిన్యమును త్యాగము చేయుట. నీ చెవిలోని దురాశలను, నీ నేత్రములోని దుర్భావములను త్యాగము చేయుట; నీ హృదయములోని చెడువాంఛలను దూరము చేయుట. అంతేగాని, సర్వమునూ ధారపోసి, బికారియై గ్రామము విడచి పరుగెత్తటము కాదు. త్యాగమంటే చేతిలోని ధనమునంతా దానధర్మములకు వినియోగించటము, లేక భోగభాగ్యములను వదలి అడవులపాలు కావటము కాదు.

## 12. పాతివ్రత్యము

**గత జీవుడగు పతిన్ బ్రతికించి యముగెల్చె**
**సావిత్రి భారతసాధ్విగాదె;**
**తన సత్యమహిమచే దావాగ్ని చల్లార్చె ధృతి**
**చంద్రమతి భారతీయ గాదె;**
**కుల సతీత్వము అగ్నిగుండాన ప్రకటించె**
**సీత భారత ధరాజాతగాదె;**
**కినిసి దుర్మద కిరాతునిభూతి గావించె**
**దమయంతి భారతరమణిగాదె;**

**సత్త్వసాగర పరివేష్టి తత్త్వతలము భరతజాతి**
**పాతివ్రత్య ప్రభవమైన భావసంపన్నతకు కాదె**
**పంటభూమి అఖిలదేశాలకిది ఉపాధ్యాయి కాదె!**

గృహలక్ష్మి, ధర్మపత్ని, ఇల్లాలు అని కేవలము పెద్ద పెద్ద బిరుదులు సంపాదించి, దానికి తగిన ప్రయత్నములలో ముందంజ వేయక నిస్పృహతో, నిరాశతో ఉండుటచే ఇతరులపై ఆధారపడవలసి ఉంటుంది.

స్త్రీల వల్లనే పిల్లల అభివృద్ధి, భవిష్యత్తులోని భావిభారత పౌరులకు, అవతార పురుషులు, మహనీయులు వీరందరికీ స్త్రీల యొక్క మహిమా గుణముల చేతనే అంతటి జన్మ లభించినది. ఇలాంటి మహనీయులకు జన్మస్థానమందించే పవిత్ర మాతృమూర్తులు స్త్రీలు. ఇటువంటివారున్నప్పుడే మన భారతదేశము నిత్యకళ్యాణము, పచ్చతోరణముగా ఉంటుంది. స్త్రీలు వినయవిధేయతలతో కన్నతల్లిదండ్రులను, అత్తమామలను, కట్టుకున్న భర్తను అణకువతో సంతృప్తిపరచాలి. వారి హృదయములను ఉప్పొంగింపచేసి, ఆనందపరచే ఆదర్శ జీవితం గడపాలి. ఆడవారియందున్న మాటలే మాణిక్యాల వంటివి. మాటతో మాధుర్యమును సాధించవచ్చు. అటువంటి మాటలతో, చేష్టలతో భారతదేశము యొక్క పేరును నిలబెట్టాలి.

## 13. ఉద్యోగములు-ఉవిదలు

### (అ). గృహమును దిద్దు గృహిణి ఎవరు?

**ఉద్యోగములు చేయ ఉవిదలందరు పోవ**
**గృహ కృత్యములు తీర్చు గృహిణులెవరు?**
**ఆలుమగలిరువురు ఆఫీసునకు బోవ**
**గృహమును దిద్దు గృహిణులెవరు?**
**పరబాలురకు నేర్ప పాఠశాలల కేగ**
**తన బాలురకు నేర్పు తల్లులెవరు?**
**పుస్తకాల్ చేపట్టి పురుషులవలె బోవ**
**వంటయింటిని దిద్దు వనితలెవరు?**
**డబ్బు వలన కలుగు ఇబ్బంది తీరిన**
**ఇంటిలోని కొరత ఎంతయుండు.**
**సుఖము చూడబోవ సున్నయే ఉద్యోగి**
**పదవియందున్న పడతికెపుడు.**

పరబిడ్డలను నూరు మందిని తీర్చిదిద్దేకంటె మన బిడ్డలిద్దర్ని తీర్చిదిద్దుకుంటె జీవితము సుఖవంతమవుతుంది. బయటి పిల్లలకు నీతులను బోధిస్తూ తన బిడ్డలను తీర్చిదిద్దలేకపోవటం హాస్యాస్పదము. సాధ్యమైనంతవరకు తమ బిడ్డలకు ముందు మంచి నేర్పాలి. దుర్గుణములు వారియందు చేరకుండ సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస, పరోపకారము మొదలగు సద్గుణములను నేర్పాలి.

నిత్యజీవితములో ఆధారమైన పెద్దలయందు వినయ, భయ, విధేయత, విశ్వాసము, పాపభీతి, దైవప్రీతి వారికి నేర్పవలెను. తల్లిదండ్రుల యాజ్ఞ శిరసా వహించే ఉత్తరపాఠము నేర్పాలి. ఈ విధముగా తల్లిదండ్రులు తమ బిడ్డలను తీర్చిదిద్ది యాదర్శవంతులుగా తయారుచేసే పనికి పూనుకోవాలి.

## (ఆ). సుఖము సున్న

**ఉద్యోగము చేయ ముదితలందరు పోగ**
**గృహకృత్యములను తీర్చు గృహిణులేరి?**
**ఆలుమగలిరువురు ఆఫీసులకు పోవ**
**బిడ్డలను పోషించు తల్లులేరి?**
**పుస్తకాల్ చేపట్టి పురుషులవలె పోవ**
**వంటయింటిని దిద్దు వనితలేరి?**
**దుడ్డువలన గలుగు ఇబ్బంది తీరిన**
**ఇంటిలోని పనులకొరత యెంత యుండు;**
**సుఖము చూడబోగ సున్నయే**
**ఉద్యోగపదవి యందున్న పడతికి.**

ఈనాడు స్త్రీలు చాలామంది విద్యావంతులుగా, విద్యాభిమానులుగా, విద్యాధికారులుగా రూపొందుతున్నారు. వారిలో 100కి నూరుశాతం స్వార్థమే నిండియున్నది. వీరిలో స్వార్థమును వీడి, దివ్య భావముతో సేవ చేసెడివారు అరుదు. ఉద్యోగము చేయు స్త్రీలకు సుఖము కరువగుచున్నది. ఇంట గెలిచి రచ్చ గెలువమన్నారు మన పెద్దలు. గృహకృత్యాలు సక్రమంగా నిర్వర్తించుకున్న తర్వాత ఉద్యోగ ధర్మాన్ని నిర్వహించాలి. వివాహితయైన స్త్రీని గృహిణి, ఇల్లాలు,

ధర్మపత్ని, గృహలక్ష్మి అన్నారు. ఇల్లాలు తన బిడ్డలకు వినయం, విధేయత, క్రమశిక్షణ, విద్యాబుద్ధులు గరపాలి. వారిని పవిత్ర భావాలతో ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్ది దేశానికి అందించాలి. కుటుంబ గౌరవాన్ని కాపాడాలి. తమ కుటుంబాన్ని ఆదర్శ కుటుంబంగా నిరూపించాలి. అంతేగాని ధనం సంపాదించడము ముఖ్యాంశము కాదు.

## 14. ఈనాటి విద్యా విధానము

**మాథమాటిక్సు మరువక పఠియించు**
**గణితశాస్త్రము వంక కనగబోరు;**
**అమెరికా మార్గంబు అరయచూచునుగానీ**
**కాశికా మార్గంబు కానరాదు;**
**ఆల్జీబ్రా అంతా అరయచూచునుగానీ**
**యింటి వైశాల్యంబు యెరుగలేదు;**
**వృక్షశాస్త్రమెరుగు సమృద్ధిగాను**
**తులసి ఉపయోగమెరుగడు;**
**అనుదినంబు డ్రిల్లు ఆచరించునే గాని**
**పద్మాసనము వేయ బాధపడును.**

అనవసరమైన అక్కరకు రాని అనేక అల్ప విషయములు మన హృదయములో నింపుకో ప్రయత్నిస్తున్నాంగానీ అక్కరకు కావాల్సింది ఒక్కటైనా నింపడం లేదు. ఈనాటి విద్యా విధానమునందు నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక భావములు ఏమాత్రమూ లేకపోవుటచేత తన మానవత్వమేమిటో గుర్తించుకోడానికి ప్రయత్నించలేకపోతున్నాడు. అన్ని రకములైన భౌతిక ప్రపంచము యొక్క స్వరూపాన్ని గుర్తించడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈనాటి చదువులు ఈ విధమైన అస్తవ్యస్తములో మునిగిపోతున్నాయి. కనుక మనయొక్క దివ్యత్వాన్ని గుర్తించుకునే నిమిత్తమై ఆదర్శ ఆత్మవిద్యను అభ్యసించడం అత్యవసరం. విశ్వమునకంతా భగవంతుడే విత్తనము. విశ్వమే వృక్షము. వృక్షము యొక్క ఫలమే మానవత్వము. ఈ మానవత్వమనే దివ్యత్వాన్ని చవిచూడకుండా ఆకలి తీర్చుకొనకుండా మనం కాలమును వ్యర్థము గావిస్తున్నాము.

'జంతూనాం నరజన్మ దుర్లభం' పవిత్రమైన మానవజన్మ ఎత్తి కూడా తన తత్వమేమిటో గుర్తించుకోలేక, లౌకికమైన సుఖసంతోషాలకు భోగభాగ్యాలకు మానవుడు అఱ్రులు చాచుచున్నాడు కానీ అంతర్ముఖమైన ఆత్మతత్వాన్ని గుర్తించుటకు ఏమాత్రమూ ప్రయత్నించటము లేదు. మానవునియందు మానసిక పరిణామము ఏర్పడినప్పుడే లోకకళ్యాణము, లోకక్షేమము ఏర్పడుతుంది.

## 15. ఆత్మరూపుడు

**చావు పుటుక లేనట్టి శాశ్వతుండు**
**ఆది మధ్యాంతరహితు డనాది వాడు**
**తాను పుట్టక చావక చంపబడక**
**ఆత్మరూపుడై తాను వెలసి ఉండు.**

భగవంతునియందు నిర్గుణం, నిరంజనం, గుణతనం, నికేతనం, నిత్యశుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మలత్వం ఉంటుంది. నిర్మలము, నిస్వార్థము రెండూ యదార్థ నేత్రములు. సాయి యొక్క ప్రేమతత్వాన్ని, విశాలమైన భావతత్వాన్ని గుర్తించుకోవడం చాలా కష్టం. సాయి ప్రేమతత్వాన్ని వెల్లడించే నిమిత్తం, విప్పి చూపించే నిమిత్తం ప్రయత్నిస్తున్నాను. అందరూ కళకళలాడుతూ, కిలకిల నవ్వుతూ ఉండాలి అనే ఉద్దేశ్యమే నాకు. అందరి ఆనందమే నా ఆహారము. అట్టి ఆహారము నేను భుజించుటకై అనేక విధములైన ప్లానులు వేస్తుంటాను. నాకు ఆనందం కావాలనుకున్నప్పుడు మీకు ఆనందాన్ని అందించి, నేను ఆనందాన్ని తీసుకుంటున్నాను. అందుకే నా యొక్క మార్గమే నా మెసేజ్. My life is my message అన్నాను. ఇది దైవము యొక్క గుణము మాత్రమే కాని వేరొకటి కాదు.

అట్టి దైవాన్ని దేవాలయమునందో, క్షేత్రమునందో, ధ్యానమునందో చూస్తామనుకోవడం కేవలం భ్రమ. సజీవ మానవునియందే దైవత్వాన్ని చూడలేనివాడు నిర్జీవమైన రాళ్లయందు ఏ రీతిగా చూడగలడు? మానవునియందు దైవత్వాన్ని ప్రేమపూర్వకంగా చూసినప్పుడే నిజతత్వము ఆకర్షకంగా రూపొందుతుంది.

మానవునికి ఆత్మవిశ్వాసం అత్యవసరం. ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడే ఆత్మానందం. ఆత్మానందం లభించినప్పుడే సర్వసంగ పరిత్యాగి అవుతాడు. సర్వసంగ పరిత్యాగి అయినప్పుడే సర్వేశ్వరత్వం ప్రాప్తిస్తుంది.

## 16. బ్రహ్మ నీకిచ్చిన బరువుమాలను ప్రేమమాలగా మార్చుకో

**తల్లిగర్భము నుండి జన్మించినపుడు**
**కంఠమాలలనేవి కానరావు**
**మంచియైన చెడుయైన త్రుంచకుండ**
**బ్రహ్మ నాకిచ్చి పంపును బరువుమాల;**
**కర్మల నీవు చేసిన కంఠమాల.**

ప్రకృతి అద్దము వంటిది. ఎట్టి కర్మలు చేస్తే అట్టి ఫలితము తిరిగివస్తుంది. కర్మసిద్ధాంతమును అంగీకరించకపోయినను ఫలితము మాత్రమే తప్పదు. ఇది చేతు, అది చేతు, ఇంకెన్నియో చేతు అని ఊహల్లో అలసిపోకు. ఏ విత్తును నాటి, ఇచ్చోట నుంటివో ఆ ఫలములే నీకు చెందుచుండు. విత్తనములు ఒకటియైన, వేరే ఫలములు ఎట్లు లభించుట సాధ్యమగును? కర్మల కంఠమాల నాకు కనుపించదు. కాని అది ఉంటుంది. ఆ మాల మీకు లేకుండా ప్రేమమాలతో ప్రశాంతిలో కర్మలు ఆచరించాలి. భగవంతుని పొందే మార్గం వెతకాలి. ప్రేమకు మించిన ఫలితము ఆ గుత్తిలో కూర్చరాదు. భగవంతుడు నిన్ను ప్రేమించేటట్లు చేయాలి. కనుక ఏ కర్మలాచరిస్తే, ఏ విధముగా ప్రవర్తిస్తే, ఏ విధముగా జీవిస్తే, ఏ విధముగా అర్చిస్తే, దైవముయొక్క ప్రేమను పొందగలరో ఆ విధమును యోచించాలి. నిత్య జీవితములో హృదయపూర్వకముగా ప్రేమించి, చేయవలసిన కర్మలను దైవ ప్రీత్యర్థముగా చేయాలి. కాబట్టి Be good, see good, do good. That is the way to God.

## 17. సుఖ దుఃఖములకు కర్మమే కారణము

**(అ) కర్మమున పుట్టు జంతువు**
**కర్మముననె వృద్ధి పొందు, కర్మమున చెడున్**
**కర్మమె నరులకు దైవము**
**కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలో.**

**(ఆ) కర్మమున పుట్టుజంతువు,**
**కర్మముననె వృద్ధిచెంది, కర్మముననె జనున్**
**కర్మమె నరునకు దైవము**
**కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలోన్.**

శాస్త్రవిహిత కర్మములన్నియు యజ్ఞముతో సమానములు. యజ్ఞము శ్రుతి, స్మృతి ప్రతిపాదితము. బలిచక్రవర్తి త్యాగమయుడు. గొప్ప సాధకుడు. శుక్రాచార్యుడు కేవలము బోధకుడు మాత్రమే. ఆచరణ లేని ఏకాక్షి. శ్రవణ, మనన, నిధి, ధ్యాసలు ఫలప్రదాతలగును. పవిత్రమైన భగవత్స్వరూపాన్ని గ్రహించాలంటే మానవుడు పరిపూర్ణుడు కావాలి. కష్టాలు, సమస్యలు కర్మఫలములు. మూర్ఖుడు దేహాత్మ బుద్ధి కలవాడు. గాలి ఉన్న బంతికి కాలిదెబ్బలు తగులును. గాలి అనే అహంకారం తొలగితే మానవునకు అఘాతాలు తొలగుతాయి.

ప్రతి కర్మ మనం తెలిసి చేసినా, తెలియక చేసినా మనకు తిరిగి చేరుతుంది. చెడ్డ చేసినా, మంచి చేసినా, ఏదో ఒక కాలంలో తిరిగి వస్తుంది. కనుక మంచి చేసి మంచిని అందుకోవడానికి సంసిద్ధులై ఉండాలి. కర్మమునకు కర్మయే మూలకారణము. కనుకనే పవిత్రమైన కర్మలయందు, నిష్కామకర్మలు, భగవత్ప్రీత్యర్థమనే భావంతో, చిత్తశుద్ధితో చేయటం, అనంతమైన ప్రేమతో నిర్మలమైన భావంతో ఉండటం, ఈ మూడింటిచేత దైవత్వాన్ని అతిసులువుగా చేరటానికి అవకాశం ఉంటుంది. నీవు ఎట్టి కర్మలు ఆచరిస్తావో అట్టి కర్మ ఫలితాన్ని భగవంతుడు అందిస్తాడు. నీవు సత్‌కర్మలు చేయక, ఎన్ని విధముల ప్రార్థించిననూ, భగవంతుడు ఆలకించవచ్చునుగానీ, ఆ ప్రార్థనలను అభీష్టము చేయడానికి ముందుకు రాడు.

స్వామి చేసినట్లు చేయటము, స్వామి చెప్పినట్లు చేయటము- ఈ రెండు రకములుగా చేయటముచేత భగవంతుని అనుగ్రహమును, సన్నిహితత్వాన్ని పొందటానికి అర్హులవుతారు.

## 18. కర్మఫలప్రదాత భగవంతుడు

**(అ) కర్మమున పుట్టు జంతువు**
**కర్మముననే పుట్టి వృద్ధి పొంది కర్మమునే చనున్**
**కర్మమే, నరులకు దైవము**
**కర్మము సుఖదుఃఖములకు కారణమిలన్.**

**(ఆ) కాంక్ష తోడ నెందు కర్మంబు లొనరింప**
**దక్కబోదు ఫలము ధరణియందు**

**కాంక్ష వదలి భక్తికర్మలాచరింప**
**ఫలిత మొసగును పర్తివిభుడు.**

భగవంతుడు కర్మఫల ప్రదాత. మానవుడు కర్మదాత. కర్మ చేయుటలో నతనికి అధికారము కలదు. కాని భగవంతుడందించు కర్మఫలమును వద్దనుటకు కాని, తిరస్కరించుటకు కాని అధికారము లేదు. తాను కర్మకు కర్త అని భావించుచున్నాడు. అయితే చేయు ప్రతి పనికి తానే అధికారి అయినప్పుడు చేయు కార్యములన్నియు సిద్ధింపచేయవలయును. కాని అవన్నియు సిద్ధించుట లేదేమి? భగవద్గీతయందు కూడ కృష్ణుడు 'మాఫలేషు' అన్నాడే కాని 'న ఫలేషు' అనలేదు. అనగా కర్మఫల త్యాగము నీ కర్తవ్యము; ఫలమే లేదనలేదు. మన సకల అనుభవములనూ కర్మఫలముగా భావింపవలయును. ఆనందం దైవ ప్రసాదం. దుఃఖం దైవప్రసాదం. కష్టం దైవ ప్రసాదం. సుఖం దైవ ప్రసాదం. కనుక ఏదిచ్చినా భగవంతుడు మన మంచికే యిస్తాడని గుర్తించాలి. బుద్ధిని శుద్ధి చేసుకున్న సిద్ధి లభిస్తుంది.

మనము సద్గుణ పోషణకు ప్రయత్నించాలి. గుణముంటేనే స్థలం. గుణం లేకపోతే స్థలం లేదు. 'భగవంతుడా, ఎందుకు నాకీ కష్టాలు. నిందలు. నిష్ఠూరాలు? మంచిని చేకూర్చరాదా?' అని భగవంతుని తూలనాడటం మానవునికి పరిపాటి. అయిన పొరపాటు. కాని భగవంతుడేం చేయగలడు? కష్టాలు, నష్టాలు అతడందించటం లేదు. చెడుబుద్ధులు, ఇక్కట్లు అతడు కలిగించడం లేదు. తమ కర్మలే తమకు కలిగిస్తున్నాయి. మానవుల భావాలే అలా చేస్తున్నాయి. Postman నీకు వచ్చిన కవరు నీకిస్తాడు. దాన్ని ఎవరు వ్రాసారో తెలియదు. అందించేది కేవలము కవరు మాత్రమే. మానవుడు చేసే కర్మలనుబట్టి భగవంతుడు ఫలాన్ని అందిస్తాడు.

మీ కర్తవ్యం మిమ్మల్ని వదలదు. ఇంటా, కంటా, వెంట ఉండి రక్షిస్తాయి. ఏ కర్మ చేసేముందయినా, 'ఓ కర్మా, నన్ను అధోగతికి తీసుకుపోక, సక్రమంగ నిర్వర్తించునట్లు చేయించమ'ని ప్రార్థించాలి. 'తస్మైనమః కర్మణే'.

## 19. బుద్ధులు బండబారు

**ఎన్ని విద్యలు నేర్చి ఏమి ఫలము**
**చెడ్డబుద్ధులు తమ తల చేరెనేని**

**ఎండబారును, బుద్ధులు బండబారు**

మీ యొక్క బుద్ధులు చక్కనైన బుద్ధులుగా ఉంటే ఎంత కార్యమైనా మీరు సాధించవచ్చును. అట్లుకాక బుద్ధులు స్వార్థమైనవిగాను, లేక మాలిన్యమైనవిగాను ఉంటే మీరు చేయు సర్వకర్మలు నిష్ఫలములైపోతవి.

## 20. నామసంకీర్తనము

'శ్రవణం, కీర్తనం, విష్ణోః స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యమాత్మ నివేదనమ్. "నాస్తి నాస్తి మహాభాగా కలికాల సమం యుగం; స్మరణాత్ కీర్తనా దేవ ప్రాపోత్నతి పరమాంగతమ్".

హృదయ పరివర్తనమునకు కలియుగమందు నామస్మరణమే అత్యుత్తమ సాధన.

నామ సంకీర్తనము వలన మంచి శబ్దములను గాలిలో నింపి శుభ్రత, భద్రత రెండింటినీ బలపరచుటకు వీలున్నది. శబ్దముచేత మనస్సును మార్చుటకు ఎంతైనా అవకాశమున్నది. ఎట్టి శబ్దమో అట్టి ఫలితము. దైవమును ఆరాధన చేసి, కీర్తించి, నామస్మరణము చేసిన హృదయ సంస్కారము తప్పక లభించును.

సంకీర్తనమనగా సమ్యక్ కీర్తనం. అనగా విశేషరీతిగా చేసే కీర్తనము. పెదవులు, నాలుక, కంఠములతో పాడే శబ్దము మాత్రము కాదు. హృదయము నుంచి ఉప్పొంగే భావములను స్వేచ్ఛగా, ఆనందముగా పాడితే అది సంకీర్తనము. మిగిలినవి కీర్తనము కావచ్చు. స్వానుభవమును వెల్లడించేకొరకు, స్వసంతృప్తిని అందుకొనే నిమిత్తమై కీర్తన చేసినపుడు అది సంకీర్తన మనబడును. ఇతరుల నిందాస్తోత్రములకు చింతించక, భీతి భయములు లేక, సంకీర్తనము సలిపితే అది భగవంతునకర్పితమగును.

## 21. స్వార్థరహితుడే దేశనాయకుడు

**దేశ సేవకుండె దేశనాయకుడైన**
**స్వార్థరహిత సేవ సలుపగలడు**
**పదవి కోరువాడు పరిశుద్ధ హృదయుడా**
**చెప్పరయ్య మీరు ఒప్పుకొనెద.**

సామాన్యంగా లోకరీతిగా కర్మ అనగా ఏదో ఒక పని చేయటం అని అర్థం. మన నిత్య జీవితములో తెల్లవారినది మొదలు రాత్రి పరుండునంతవరకు చేసే కర్మలకు మనకు ఏవిధమైన పరిశ్రమ అనవసరం. కనుకనే ఈ కర్మలన్నియు జీవితమునకు అంకితమైనవి. ఇవి పారమార్థకమునకు చెందినవి కావు. ఈ కర్మలలోని నిష్కామ కర్మను మనం చేపట్టాలి. ఆత్మాభిమానంతో చేసిన కర్మ జీవితము నాదరిస్తుంది. కర్మ యొక్క పవిత్రతను గుర్తించుటకు చిత్తశుద్ధి కావాలి. కర్మ నిరంతరము ప్రవహించే నది వంటిది. దానియందు సృష్టియందలి చేతను చేతనములన్నియు పరిభ్రమిస్తున్నవి. ఈ కర్మ హృదయాన్ని విశాలం చేస్తుంది. చైతన్యాన్ని వికసింపచేస్తుంది. పవిత్రమైన కర్మ అహంకారాన్ని నిర్మూలం గావిస్తుంది. ఆత్మానందాన్ని చేకూరుస్తుంది.

స్వార్థరహితమైన భావాలు హృదయంలో చేర్చుకొనుటచే నిష్కామకర్మ సాధ్యమవుతుంది. నిష్కామకర్మ మానవుని యందలి పశుత్వాన్ని నిర్మూలం చేసి దివ్యత్వాన్ని ప్రసాదిస్తుంది. కేవలము ధ్యాన, జప, భజనాదుల వంటి కర్మలకంటె సేవయే పవిత్రమైనది. ధ్యానము, యోగము, జపము, భజన- స్వార్థం నిమిత్తము, మానసిక శాంతికోసము, పుణ్యం కోసము ఆచరిస్తాము. ఇవి స్వార్థానికి సంబంధించినవి. మనం ఆశించవలసినది పరార్థసంయోగము; ఇది స్వార్థ రహితముగా ఉండాలి. ఈ స్వార్థరహిత, నిష్కామకర్మ మన నరములలో, కండరములలో, హృదయములో ప్రవేశించాలి. ఏది చేసినా, పరమాత్మ, పవిత్ర తృప్తి నిమిత్తమై ఆచరిస్తున్నామని, సర్వ కర్మలు భగవత్ప్రీత్యర్థం అని ఆచరించాలి.

## 22. మానవత్వం యొక్క పరిపూర్ణత్వం

**నరుని జీవితమ్ము నల్లుల మంచమ్ము**
**పుడమి నొడలు రోగముల కొంప**
**సంతసము అది ఎంతదూరమొ కదా**
**సత్యసాయి బాట నిత్యమాట.**

మానవుని ఉద్ధరించుటకు ధర్మార్థ కామ మోక్షములు ప్రధానములు అని అనుకోవడం పొరపాటు. అవి అర్ధసత్యములే కాని పరిపూర్ణములు కావు. భగవత్కరుణా కటాక్షము కోసము సగము జీవితాన్ని వినియోగించాలి. మన పురుషార్థములకోసం మిగిలిన సగం జీవితాన్ని వినియోగించాలి. అదే మానవత్వం యొక్క పరిపూర్ణత్వము.

## 23. సృష్టి స్థితి లయములు

**బ్రహ్మ సృష్టి చేయు బ్రహ్మాండమునెల్ల**
**విష్ణు దాని పెంచి వృద్ధిచేయు**
**పరమశివుడుద్రుంచు పాపిష్టి జీవుల**
**గురువు మూడు క్రియలు సలుపునొకడె.**

ఉద్యోగములన్నిటికంటె అధ్యాపకుని ఉద్యోగము బాధ్యత కలది. పవిత్రమైనది. అధ్యాపకుడు సత్యమార్గము నవలంబింపకున్న విద్యార్థులు చెడిపోవుదురు. తద్వారా సమాజము చెడిపోవును. విద్యార్థుల జీవితములు, భవిష్యత్తు, గురువుల చేతిలో నుండుట వలన గురువులు దాని పవిత్రతను గుర్తించి, బాధ్యతను గుర్తించి ఆచరణయందు ఆదర్శప్రాయముగా వారికి ఆనందము నందించుటకు పూనుకోవాలి. పిల్లలు మంచిని గాని, చెడునుగాని సులభముగా గుర్తిస్తారు. దానిననుసరించుటకు ప్రయత్నిస్తారు. కాన గురువులు సదభ్యాసమును కలిగియుండుటవల్ల వారిని మంచి మార్గమున తీర్చిదిద్దవచ్చును. గురువులు పాఠములు బోధించుటకే కాక వారి చిత్తములు ఆధ్యాత్మిక, నైతిక, ధార్మిక మార్గములందు నిలుపుటకు ప్రయత్నించాలి. గురువు బాధ్యతపై ఎంతయూ లోకము ఆధారపడియున్నది. ఎంతోమంది సద్గుణవంతులను లోకమునకందించిన వారవుతారు. ఇది ఒక భగవత్సేవగా భావించి ఏ విధమైన ప్రలోభాలకు విషయ వాసనలకు లొంగక, పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దటానికి గురువులు కంకణము కట్టుకోవాలి.

## 24. గురుడెవరు?

**సకల సద్గుణములు చక్కగా లేకున్న**
**వాడు గురుడు కాడు వాస్తవముగ.**
**సవినయుండుగాక సచ్చరిత్రుడెట్లగును?**
**ఉన్నమాట తెలుపుచున్న మాట.**

ఏ దేశమునకైననూ ముఖ్యముగా ఉండతగినవి మూడు ప్రాతిపదికలు. మొదటిది వస్తు ఉత్పత్తి. రెండవది రక్షణశక్తి. మూడవది సరియైన విద్య. వీటికి కారణభూతులైనవారు ఉత్పాదకులు, సేవకులు, అధ్యాపకులు. ఈ ముమ్మూర్తుల

యొక్క బాహువులపైననే మానవ ప్రపంచము ఆధారపడి యున్నది. ఇందులో ఏ ఒక్కటి నిరుపయోగమైనప్పటికిని, అన్నియును నిరుపయోగమగును. ఇవి ఒకదానికొకటి సమన్వయమైనటువంటివి.

శబ్దములకు వివిధ అర్థములు కల్పించుటే విద్య అని మానవులు భావిస్తున్నారు. ఇది సరియైనది కాదు. మనస్సు యొక్క తలుపును తెరపించునట్లు చేయునదే విద్య. దేశము యొక్క మంచి చెడ్డలన్నీ, అధ్యాపకులపైననే ఆధారపడి యున్నవి. అన్ని ఉద్యోగములకన్న అధ్యాపకుల ఉద్యోగము బాధ్యతతో కూడినట్టిది. కేవలము అధిక గ్రంథ పరిచయము చేసిన అధ్యాపకులు కారు. దేశమునకు, సమాజమునకు ఏనాడు సుఖశాంతులను అందింతురో ఆనాడే అధ్యాపకులు సార్థకతను నిలుపుకోగలరు. సత్యశీలతే హృదయాన్ని కరిగింపచేసే పవిత్రమైన శక్తి. ఇట్టి సత్యశీలమును అభివృద్ధి గావించే నిమిత్తమై పాఠశాలలు, హైస్కూళ్లు, జూనియర్ కళాశాలలు స్థాపించి, అలాంటి కార్యశూరులను తయారుచేసే ప్రయత్నమే సత్యసాయి ట్రస్టు యొక్క ప్రయత్నము. తద్వారా ఇలాంటి వీరశూరులను, క్రియాశూరులను, త్యాగశీలురను తయారుచేసి జగత్తుకు అందించే ప్రయత్నమే సత్యసాయి సంకల్పము.

## 25. నేటి గురువులు

**దేహభ్రాంతి లేని మోహమింతయు లేని**
**త్యాగనిరతులైన యోగవరులు**
**గురులు నాడు; నేడు గురులట్టివారలె?**
**సత్యమైన బాట సాయి మాట.**

ఉద్యోగములన్నింటికంటె అధ్యాపకుని ఉద్యోగము బాధ్యత కలది. పవిత్రమైనది. అధ్యాపకుడు సత్యమార్గము నవలంబింపకున్న విద్యార్థులు చెడిపోదురు. తద్వారా సమాజము చెడిపోవును. గురువులు సదభ్యాసమును కలిగియుండుట వలన విద్యార్థులను మంచి మార్గమున తీర్చిదిద్దుదురు. విద్యార్థుల జీవితములు, భవిష్యత్తు గురువుల చేతిలో నుండుట వలన గురువులు దాని పవిత్రతను గుర్తించి, బాధ్యతను తెలుసుకొని, ఆచరణయందు, ఆదర్శప్రాయముగా వారికి ఆనందమును అందించుటకు పూనుకోవాలి. గురువులు పాఠములు బోధించుటయే గాక వారి చిత్తములు ఆధ్యాత్మిక, నైతిక, ధార్మిక మార్గములందు నడుపుటకు

ప్రయత్నించాలి. గురువు తన బోధనలందు స్వానుభవముగా ఆచార ప్రచారములు చక్కగా వారికి అందించాలి. దురదృష్టవశాత్తు నేడు మన భారతదేశమున అట్టి పవిత్ర అవకాశములు లేకుండుటచే యువకులు అపమార్గమును పట్టుచున్నారు.

## 26. నిజమైన గురుడు

**త్యాగశీలుడైన యోగవరుడే గురుడు**

**దేహభ్రాంతియు లేక,**
**మోహమింతయు లేక**
**త్యాగశీలుడైన యోగవరుడు**
**గురుడు; ఇట్టివారలే**
**గురువులు, నాడు నేడు;**
**సత్యసాయి మాట శాంతిమాట.**
**సత్యమైన మాట సాయి మాట.**

ఇంద్రియములకు గోచరమైన అనేక మార్గముల నందించుచూ, కంటికి కనుపించునది, తనువును కదలించునది, మనసును మరపించునది, మనుగడను వెలిగించునది ఈ ప్రకృతి. ఇదే మానవునికి ప్రథమ గురువు. ప్రధాన గురువు. జాతి భేదము లేక జనులకాశ్రయమిచ్చి సమత్వమును చాటుచున్న తరువులు; చలి ఎండ, వానలను శాంతముగా, ఏకరీతిగా సహించుచున్న గిరులు; రేపు వాపోవలదనుచు సంతుష్టితో జీవించుచున్న విహంగములు– ఇవన్ని మానవులకు గురువులే.

గురుత్వమంటే దేహతత్వమును అతిక్రమించి, జయించి, ఇంద్రియముల ఉద్రేకానికి అవకాశమియ్యనివాడు. వ్యాసుడు వేదముల యొక్క పవిత్రమైన అంతరార్థములను వ్యాప్తి గావించాడు. భగవంతుని నిర్గుణత్వమునే వ్యాప్తి గావించాడు. ఆదర్శవంతమైన కథలుగా రచించి, విష్ణుతత్వమునే ప్రచారము చేసి, గురుస్థానములో నున్నవాడు వ్యాసుడు. అతడే నిజమైన గురువు.

## 27. సద్గుణము లేకున్న గురువులు కారు

**సర్వ సద్గుణములు చక్కగా లేకున్న**
**వారు గురువులు కారు వాస్తవముగ**

**సవినయుండుగాక సచ్చరిత్రుడెట్లగును?**
**ఉన్నమాట తెలుపుచున్నమాట.**

గుణాతీతుడు గురువు. గురువు అజ్ఞానమే దూరం చేసి, ప్రజ్ఞాన జ్యోతిని వెలిగించును. ఇట్టి శక్తి దైవమునకు తప్ప అన్యులకు ఏమాత్రము ఉండదు.

గురువులలో రెండు రకములున్నారు. 1) బాధ గురువులు. 2) బోధ గురువులు. బాధ గురువులు శిష్యులను పీడించి, వారిని రకరకములైన చిక్కులపాలు చేసి, ధనము ప్రోగు చేయుటకు అనేక యుక్తులు పన్నుదురు. బోధగురువులు నిశ్చల మనస్సుతో వినయ విధేయతతో తమ దగ్గరకు వచ్చి ఆశ్రయించువారికి హితోపదేశము చేయుదురు. వీరిద్దరికి అధికమైన గురువు అవతార పురుషుడు. అవతార పురుషుడైన గురువు తప్పులను శిక్షించి, మెప్పులను మెచ్చుకొని, అందరినీ ప్రేమించుచు, సరైన ఆధ్యాత్మిక మార్గమును తెలుపుదురు. వారి పూర్ణానుగ్రహము వలన క్షణములో జ్ఞానసిద్ధి కూడ కలుగును. వారి సంకల్పముచేత ఆధ్యాత్మిక మార్గమందు సులభముగ అభివృద్ధి నొందుదురు. అధఃపతనము కలిగిన వారిని కూడ ఉద్ధరింతురు. వారికి విశ్వాసముండిన  చాలు అనుగ్రహింతురు. జనుల హృదయభూమిని సాగుచేసి, ప్రేమ బీజములను, ఆనంద ఫలమునందిస్తారు. సృష్టి, స్థితి, లయము మూడునూ నెరవేర్చు శక్తి, అవతార పురుషునికి ఉండును. అందుకే “గురుస్సాక్షాత్ పరబ్రహ్మ” అని చెప్పేరు.

## 28. భగవదనుగ్రహమునకు గుణమే ప్రధానము

**వాల్మీకి ఎవ్వని వంశమునందు ఉద్భవించె?**
**నందుడు ఏ పల్లియందు పుట్టె?**
**ధరకుచేలుడెంతటి ధనము కలిగియుండె?**
**వసుధనేలిన హరిశ్చంద్రుడు ఎంత దానమునిచ్చె?**
**శబరి ఎంత శక్తి కలిగియుండె?**
**విదురునకు ఎంత వివరణ ఉండె?**
**హనుమానునకు ఎంత తెలివి యుండె? ...............**

భగవంతుడు కాలము, ధనము, వయస్సులను చూడడు. పరితాపమును గుర్తిస్తాడు. భగవదనుగ్రహమునకు గుణమే ఆధారము, ప్రమాణము అని మన చరిత్రలందు మహనీయుల దివ్యగాథలు నిరూపించినవి.

## 29. మొదట దుష్టగుణములు సూక్ష్మంగానే ఉంటాయి

**కొలది కొలదిగా పుట్టును తొలుత, చెదలు**
**కొరికి తినివేయు త్వరలోన కొయ్యలంత;**
**దుష్టగుణములు సూక్ష్మమై తోచు మొదట**
**పిదప నాశంబు చేయు నేపెద్దనైన.**

చెదలు చూట్టానికి మొదట చాల అమాయకంగా ఉండి అంత పట్టించుకోవలసిన అవసరం లేని కీటకాలుగా మనకు అనిపిస్తాయి. కాని అవి క్షణాల మీద అధికసంఖ్యలో అభివృద్ధి చెందుతాయి. చడీచప్పుడూ లేకుండా అవి కొయ్యచట్రాలనన్నింటినీ కొరికివేస్తాయి. చివరకు మనం నివసించే ఇంటికే మోసం తెస్తాయి. వానిని బాగా గమనించి జీవితానికొక గుణపాఠం నేర్చుకోవాలి.

మానవుడు ఉన్నతస్థితి పొందవలెనన్ననూ అధమస్థితి పొందవలెనన్ననూ మానసిక శక్తియే ఆధారము. మానవాభ్యుదయమునకు మానసిక శక్తి, భావశుద్ధి రెండునూ అత్యవసరము. మానవునికి రెండు విధములైన స్థితులు గలవు. ఒకటి హితము, రెండవది అహితము. మానసిక తరంగములయందున్న అంతర్దృష్టియే దీనికి ఆధారము.

భారతదేశంలోని యువకులు పాశ్చాత్య సంస్కృతి వ్యామోహంలో పడి, తమ సంస్కృతి, సంప్రదాయములను తృణీకరిస్తున్నారు. తల్లిదండ్రులను సేవించటం, పెద్దలయెడ గౌరవం, ఆర్తులను దయతో చూడటం, వినయం, నిరాడంబరత్వం, సత్యనిష్ఠ, ఆత్మగౌరవం అనే సద్గుణాలను విస్మరిస్తున్నారు. తాగుడు, నల్లమందు లాంటివి వాడడం, జూదం, చౌర్యం వంటి చెడ్డ అలవాట్లు, అభ్యాసాలూ ఎన్నో మారువేషాలలో మానవుల జీవితాల్లోనూ, వారి ప్రవర్తనలోనూ నిశ్శబ్దంగా ప్రవేశించి వారి నియమజీవితాలనూ, ఉత్తమ శీలాలనూ నాశనం చేస్తున్నాయి.

చెడ్డ సంకల్పముల వలన చెడ్డచూపే వస్తుంది; చెడ్డపలుకే వస్తుంది; చెడ్డ శ్రవణమే చేస్తాము. చెడ్డ ప్రదేశమునకే కాళ్లు నడుస్తాయి. ఈ చెడ్డ సంకల్పములనేవి సర్వాంగముల యందు ప్రవేశించి అన్ని చెడ్డకార్యములయందు వానిని ప్రవేశింపచేస్తాయి.

ఎట్టి మాయలమారి మనస్సునైనా మాధవానుగ్రహముచేత దాని మాలిన్యమును దూరము చేసి, పవిత్రమైన దివ్యమార్గాన్ని ప్రవేశింపచేయటానికి వీలుంటుంది.

## 30. విద్యార్థులు కోరవలసిన ది మంచి నడత-నైతిక గౌరవం

**మంచి కాలము పదవులు**
**మంచి బ్రతుకు కోరుచుందురు మనుజులు**
**కోరబోరు మంచిబుద్ధులు**
**జ్ఞానంబు మంచినడత**
**ఇంతకన్నను వేరెద్ది యెరుకపరతు**
**సాధుసద్గుణగణ్యులౌ విద్యార్థులారా!**

నేటి యువకులు భారతీయ సంస్కృతియదు అశ్రద్ధ చూపడం, అవాంఛ నీయమైనవానిని అనుసరించడం, అవిశ్వాసాన్ని ప్రకటించడం చేస్తున్నారు. యువకులైన బాలబాలికలలో తీరని అసంతృప్తి విరివిగా కనిపిస్తున్నది. ఎచ్చట చూచినను ఆందోళనలు, అలజడులు, తిరుగుబాట్లు- వీటి ప్రతిధ్వనులే వినిపిస్తున్నాయి. జీవితంలో మానవుడు ముఖ్యంగా సాధించవలసింది భగవత్ప్రేమ. ఈ ప్రేమతత్వాన్ని గుర్తించక, అర్థం చేసుకోక, అనుభవించక, జీవించిన ఎన్ని విద్యలు నేర్చినా వ్యర్థమే.

మానవులు తమలో నిమిడియున్న దివ్య విజ్ఞానాన్ని, మానవాదర్శములను తమ ఆచరణ ప్రబోధముల చేత సమాజములో ప్రచారము చేయడానికి తగిన ప్రయత్నము చెయ్యాలి. మానవుడు ఈనాడు విశ్రాంతి మందిరాలు నిర్మిస్తున్నాడు. కానీ శాంతి మందిరాలు నిర్మించడం లేదు. భగవత్ప్రేమకు మీరు పాత్రులైనపుడు శాంతి సంతోషాలను అందుకోవచ్చు. ఈ ప్రేమను పొందడానికి నైతిక గౌరవాన్ని నిలుపుకొని, ఆధ్యాత్మిక పవిత్రతను అలవరచుకుని, సామాజిక జీవితాదర్శమును గుర్తించాలి.

## 31. మంచి కోర్కెలు

**మంచి కాలము, పదవులు, మంచి బ్రతుకు**
**కోరుచుందురు మనుజులు**
**కోరుకోరు, మంచిబుద్ధులు, జ్ఞానంబు, మంచి నడత**
**ఇంతకన్నను వేరెద్ది ఎరుకపరతు**
**సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులారా!**

ప్రపంచములో, జీవితములో ఆనందదాయకమైన పదార్థము ఒక్కటే. అది ఆరోగ్యము. ఆరోగ్యము మహాభాగ్యము. ఇట్టి మహాభాగ్యమే మానవుని గమ్యము. ఆనందమయమైన, ఆత్మసందర్శమైన జీవితము నిమిత్తమై ఆరోగ్యము కాంక్షించాలి. హృదయము ఆనందమయముగాను, దేహము ఆరోగ్యముగాను ఉండాలి. ఈ రెండింటి సమ్మిళతమే దివ్యత్వము.

మానవునకు మానసిక ఆరోగ్యము, శారీరక కాయమునకు ఆరోగ్యము లేకపోవుటచే మానవుడు కష్టముగా జీవించుచున్నాడు. ధర్మ, అర్థ, కామ, మోక్షములను నాలుగు పురుషార్థములు సాధించుటకు ఆరోగ్యమే పునాది అని గుర్తించాలి. ఆధ్యాత్మిక మార్గమునకు ఆరోగ్యము అత్యవసరము అని భక్తులు గుర్తించాలి. ప్రాకృత సంబధమైన చింతలు, కోరికలు మానవునిపై దండెత్తవచ్చు సమయములో మానవుడు తన మానవత్వమును గుర్తించుటకు సద్గుణములు, సదాచారములు, సత్ప్రవర్తన అభివృద్ధి చేసికొనుటకు ప్రయత్నించాలి.

## 32. సర్వ చింతలబాపు సర్వేశ్వరుని భక్తికొనుడు

**పుట్టుట ఒక చింత**
**భూమినుండుట చింత**
**సంసారమొక చింత**
**చావు చింత, బాల్యమంతయు చింత**
**వార్థక్యమొక చింత,**
**చెడుపు చింత, కర్మలన్నియు చింత,**
**కష్టమొక చింత, సంతతమొక చింత వింత చింత;**

**సర్వ చింతల బాపు సర్వేశుభక్తికొనుడి**
**ఇకనైన ప్రజలార కోర్కెదీర**
**ఇంతకన్నను వేరెద్ది ఎరుకపరతు**
**సాధు సద్గుణగణ్యులౌ సభ్యులారా;**
**ధనధాన్యముల్ కలిగి, ధర్మగుణంబున్న**
**సంతతి లేదని చింతయుండు;**
**విద్యాధికారియై విప్రవీగుచునున్న**

**ఉద్యోగములు లేక వెతలుచుందు**
**కూటికి లేకను అల్లాడుచున్నట్టి**
**నిరుపేదలెందరో బిడ్డలుంద్రు.**

మానవుని జీవితము అనేక చిక్కులతో, చింతలతో, చికాకులతో పీడింపబడుచున్నది.. దేహ విశ్రాంతికి పూనుకొనుట లేదు. మానవునకు మానసిక శాంతి కోల్పోవుటచే దేహ అనారోగ్యముపై బలమగుచున్నది. మానసిక శాంతి లేని మానవునకు ఎన్ని దేహ సదుపాయములున్నా ఆనందము పొందలేడు. సర్వ రోగములకు, సర్వ అనర్థములకు మానసిక అశాంతియే మూలకారణము. కనుక ప్రప్రథమమున మానసిక శాంతి పొందు ప్రయత్నము ప్రతి మానవుడు చెయ్యాలి.

## 33. ముందున్నది మొసళ్ళ పండుగ

**అందము ప్రాయము శక్తికలదని నిక్కబోకుమా**
**ముందున్నది ముసలితనమ్మను మొసళ్ల పండుగ.**

ఒక్క పర్యాయము రోగిష్టివానిని, ముదుసలిని, శవమును చూచిన గౌతముడు సంసార సుఖాలను త్యజించి, లోకుల దుఃఖములను తొలగించడానికి బుద్ధుడైనాడు. కాని నేటి మానవులు ఎన్ని అట్టి దృశ్యములు చూచినా చలించరు. వారిలో మార్పు శూన్యము. వారు బుద్ధులు కారు. అన్నింటికి బద్ధులు.

ఈనాడు అందము, ప్రాయము కలవని గర్వింపవచ్చు. యవ్వనంలో విర్రవీగుదురు. ఇవి శాశ్వతములు కావు. భవిష్యత్తులో ముసలితనమున్నది. అందుచే అశాశ్వతమైనవానిని వదిలి, శాశ్వతమైన మోక్షమును పొందుటకు కృషి చెయ్యాలి. మోక్షమే మానవ జీవిత లక్ష్యము.

## 34. చిత్తశుద్ధి

**పంకజాక్షుని పూజ–పలు మారు సేయక**
**పరుల నిందించుట పాటియగునె?**
**విష్ణుసంకీర్తన–వీనుల వినకుండ**
**పరుల మెచ్చుట నీకు–భ్రాతియగునె?**
**శేషశయనుపూజ–చెలగిగావింపక**

**పరుల కీర్తించుట-భవ్యమగునె?**
**దామోదరుని గూర్చి-ధ్యానంబుచేయక**
**పరుల దోషములెన్న-భావ్యమగునె?**
**శ్రీరమానాథునెప్పుడు-చిత్తమందు**
**చింత చేసిన కలుగదే-చిత్తశుద్ధి!**
**ఇంతకన్నను వేరెద్ది-ఎరుకపరతు**
**సాధుసద్గుణగణ్యులౌ-సభ్యులారా!**

రాగద్వేషరహితమైన చిత్తము, అసత్యాదులతో కూడని వాక్కు, పాప పంకిలము కాని దేహము ఈనాడు మనకవసరం. కనుక మానవుని రాగద్వేషములను అరికట్టుటకై పవిత్రమైన సుగుణములను పెంపొందించడానికి, స్వార్థము, అసూయ, అహంకారము అనెడు ఈ మూడు పిశాచములను దూరము చెయ్యాలి. ఈ మూడు దుర్గుణములు ప్రవేశించిన, మానవత్వమును ఏమాత్రమూ గుర్తించుటకు వీలు కాదు. స్వార్థరహిత సేవకు ముందంజ వేయాలి. నిశ్చలమైన భావము, నిస్వార్థమైన హృదయము పెంచుకోవాలి. భక్తిప్రపత్తులు అభివృద్ధి గావించుకోవాలి. ఏది చేసినప్పటికీ భగవదర్పితంగా భావించి ఆచరించాలి. సర్వత్రా నిండిన సర్వేశ్వరత్వాన్ని మానవుడు హృదయం నిండా నింపుకోవాలి.

## 35. ఆత్మతత్వము

**చిత్తశుద్ధిలేని రిత్తసాధకులకు**
**ఆత్మతత్త్వమబ్బుటెట్లు?**
**ఆత్మతత్త్వమబ్బు అతిశుద్ధబుద్ధికే**
**ఉన్నమాట చెప్పుచున్నమాట.**
**(సత్యమైన మాట సాయి మాట)**

మానవుని యొక్క సర్వ అశాంతులకు మమకారమే కారణము. ఏనాడు మమత, అహంకారములను నిర్మూలింతురో ఆనాడు మానవునిలో మానవత్వము ఆవిర్భవించును. మమకారము లేనిచోట ధైర్యము, ఆనందముండును. మమకారమునకు బదులు ప్రేమను పెంచుకొనుట అవసరము. ప్రేమ మానవుని స్వరూపము. స్వభావము. ప్రేమ హృదయములో ఉద్భవించును. మమకారము కల్పితము ప్రేమ, మమత్వములు బింబి ప్రతిబంబములవంటివి. ప్రతిబింబములో

మార్పు రావచ్చును. కాని బింబము తరుగదు. అంతులేని ఆశలు, మమకారములచే అశాంతికి గురై ఆరోగ్యము పాడుచేసుకొని, జీవితమును అంతము చేసికొనుచున్నాడు, మానవుడు. మమత అహంకారములను పిశాచములు నిర్మలమైన, దివ్యత్వమనెడి ఆత్మతత్వము గోచరించును. ప్రేమను పెంచుకొనిన మధ్యలో వచ్చిన సంయోగ, వియోగములు బాధించవు. అందుచే మమకారము తగ్గించుకొని, ప్రేమను పెంచుకొనిన లోకాస్సమస్తా సుఖినోభవంతు సాధ్యమగును.

## 36. ఆత్మ

**కంటిగ్రుడ్డుకు కాటుక అంటనట్లు**
**జిడ్డు జిహ్వాకు ఏ రీతి అంటనట్లు**
**ఖరద పుష్పముకే తాకనట్లు**
**దేనికంటకయుండు ఆత్మ ఎందు.**

గీతలో చెప్పబడినట్లు 'నిర్మమా, నిరహంకారః', మానవులలో మమత, అహంకారములు నిర్మూలమైన దివ్యమైన, పవిత్ర ఆత్మతత్వము గోచరించును. సర్వదేవతామయమైన తత్త్వమే ఈ మానవ తత్వము. సర్వమును తనయందే ఉన్నది కాని, తాను ఈ ప్రపంచమునందు లేదు. దాని తత్త్వమును గుర్తించు ప్రయత్నము మానవునకు అవసరము.

## 37. ఆత్మానందము

**ఆత్మతత్వమెరుగ ఆనందమగును,**
**తత్వమెరుగకున్న తాపమగును.**

మానవుడు తాను ఆచరించు సర్వకార్యములలో దైవమున్నాడని నమ్మవలెను. భగవంతుడు ఏదో ఒక ప్రత్యేకమైన ప్రదేశములో ఉన్నాడు కాని హృదయస్థాయి అని నమ్మకపోవుటచే భగవంతుని సర్వాంతర్యామిగా గుర్తించుట లేదు. ఎక్కడ చూచినా, ప్రతిచోటా ఆత్మస్వరూపుడై సర్వత్రా నివసించుచున్నాడు భగవంతుడని తెలుసుకోవాలి. అప్పుడే తనలోని దివ్యతత్వాన్ని మానవుడు గుర్తించగలడు. చెప్పుట సులభము, చేయుట కష్టము, ధూతకైన వాని తాతకైన అన్నటువంటి పెద్దలు భారతదేశంలో ఎక్కువగా ఉండుటచే ఆధ్యాత్మిక మార్గము కష్టమై, నాస్తికులు పెరిగిపోతున్నారు.

## 38. సూత్రధారి

**జీవుడనే దేహమందు దేవుడుండు**
**రెండు కూడి ఆటలాడి ఒకరినొకరు వీడుచుండ్రు**
**బొమ్మలాట లాడించే సూత్రధారి ఒకడుండు**
**చూడ రెండు ఉన్నప్పటికి ఒకటిలోనే రెండు ఉండు.**

మానవత్వము దైవత్వము అనునది ఏకత్వముతో కూడినది కాని భిన్నత్వములో చేరినది కాదు. మానవుడు తనదైన తత్వాన్ని, మానవత్వాన్ని గ్రహించవలసిన అవసరం ఉంది. మానవునిలోని లోతుతత్వము మానవత్వము. అందులోని దివ్యత్వము, దైవత్వముగా భావిస్తూ రెండూ ఒకే ఒకటి అను సత్యము గుర్తించాలి.

నీవు మానవుడు, మానవుడు అని చింతించినంతవరకు నీకు ఆత్మతత్త్వము అర్థము కాదు. నేను ఆత్మను, ఆత్మను అను యదార్థ స్థాయికి చేరాలి. నీవు ఆత్మతత్త్వములో లీనమై దాని పవిత్రతను గుర్తించిన, దాని దివ్యత్వాన్ని గుర్తించిన, నీవు ఈ దేహ, ప్రాణతత్వములను చూడవు. దైవము మీ యందే ఉంది. దైవత్వములోనే ఆవిర్భవించును. ఈ దివ్యత్వమును గుర్తించుటకు కొంత శ్రద్ధ కావాలి. 'శ్రద్ధా వాన్ లభతే జ్ఞానం' అని అందుకే అన్నారు. కేవలం శ్రవణమే కాక, మనన, నిధి, ధ్యాసనాలలో అభివృద్ధి చేయు కృషి సలపాలి.

## 39. దివ్యత్వము-బాహ్యాత్వము

**గోడ కట్టువాడు గోడతో పాటుగా**
**పైకి పోవుచుండు భాగ్యవసతి!**
**బావి త్రవ్వువాడు బావితో పాటుగా**
**అడుగు భాగంబునకు అరుగుచుండు.**

ప్రవృత్తి పరిస్థితిని పురస్కరించుకొని మానవుడు తన అంతర బోధనలు సంస్కరింపచేసుకుంటాడు. దివ్యత్వములోని ఆత్మతత్త్వమును గుర్తించుటకై అనేక ప్రయత్నములు చేస్తాడు. బాహ్యతత్వమునకు లోనైన తన జీవితమును వ్యర్థము చేసుకుంటాడు. ఈ రెండు పరస్పర విరుద్ధమైనవి. ఈ రెండింటిని సమన్వయపరచవలెను.

## 40. సర్వసాక్షి

**చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు**
**ఆది మధ్యాంతరహితు డనాదివాడు**
**తాను చావక, పుట్టక, చంపబడక**
**అన్నిటను సర్వసాక్షియై ఆత్మవెలుగు.**

ఆత్మతత్త్వము నిరంతరము తనకు తాను ఉంటుంది. పదార్థ సంబంధమైన ప్రపంచము, పరుల నిమిత్తమై ఉంటుంది. ఇట్టి పదార్థ స్వరూపమైన ప్రపంచమందు అనేకత్వమును ధరించి, ఏకత్వమనే సత్యాన్ని ఇముడ్చుకొని, తద్వారా దివ్యత్వమును ప్రకటిస్తుంటుంది. ఏకత్వమనే తత్వాన్ని ప్రతి మానవుడు గుర్తించడం అత్యవసరం.

నిజముగా ఆత్మతత్వము వస్తువులను ప్రకాశింపచేస్తుంది. కాని మరొక్క చైతన్యముచేత ప్రకాశింపబడేది కాదు. దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, అంతఃకరణము- ఇవన్నియు ఆత్మయొక్క ఉపాధులే. ఆత్మతత్వమునకు మార్పులుండవు. అది శుద్ధ చైతన్యము. దేహమునకే చావుపుట్టుకలు; పరిణామ క్షీణములు; అభివృద్ధి అసంతృప్తులూను. ఆత్మకు ఇట్టి పరిణామములుగాని, క్షీణదశలుగాని, చావుపుట్టుకలుగాని ఉండవు. ఆత్మ ఒక్కటే యైనప్పటికినీ, తన జ్ఞాన ప్రకాశమును సర్వత్రా వ్యాపింపచేస్తుంది. సూర్యునకు ప్రకాశము, వేడి ఉన్నట్లే, ఆత్మతత్వమునకు ప్రకాశము, ప్రదీప్తము- స్వరూపము, స్వభావము అను రెండు శక్తులున్నాయి.

## 41. సర్వ వేదాంత గ్రంథాల సారము

**సర్వ వేదాంత గ్రంథాల సారమెల్ల**
**ఒక్క వాక్యాన చెప్పుదు ఒక్కసారి**
**అఖిల భూతములందున్న ఆత్మ, నామ**
**మొక్కటేయని మనసున నుండవలయు**

నీవు ఆత్మవు. పరమాత్మ అంశము అనునదే సత్యము. అది సముద్రమునకు అలకు గల సంబంధము వంటిది. అసత్యమును తెలుసుకొనుటే మానవుని జీవిత లక్ష్యము. అన్ని ప్రాణులలోను ఉన్న ఆత్మ కూడా అదే అను సత్యమును కూడా గ్రహించాలి. అప్పుడు సృష్టి అంతటిలోను అంతర్గతముగా నున్న ఏకత్వమును, ఆ

ఏకత్వమునకు కారణభూతమైన సత్యమును గ్రహించినట్లగును.

ఆత్మకు అనాత్మకు, సత్యానికి అసత్యానికి మధ్యనున్న తెరను, అరను, పొరను యేనాడు దూరము చేతురో ఆనాడే మానవునిలో యేకత్వము అభివృద్ధి చెందుతుంది.

'ఈశావాస్యమిదమ్ సర్వమ్' అందరిలోను, నీలోను ఉన్నటువంటి పరంజ్యోతిని, ఆ తేజస్సును ఏనాడు దర్శింతురో, అదే హృదయ పరిపక్వత.

## 42. ఆత్మయే బ్రహ్మ-బ్రహ్మయే ఆత్మ

**సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మమగుచు**
**మేటి వస్తువునందు మేటి యగుచు**
**అంతటను సర్వసాక్షియై అలరునట్టి**
**ఆత్మయే బ్రహ్మ, బ్రహ్మయే ఆత్మ యగును.**

మానవుడు అనేక భ్రమలచేత మనస్సును నింపుకొనును. ఆధారమనే నీరు పాత్రలో ఉండిన ఆకాశము కనబడును. నీటిని పారబోసిన, నీటిలోని ఆకాశములో కనబడదు. అదేవిధముగ అనాత్మాభావమునకు మూలకారణమైన ఆశల్ని వదలిన, ఆత్మభావము ఆవిర్భవించును. పాత్రలోని నీటిని పారబోసిన, దానిని జ్యూస్‌తో నింపవచ్చును. నీటిలో జ్యూస్ వేసిన రెండూ పాడగును. అందుచే మానవునిలోని అనాత్మా భావమును వేరు చేసిన ఆత్మభావము పెంపొందును. ఈ ఆత్మభావము అధికమగుటకు జ్ఞానమవసరము. భేదభావము అభివృద్ధి చెందిన జ్ఞానము క్షీణించును. అందువలన జ్ఞానమనునది ఏకాత్మ భావముగా రావలెను. వాంఛలను త్యాగము చేసిన దైవభక్తుడుగా మారును. తనపై తనకు విశ్వాసము, నారాయణుని పట్ల భక్తి కలుగును.

అణుస్వరూపము, స్వభావములనుండే జగత్తంతా వ్యాపించుచున్నది. అణువు సర్వ పదార్థములందు చేరిపోయి ఉంటుంది. కాని ఆ అణువునందు వేరొక్కటి చేరటానికి వీలు లేదు. ఆత్మతత్వముగాని, బ్రహ్మతత్వముగాని అణుస్వరూపములో సర్వ పదార్థములందు వ్యాపించవచ్చును. కాని తనయందు ఏ పదార్థము వ్యాపించుటకు వీలు లేదు. సర్వపదార్థములందు ఈ అణుశక్తి వ్యాపించియుండుట చేత సర్వ పదార్థములు ఆత్మ స్వరూపములని స్పష్టమగుచున్నది. పదార్థములెన్ని మారినను, వానిలోని అణుశక్తి మారటానికి వీలు లేదు. అందుచే సర్వత్రా

వ్యాపించియున్న ఈ అణుశక్తియే ఆత్మస్వరూపమని, ఆ ఆత్మస్వరూపమే మానవత్వమని గ్రహించాలి.

## 43. పాపము

**దైవమనగ వేరు దేశమందున లేదు**
**దైవమనగ కలదు దేహమందే**
**పాపమనగ వేరు, పరదేశమున లేదు.**
**తాను చేయు పనుల తగిలియుండు.**

దైవము అనగా ప్రత్యేకించినటువంటి ఒక ప్రదేశములో కాని, ప్రత్యేకించిన ఒక స్థానమునందు కాని లేదను సత్యమును గుర్తించాలి. తన కర్మలయందే సర్వ పాపములు కూడా లీనమై ఉండును. పవిత్రము కాని, అపవిత్రము కానీ, ఘనమైనటువంటిది కానీ, హీనమైనటువంటిది కానీ, మంచిది కానీ, చెడ్డదికానీ, ప్రవృత్తి కానీ, నివృత్తి కానీ ప్రతి మానవుని యందును సమ్మిళితమైన స్వరూపమును ధరించియున్నది.

ఈ యావత్తు ప్రపంచము త్రిగుణ స్వరూపముగ రూపొందుతూ వచ్చినది. ఈ త్రిగుణముల చేతనే మానవులు బంధితులై, విషయవాసనలలో మునిగి, పంచేంద్రియముల యొక్క స్వాధీనములో బానిసలై, ఎంత కాలము జీవితము గడిపినప్పటికీ, ఏమాత్రము మీలోనూ అణుమాత్రమైననూ ఆత్మతత్వమును గుర్తించుకోలేకున్నారు.

## 44. పుణ్యము-పురుషార్థము

**చక్రములు లేని రథము**
**నీ రెరువులు లేని పంట**
**చంద్రకళలు లేని రాత్రి**
**సింధూరము లేని గృహిణి**
**వెన్న తీసినట్టి పాలు**
**రుచి, ప్రకాశములెట్లు కలిగియుండు?**
**భక్తిలేని జీవితంబు**
**పుణ్యమా? పురుషార్థమా?**

దేహము మృణ్మయము. ఆత్మయే చిన్మయము. దేహము ఆత్మకు ఒక దేవాలయము వంటిది. దేహము భగవంతుని ఊరేగించుటకు ఒక చక్కని రథము. రథము లేనిదే రథికుడుండుటకు వీలు లేదు. రథికుడు లేని రథముండుటకు వీలే లేదు. అందుచే దేహము కేవలము ఒక మట్టిముద్దగానీ, మాంసపు ముద్దగానీ కాదు; ఇది పవిత్రమైన ఆత్మకు దేవాలయము; ఇటువంటి పవిత్రమైన దేహమును, దివ్యత్వమనే ఆత్మతత్వము ఆధారముగా నున్న సత్యమును తెలుసుకొనుటకు ప్రయత్నము చేయాలి.

## 45. సత్యం-శివం-సుందరం

**చంద్రునికి కలువయే శృంగారం**
**సూర్యునకు తామరయే శృంగారం**
**సముద్రమునకు తరగలే శృంగారం**
**స్త్రీకి గుణమే శృంగారం.**
**గగనమునకు చంద్రుడే శృంగారం.**
**దైవభక్తునకు విభూతియే శృంగారం.**
**సర్వ రూప ధరం శాంతం, సర్వనామధరం శివం;**
**సచ్చిదానంద రూపమద్వైతం, సత్యం, శివం, సుందరం.**

నానా లౌకిక కోలాహలములతో నిండిన నగర సముద్రమునందు సంసార నౌకలో పయనించు వ్యక్తులకు ఆధ్యాత్మిక జ్యోతి, నావికులకు గమ్యస్థానము చూపించు లైట్‌హౌసులాంటిది. దానిని ప్రతివ్యక్తి తెలిసికొనవలసి ఉంది.

ప్రపంచం విశాలమైనది; కాలం అనంతం; ఈ శరీరం అశాశ్వతం. అనిత్యమైన అసత్యమైన ఈ శరీరమును సార్థకము చేసికొనుటకే మానవ జీవితము లభించినది. అందువలన మానవుడు జీవితపు నిజమైన కర్తవ్యమేమిటియని ఆలోచింపవలయును. ఆహార, నిద్రా, మైథునములు సర్వజీవులకు సమానధర్మములు. జ్ఞానము వలన మాత్రమే మనుష్యులకు జంతువులకంటె విశిష్టస్థానము లభించినది. 'జ్ఞానం నరాణాం అధికం, విశేషం; జ్ఞానే విహీనః పశుభిః సమానః' అన్నారు. అందుచే మానవుడు జీవితాన్ని సార్థకం చేసుకోవాలంటే ప్రజ్ఞాన, విజ్ఞాన, సుజ్ఞానములను పెంచుకొనవలెను.

## 46. చేసి చెప్పు

**చెప్పుట సులభంబు, చేయుట కష్టంబు,**
**ధాతకైన వాని తాతకైన,**
**చెప్పుటకంటెను చేయుట శ్రేయంబు**
**ఉన్నమాట తెలుపుచున్న మాట.**

ఈనాడు ఏది చేసినా, ఏది తలచినా స్వార్థముతోనే వ్యర్థులైపోతున్నారు. ఇక పరార్థము గుర్తించేదెప్పుడు? అనేక ఆశలు పెట్టుకుని మోసపోతున్నారు. వేదికలెక్కి ఉపన్యాసాలు చేస్తున్నారు. కాని చెప్పినవి చేయటము లేదే? చెప్పవచ్చు కోటి, చెయ్యరు ఒక్కటి; వేదికలెక్కి సోదరీ సోదరులారా అంటున్నారు. అందరము సోదరులము అనుకుంటున్నారు. కానీ నిజమైన సోదరులే ఆస్తి కోసం పోరాడుతూ సుప్రీంకోర్టుల వరకు పోతున్నారు. కనుక వట్టిమాటలుగా సోదరులమనుకోవటంకంటె, మిన్నయైన ఆత్మభావం పెంచుకోవాలి. దైవపితృత్వము, మానవ సోదరత్వము అప్పుడే సార్థకమవుతది.

ఈనాడు శ్రమ పడేవాడు కావాలి. వట్టిమాటలు చెప్పేవాడు కాదు. శ్రమపడటమే కర్మ. అప్పుడే మన భరతభూమి కర్మభూమి అవుతుంది. మీరంతా రాజకీయ, కుల, మత భేదాలకతీతంగా, పవిత్రమైన భావనతో, మీమీ శక్త్యానుసారము, మానవసేవయే మాధవసేవ లోకసేవయే లోకేశునిసేవ, జనసేవయే జనార్దన సేవ, జీవునిసేయే దేవునిసేవ అనే భావంతో సేవ చేస్తే మన దేశం ఇతరదేశాలకు ఆదర్శవంతంగా ఉంటుంది. స్వామి నా జీవితమే నాకు దేశం అంటూ చేసి చూపుతూ, చెప్పింది చేస్తూ మనకి ఆదర్శం అందిస్తున్నారు. మనం చేయవలసింది కూడా అంతేకదా!

## 47. పరిపూర్ణ ప్రేమ

**(అ) పూర్ణప్రేమయందె పుట్టును సౌఖ్యంబు**
**త్యాగసత్యశాంతి దాంతులకును**
**ప్రేమ తెలియకున్న క్షేమంబు లేదు కో**
**వినుడు భారతీయ వీరసుతులు.**

స్వార్థం కేవలం పశుగుణం. విశాలమైన మానవత్వం లోపల దివ్యత్వం

అనంతంగా ఉంది. స్వార్థం ఒక మరణం వంటిది. ఈ స్వార్థరహిత ప్రేమయే ఈశ్వర ప్రేమ. విశాలమైన ప్రేమభావాన్నిగాని తత్వాన్నిగాని తెలిసికొన్నప్పుడే జ్ఞానసిద్ధి లభిస్తుంది. సంకుచిత భావాలను దూరంగా నెట్టి ప్రేమతత్వంలోకి ప్రవేశించాలి. ప్రారంభంలో కొంత స్వార్థం అవసరమే. కానీ ఎంత కాలమైనా స్వార్థంతోనే బ్రతుకుతూ జీవితాన్ని వ్యర్థం చేయరాదు. అది మానవునికి సార్థకత కాదు. బైబిలులో చెప్పబడినట్లు 'చర్చిలో పుట్టడం మంచిదేకాని, చర్చిలో చావడం మంచిది కాదు'- స్వార్థం ప్రారంభంలో అవసరమేకానీ అందులోనే జీవితాన్ని అంకితం చేసికోరాదు. ప్రేమతత్వము వ్యక్తిత్వముతో సమాజ క్షేమము దేశ అభివృద్ధి ఈ మూడింటియొక్క సంయుక్త స్వరూపముగా రూపొందాలి; పవిత్రమైన ప్రేమయే ధర్మము యొక్క స్వరూపము.

**(ఆ) పూర్ణప్రేమయందె పుట్టును సౌఖ్యంబు**
**సత్యత్యాగశాంతి కాంతులకును**
**ప్రేమ లేకయున్న క్షేమంబు లేదయా**
**సత్యమైన బాట సాయి మాట.**

ప్రేమతత్త్వమును అభివృద్ధి పరచుకొన్నప్పుడు వ్యక్తిత్వము, సమాజము, దేశము ఈ మూడింటి యొక్క సంయుక్త స్వరూపముగా రూపొందుతూ వస్తుంది. పవిత్రమైన ప్రేమయే ధర్మము యొక్క స్వరూపము.

## 48. తత్త్వమెరిగిన-ధన్యుడు

**లోని శత్రువులకు లొంగిపోయినవాడు**
**బయటి రిపులనెట్లు పట్టగలడు?**
**తత్వమెరిగినంత ధన్యుడే నరుడిల**
**ఉన్నమాట తెలుపుచున్నమాట.**

సంకల్పించడమే మన స్వభావము. అది నిరంతరము సంకల్ప వికల్పములతో చింతిస్తుంది. ఒక్కొక్కసారి అది వక్రమార్గం పడుతుంది. సంకల్పవేగం మనస్సును తబ్బిబ్బు చేస్తుంది. అందుచే తీవ్రంగా పరుగెత్తే మనస్సు వేగాన్ని అరికట్టాలి. ఉద్వేగంతో కూడిన మనస్సు ద్వారా మానవుడు దివ్యత్వం పొందలేడు. అందుచే మనస్సుని భగవంతుని పాదపద్మములయందు, ముఖపద్మమందు ప్రవేశింపచేయాలి. ఇట్టి మనో నిగ్రహానికి ధ్యానం అత్యవసరము.

ఏకాగ్రతకు ధ్యానం ఒక సాధనం. ధ్యానం చేసేవ్యక్తి; ధ్యేయం- చేయవలసిన లక్ష్యం; ధ్యాసల ఏకత్వాన్ని ప్రయత్నించాలి. ధ్యాన, ధ్యేయం, ధ్యాసల సంపుటితో దానికి ధ్యానమనే పేరు సార్థకమైనది. దేహం, భావం దేవునియందు లీనం కావడమే ధ్యానం. ఇది ఇంద్రియాలకు అతీతమైనది.

ప్రతివ్యక్తీ దైవత్వాన్ని క్షణక్షణం ఆవిర్భవింపచేసుకుంటే దుర్గుణాలు అతనిలో ప్రవేశించవు. ఈ దివ్య ప్రబోధాన్ని, సర్వేశ్వరుని, నిరూపించునది ధ్యానం అని అర్జునునకు శ్రీకృష్ణుడు బోధించాడు. సత్వ, రజ, స్తమో గుణాల ఏకత్వాన్ని సాధించడానికి ధ్యానం అవసరం. ఈ ధ్యానం ద్వారా దైవత్వాన్ని గుర్తించాలి.

## 49. ప్రేమమయము బ్రహ్మంబు

**ప్రేమరూపము బ్రహ్మంబు, ప్రేమమయము**
**ప్రేమ ప్రేమతో సంధింప నామమగును**
**కాన ప్రేమను పూర్తిగా కలిగియున్న**
**అద్వితీయము చేరంగ నర్హుడగును.**

పవిత్రమైన జ్ఞానం ఉన్న చిత్తంలో కామ, క్రోధ, ద్వేష, అసూయ వంటి దుర్గుణాలు ప్రవేశించవు. అజ్ఞానం నిర్మూలం చేసుకోవాలంటే జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలి. సర్వకర్మలు జ్ఞానంలో లీనం కావలసిందే. సర్వమానవులు జాతి, మత, కులభేదాలు లేక, ఈశ్వరార్పితంగా, ఫలాపేక్షరహితంగా కర్మను ఆచరించాలి. ఇట్టి జ్ఞాన యజ్ఞానికి గుణం ప్రధానం. తల, హృదయం, భావాలే అర్పితములు. ఆనందం ఫలం. ఈ కర్మలను బ్రహ్మానందం, పరమానందం నిమిత్తం ఆచరించాలి. అన్యోన్య సంబంధాల్ని అభివృద్ధిపరచుకొని, ఈశ్వరధర్మాన్ని రక్షించాలి.

## 50. నీటిబుడగ

**నీటియందు పుట్టి నీటనే తేలుచు**
**నీటియందడంగు నీటి బుడగ**
**నరుడు బుద్బుదంబు, నారాయణుడు నీరు**
**వినుము భారతీయ వీరసుతుడ.**

ఆశ పెద్ద నదివంటిది. కోరికలు నీరు, ఊహలే అలలు. కాంక్షలు మొసళ్లు. భ్రాంతులు సుడిగుండాలు. ఈ భయంకర నదిని దాటే సాహసం,

ధైర్యం ఒక్క యోగికే ఉంది. సామాన్య జగత్తులో నదులు పెరగడం, తరగడం, ఎండిపోవడం ఉంటుంది. కాని ఈ జీవనదికి కోరికలు నీరుగా ఉండడంచేత నీరు పెరగునదే కాని తరుగునది కాదు. ఈ నది యొక్క అంతు కనుగొనడం కష్టం. ఈ నదిలో జలం నిరంతరం సమృద్ధిగా ఉంటుంది. అందులో ఊహలు అనే గాలితరంగాలు అమితం. నదిని దాటుటకు నావ ఆధారం. ఈ నావ ఓంకారం. ఈ ప్రణవం శక్తిమంతం. శాశ్వతం. వేదాలలో ప్రణవం నేనే అన్నాడు కృష్ణుడు. భగవంతునకు ప్రణవం అనేది సార్థక నామం. క్రైస్తవులు ప్రార్థనలో ఆమెన్ అంటారు. ఈ పదం కూడా ఓంకార రూపమే. అట్టి ఈ శాశ్వతమైన ఓంకారాన్ని స్మరించి, ఆదిస్వరూపి, ఆదిశబ్ద, ఆదితత్వమైన దివ్యత్వాన్ని అర్థం చేసుకోవాలి.

నీటిబుడగ కల్పితం. కాని బుడగలో కూడా నీరున్నది. అక్షరంలో క్షరం లీనమై ఉన్నది. నీటిబుడగ నీటిలో పుట్టి నీటిలోనే లీనమైనట్లు ఆత్మలో పుట్టిన జీవులు ఆత్మలోనే లీనం కావాలి.

## 51. పరమాత్ముడు ఒకడే:
## అనేకత్వంలోని ఏకత్వం గుర్తించాలి

**అల్లాయంచు మహమ్మదీయులు**
**ఎహోవా యంచునున్ క్రైస్తవుల్**
**ఫుల్లా బ్జాక్షుడటంచు వైష్ణవులు**
**శంభోయంచు శైవులు సేవింపగా**
**ప్రహ్లాదంబున గొల్వ, అందరికి సంప**
**ల్లాభంబులొసగి రక్షించు**
**పరమాత్ముండొక్కడె యంచు భావింపుడీ!**

జనులు వారి వారి భక్తి ప్రపత్తులననుసరించి భగవంతునకు భిన్న భిన్న రూపాలను, నామాలను నిర్ణయించుకొనుచున్నారు. కాని సర్వమతాలకు, సర్వ సంప్రదాయాలకు అనుగుణమైన, అంగీకారయోగ్యమైన స్వరూప స్వభావము నేడు లోకంలో అత్యవసరం.

అక్షరం రూపం. ఓంకారం నామం. ఆధ్యాత్మికమే దాని భావం. ఇది సర్వ

మానవ సమన్వయమైన సత్యస్వరూపం. స్వభావం అంటే త్రిగుణములతో కూడినది కాదు. ఇది దివ్యప్రకృతి. ఈ దివ్యప్రకృతి నుండి సృష్టి ఆవిర్భవిస్తున్నది. ఏకాత్మగల దివ్యాత్మ స్వభావం అనేకత్వంలో ఆవిర్భవిస్తున్నది. ఏకం కాగలది దివ్యప్రకృతి అనేక స్వరూపాలను ధరిస్తున్నది. ఏకాత్మ క్షీణించదు. అభివృద్ధి చెందదు. అందుకే దానిని అక్షరం అన్నారు. సర్వమతాలవారు అక్షర స్వరూపాన్ని అంగీకరిస్తారు. ఒక్కొక్క అక్షరం ఒక్కొక్క దివ్యమంత్రం.

ఈ విశ్వం ఒక పెద్ద అంకె వంటిది. ఇదియే సమష్టి స్వరూపం. మనం దేహభ్రాంతిని విడిచిపెట్టి బ్రహ్మతత్వాన్ని తెలుసుకోవాలి. దివ్యమైన భగవతత్వాన్ని తెలుసుకోవాలి.

ఒక్కొక్క మతమువారు ఒక్కొక్క ఆరాధనను అంగీకరించారు. హిందువుల భగవంతుని ముస్లింలు అంగీకరించకపోవచ్చు. ముస్లింల ఆరాధనను క్రిష్టియనులు అంగీకరించకపోవచ్చు. కాని సకల మతములవారు అక్షరం అనే ఆధారాన్ని అంగీకరించక తప్పదు. అప్పుడే అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించవచ్చు.

## 52. శ్రీపతి కరుణవేడు

**పాపభయంబుపోయె, పరిపాటయిపోయెను**
**దుర్గుణంబులున్**
**శ్రీపతి భక్తిపోయె,, వివరించగలేని**
**దురంతకృత్యముల్**
**దాపురమయ్యె లోకమున, తాపసలోక శరణ్యుడైన ఆ**
**శ్రీపతి చేరు చింతనమే చేకూరచేయుదు,**
**రమ్ము, మానవా!**

దుర్గుణాలను తొలగించుకునేందుకు మానవుడు స్వయంగా ప్రయత్నించాలి. ప్రయత్నపూర్వకంగా దేనినైనా సాధించవచ్చు. కానీ మానవునిలో పవిత్ర ప్రేమతత్వం శూన్యమవుతున్నది. స్వార్థంతో సంకుచిత హృదయుడై నివసిస్తున్నాడు. అందుచే అనేక విధాల వేగంతో పరుగెత్తుతున్న చిత్తవృత్తులను, ప్రేమతో, జ్ఞానంతో అరికట్టాలి. ప్రతి వ్యక్తి స్వార్థరహితమైన ప్రేమను అలవరుచుకోవాలి. భగవత్ప్రీతికరమైన కార్యాలు చేయాలి. భగవంతుని ప్రేమకు పాత్రులైనప్పుడు

తెలిసియో, తెలియకో చేసిన పాపాలు క్షమించబడతాయి. ప్రేమమార్గాన్ని అభివృద్ధి చేసుకోవాలి. దివ్యత్వంలోని ఏకత్వాన్ని అర్థం చేసుకోవాలి. ఈ ఏకాత్మ భావాన్ని అనేకత్వంలో దర్శించాలి.

## 53. భారత భాగ్యవిధాత

**పక్వఫలము వృక్షమునుండి పడిన భంగి**
**జ్ఞాని కడతేరు కర్మశేషంబు వీడి**
**సంచితానికి వడ్డీని పెంచుకొనుచు**
**పాపి వర్థిల్లు దినదిన ప్రాభవమున**

**భారతవర్ష జంతువుల భాగ్యమదేమని చెప్పవచ్చు, నా**
**భారతదేశమందు ప్రభవంబయి శ్రీహరి**
**జీవకోటికిక, ధారణయోగవిద్యల సదా వివరించుచుండె.**

ఆధ్యాత్మికమనగా మానవునియందున్న పశుత్వాన్ని జయించడమే. మానవత్వం నుంచి దివ్యత్వానికి చేరిపోవడమే ఆధ్యాత్మికము. ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతి అనునవి పదార్థముల ప్రతిబింబములే తప్ప యదార్థమైన ఆత్మ ఒక్కటే అను సత్యాన్ని గుర్తించాలి. ఈ జగత్తంతయు దేని నుండి ఆవిర్భవించుచున్నది అని ఆధారమైన మూలసత్యాన్ని గుర్తించుకొన్నప్పుడే ఈ జగత్తంతయు ఏకత్వంగా రూపొందుతుంది. సర్వగుణములు త్యాగము చేసినప్పుడే ఈ బ్రహ్మతత్వము యొక్క ఆధారభూతమైన ఆత్మను గుర్తించడానికి వీలవుతుంది.

మోక్షమనగా మోహమును త్యజించుట. మోహము, అభిమాన మమకారములతో కూడి ఉంటుంది. ఈ అభిమాన, మమకార అహంకారముల యొక్క తత్వము మానవత్వాన్ని నిర్మూలనము గావిస్తుంది. అందుచే ఈ మోక్షమును కూడా త్యాగం చెయ్యాలి. మోహము పోయిన తర్వాత ఏకత్వమే సాక్షాత్కరిస్తుంది. ఈ జగత్తునందు ఏదీ శాశ్వతము కాదు. సర్వమూ నశించిపోతుంటుంది. అయితే ప్రతిపదార్థములో కూడా మంచి అను దివ్యత్వము అంతర్భూతమై ఉంటున్నది. ఈ మంచి తత్వమును చూచుటయే నిజమైన ఈశ్వరదృష్టి. నిజముగా మానవునియందు అనంతమై, అఖండమై, ఏకత్వమైన ఆత్మతత్వము నిబిడీకృతమై ఉంది. ఇట్టి పరతత్వాన్ని విస్మరించి, లోకతత్వాన్ని విశ్వసించి జీవితమును వ్యర్థము

గావించుకొంటున్నాడు. అందుచే మొదట మానవుడు తనలో ఉన్న పశుత్వమును సాధించాలి. మానవత్వము నుండి దివ్యత్వములోనికి ప్రవేశించాలి. ఇదే ఆధ్యాత్మిక మార్గము. మానవునియందున్న పశుత్వాన్ని దూరం గావించుకొని పశుపతితత్వాన్ని ప్రకాశింపచేసుకోవాలి. ఇట్టి మానవత్వము, దివ్యత్వము, పశుత్వము, పశు పతితత్వము, జీవతత్వములందు విభాగములు గావించే నిమిత్తమై జనన మరణాదులు లేని శక్తి, మాయకు అతీతమైన శక్తి, లీలామానుష విగ్రహమైన పురుషశక్తి. అట్టి పురుషోత్తమ శక్తి మానవత్వంగా లోకానికి దిగిరావడం ఏర్పడుతుంటుంది. అదే గోపాలతత్వము; కృష్ణతత్వము; సాయితత్వము.

## 54. సృష్టికర్త

**పొగకు మూలము నిప్పులపుంజముండ,**
**రైలుపరుగుకు నడిపించు డ్రైవరుండ,**
**ఆటోమేటికు లైటుకు అవధులుండ,**
**ఒకడు జగతిని సృష్టింప నుండవలదే.**

కర్త లేక ఎట్టి పదార్థము కూడాను జగత్తునందు నిర్మాణము కాజాలదు. ప్రతిపదార్థమునకు కర్త అనెడి వ్యక్తి లేక శక్తి ఉండియే తీరవలెను. కనిపించినను, కనిపించకపోయినను పదార్థమును సృష్టించిన వ్యక్తి ఎక్కడో ఒక ప్రదేశమునందు ఉండియే తీరవలయును. అయితే వ్యక్తికి అతీతమైన శక్తియొక్క సృష్టులు కూడను అనేకంగా చూచుచున్నాము. తమ దివ్యప్రకాశముచేత ప్రపంచమునంతయు వెలిగింపచేయు సూర్యచంద్రాదులు కనిపిస్తూ ఉన్నారు. వీటికి కారణమైన ఏదో అగమ్యగోచరమైన శక్తియున్నదా అని మానవుడు విచారించాలి. ఇట్టి అసాధ్యమైన సృష్టిని సృష్టించుటకు సామాన్యమైన వ్యక్తులకు సాధ్యము కాదు కదా! కాబట్టి వీటిని సృష్టించుశక్తి ఒకటి ఉన్నదని విశ్వసించాలి. ఇట్టి కర్తకే అప్రమేయుడు- అనగా ఏ ప్రమాణముల చేతను చెప్పుటకు వీలుకానివాడు- అని వేదములు చెపుతూ వచ్చినవి.

## 55. మీ పరమ లక్ష్యం

**కామితార్థంబులిలను-కల్పతరువు**
**వలెను దయచేయు దేవుండు-కలడొకండు**

**దుర్లభంబగు నరజన్మ-దొరకుకతన**
**అతని చేరుటే పరమలక్ష్యంబు మీకు.**

'జంతూనాం నరజన్మ దుర్లభం' అనే దాన్లో ఉన్న అంతరార్థమేమిటి? అగోచరమై, అవ్యక్తమై ఉన్న శక్తిని ఏ మానవుడు వ్యక్తీకరింపచేస్తాడో అతనికే మానవత్వమనే పేరు సార్థకమవుతుంది. కనుక ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. విశ్వాసమే లేకపోతే ఒక్క క్షణమైనా మానవుని విశ్వాసము నిలువదు.

ఆత్మవిశ్వాసము కలిగివుండిన ఆత్మానందమనేది లభిస్తుంది. ఆత్మానందమున్నప్పుడు ఏ విధమైన త్యాగమైనా చేస్తాడు. త్యాగమునకు తృప్తి అనేది అత్యవసరము. ఎప్పుడు త్యాగానికి పూనుకుంటాడో అప్పుడే ఆత్మ సాక్షాత్కారము self realisation- లభిస్తుంది. అందుకే నాలుగు 'S'లలో ఉన్న జీవిత రహస్యము గుర్తించాలి. I S-Self Confidence; II S-Self satisfaction; III S-Self Sacrifice; IV S-Self Realisation.

ఈనాటి విద్యలన్నియు పొట్టకూటి మాయావిద్యలు. ఈనాటి జ్ఞానము లౌకిక విద్యాజ్ఞానము. ఇవి కేవలము జీవనోపాధి నిమిత్తమై ఏర్పడినవి. జీవనోపాధితో పాటు జీవిత పరమావధి కూడా గుర్తించడం మానవ ప్రధాన లక్ష్యం. జీవనోపాధి కేవలం నెగెటివ్ వంటిది. జీవిత పరమావధి పాజిటివ్ వంటిది. ఈ రెండింటి ఐకమత్యముచేతనే మానవ జీవితము జీవనజ్యోతిగా రూపొందుతుంది. కనుకనే Light of Life అని, జీవితమునందు జీవనజ్యోతి ఏనాడు వెలిగించుకొందురో, ఆనాడే మానవత్వము సార్థకత కలుగును. దైవ విశ్వాసాన్ని గాఢంగా పెంచుకోవాలి. దైవ విశ్వాసం లేకపోతే మానవత్వ సార్థకత ఏమిటి? నిత్య సత్యమైనటువంటి దైవత్వాన్ని విస్మరించరాదు.

## 56. భక్తి-భుక్తి

**నిదురనుండి లేచి మరి నిద్దురపోయెడుదాక**
**పొట్టకై హద్దులు పద్దులు లేక**
**వ్యయమందగ చేతురు జీవితములు**
**మీరిట్టులనే ధారపోసి, అరవింద దళాక్షుని**
**విస్మరించి, ఏ పెద్ద సుఖమును పొందుదురో**
**ప్రీతిగ(కొద్దిగ) యోచన చేయుము, మానవా!**

ఈనాడు మితాహారమునకు స్వస్తి చెప్పి అమితాహారముతో ఆనందమున నుభవిస్తున్నాడు, మానవుడు. ఈ భోజనమునకు హద్దూ, పద్దూ లేదు. తెల్లవారింది మొదలు రాత్రి పడుకునేవరకు ఈ కడుపునకు విశ్రాంతి లేదు. ఆహారముచే అంతో ఇంతో ఏర్పడిన అనారోగ్యమును మరింత బలపరుచుకొనుచున్నాడు. ఈ విధముగా ఆహారము భుజించుటచే అనారోగ్యము అభివృద్ధి చేయుటయే గాక దేశములో కూడాను ఆహారకొరత అభివృద్ధి అగుచున్నది. అందుచే మనకు లభించిన అంబలి గంజియైనా మంచి పరిశుద్ధమైన గిన్నెలో, సకాలములో, మితముగా ఆరగించినఅనారోగ్యమునకు అవకాశముండదు.

ప్రతి వ్యక్తి అన్నంతో కాదు, ఆత్మలో జీవించాలి. భక్తి ప్రపత్తుల కోసం జీవితమున్నది కాని భుక్తి యుక్తులకోసం కాదు. హృదయంలో పవిత్రజ్ఞానం పొందాలి. పవిత్ర హృదయంతో ఏ కొంచెం చేసినా అది దివ్యంగా ప్రకాశిస్తుంది.

## 57. జ్ఞానము

**వేషభాషలందు గర్వించరాదు,**
**తనకు తా మెచ్చుకొనరాదు**
**పరుల దూషించరాదు.**
**ఇదియె జ్ఞానంబనంగ.**

ప్రతి మానవుడు విలువైన నగలు, నోట్లు, డైమండ్సు భద్రమైన పెట్టెలో పెట్టి జాగ్రత్త చేస్తాడు. విలువలేని బుట్ట, చట్టి, పెట్టి బయట పారేస్తాడు. సముద్రము కూడా విలువైన ముత్యములను తన గర్భములో దాచుకొని విలువలేని నత్తగుల్లలను బైటకు విసిరివేయును. అదేవిధముగా మానవునిలోని అంతరాంతరములలో ఆత్మ అనునది చాలా విలువైనది ఉన్నది. కాని విలువలేని రూపనామములు, వేషభాషలు బయటకు కనిపించును. విలువలేని ఈ రూపనామములకే ప్రాధాన్యత. వాటి గురించే గర్వము. విలువ గల ఆత్మతత్త్వమునకు విలువ లేదు. రూపనామములు సత్యము కావు. ఏ నాటికైనా భగవంతుని కటాక్షమునకు గురికాక తప్పదు. అట్టి అనుగ్రహమునకు పాత్రులగుట వలన మనలోని దురహంకారము, క్రోధము, అసూయ మొదలగు దుర్గుణములు దూరమగును.

## 58. నీవెవరో తెలిసికో

**పుట్టపై మర్దించిన పాము మరణించునా?**
**తనువును తాను దండించిన విషయభోగము మానునా?**
**ఆకలిదప్పులు మానిన ఆత్మజ్ఞాని తానగునా?**
**తానెవరో తెలియకున్న తత్వజ్ఞుడు తానెట్లగును?**

ఆత్మతత్త్వమును అనుభవపూర్వకముగా తెలుసుకోవాలి. Practicalగా ఈ తత్త్వమును కనుక్కోవాలి. ఇది ప్రశ్నోత్తరములతో లభించేది కాదు. విషయము మాత్రము తెలుసుకొనవచ్చును. విషయ స్వరూపమును అనుభవించుటకు అనుభవము కావాలి. ఎవరు ఏది చేస్తే మంచిదో దానిని మొదట మనం చేసి చూపాలి. ఎవరు ఏది చేస్తే తప్పో దానిని మనము చేయకూడదు. ఇది నేడు మనము చేయవలసినది.

## 59. ధర్మమే దైవము

**ధర్మమెచటనుండు నచట-దైవముండు**
**ధర్మమెటనుండదొ నచట-దయ్యముండు**

దైవముకాని, దయ్యముకాని మనయొక్క హృదయములందే ఉండును. దైవము చేరెనా దయ్యం ఉండదు. ఇది ఒక musical chair వంటిది. ఒకరు అందులో ప్రవేశిస్తే మరొకరు వచ్చి అందులో కూర్చోటానికి వీలవదు. కనుక దైవానికి హృదయమనే chair నిరంతరము అట్టే పెట్టి ఉంచాలి. హృదయమును జ్ఞానము, విద్య, తపస్సు, సత్యము అను ధర్మములలో పరిశుద్ధము గావించుకోవాలి. జడమైన ఈ దేహాన్ని చైతన్యవంతమైన దైవత్వానికి నిలయంగా ఏర్పరచుకొనే నిమిత్తమై ధర్మాన్ని పాటించాలి.

## 60. దేహము-దేహి

**దేహము పాంచభౌతికము-దేహముకూలక తప్పదెప్పుడున్,**
**దేహి నిరామయుండు-గణుతింపకదేహికి చావుపుట్టుకల్**
**మోహనిబద్ధ బంధనల-ముద్రలు లేవు నిజంబుజూడ, నా**
**దేహియె దేవదేవుడు మదిన్ గమనింపగ నాత్మరూపుడౌ.**

దేహము ఎటువంటిది? కన్నతల్లిదా? పోషించిన తండ్రిదా? ఎవరిదీ కాదు. ఇది కేవలము జడమైనటువంటి, మృణ్మయమైన ఘటము. ఇట్టి మృణ్మయమైన దేహమును తానుగా భావించి సత్యమైన ఆత్మతత్వాన్ని మానవుడు ఈనాడు మరుచుచున్నాడు. నీవు దేహము కాదు. దేహివి. నీవు శరీరము కాదు- శరీరివి. నామ క్షేత్రము కాదు- క్షేత్రజ్ఞుడవు. ఇట్టి నిత్యమైన ఆత్మను, పవిత్రమైన, సత్యమైన క్షేత్రమును అపవిత్రము గావించుకొను కర్మలయందు మానవుడు తన జీవితమును అంకితము గావించుకొన్నాడు. అయితే ఈ ఆత్మను ఆధారం చేసుకుని, ఆధేయమునే దేహమునందు, జగత్తును అనుభవించుటకు కొన్ని విధములైన కారణములు కల్పించినాడు భగవంతుడు. రథము రథము నిమిత్తమై ఏర్పడలేదు. కారు కారు నిమిత్తమై కల్పించినది కాదు. కారులో ప్రయాణము చేసే అధికారి ఒకడున్నాడనే సత్యాన్ని మానవుడు గుర్తించాలి. కనుకనే ఈ దేహి, దేహమనే రథమును ఆధారం చేసుకొని, జగత్కార్య నిమిత్తమై, ధర్మాచరణ నిమిత్తమై, సత్యాన్వేషణ నిమ్తితమై, కొంతవరకు ప్రయాణము సలుపుతూ వస్తున్నది. నిజముగా మానవజన్మము ఈ శరీరధారియైన జీవుడు, పవిత్రమైన దివ్యత్వాన్ని పొందే నిమిత్తమై తానీ జగత్తుకు దిగివచ్చేడు.

## 61. అవతరణ

**అవతరించుట అనుటలో అర్థమేమి?**
**జనులపై ప్రీతి, వాత్సల్య పరత తోడ**
**వారి స్థాయికి దైవంబు వచ్చు భువికి**
**జీవప్రజ్ఞతో పాటుగ దైవప్రజ్ఞ.**

ఒక మహావృక్షము అభివృద్ధి కోసం, బీజం తన స్వరూపాన్ని నశింపచేసుకొంటుంది. విత్తనము భూమిలో తన రూపాన్ని నశింపచేసుకోకుండా మహావృక్షంగా రూపొందదు. అదేవిధంగా స్వార్థాన్ని త్యాగం చేసినప్పుడే మానవత్వంలోని దివ్యత్వము వ్యాప్తి చెందుతుంది. భారతదేశములో అనేకమంది త్యాగమూర్తులుద్భవించి, తమ పవిత్ర చరిత్రల ద్వారా మాతృభూమి కీర్తిని జగద్వ్యాప్తి గావించేరు.

'త్యాగః శాంతి అనంతరం' శాంతి కావలెనన్న త్యాగమవసరం. స్వర్గానికి కానీ మోక్షానికి కానీ ద్వారాలను తెరిచే బంగారు తాళపుచెవి త్యాగం. 'నీవు

ఇచ్చుకో, నేను భర్తీ చేస్తాను', అన్నాడు జీసస్. ప్రాచీన కాలంలో త్యాగం చేసినవారు సామాన్య వ్యక్తులు కారు. సర్వ విధాలైన సౌఖ్యాలతో తులతూగు శిబి, బలి, కర్ణుడు మొదలైన చక్రవర్తులే త్యాగానికి కీర్తిని సమకూర్చేరు. తనకిష్టమైన వస్తువునూ, దాని ఫలితాన్ని అర్పించడమే త్యాగం. త్యాగానికి కొన్ని సాధనలు అవసరం. మొట్టమొదటిది– శారీరక సాధన. అహంకారం దూరం కావాలి. నేననే భావం లేకపోవడం వల్లనే మనిషికి నిద్ర సుఖాన్నిస్తుంది. గాఢనిద్రలో నేను అనే భావం ఏ విధంగా లేకుండా ఉందో, అదేవిధంగా జాగ్రదావస్థలో కూడా ఆ స్థితిని సాధించడానికి ప్రయత్నించాలి. సర్వదుఃఖాలకు, సకల విచారాలకూ మనసే కారణం. దేహమున్నంతవరకును దుఃఖాలు తప్పవని దేహాన్ని వదలడానికి, చంపుకోవడానికి ప్రయత్నం చేస్తాడు మానవుడు. కాని దేహాన్ని కాకుండా మనసును చంపాలి.

'దైవం మానుష రూపేణా' మనుష్య జన్మను సార్థకం చేయడానికి దైవం మనవాకారంలోనే రావాలి. హిరణ్యకశిపుని శిక్షించే నిమిత్తం తన సహజ రూపంలో కాకుండా సింహ రూపంతో వచ్చేడు నారాయణుడు. బలి జీవితాన్ని సార్థకం గావించే నిమిత్తం నరాకారాన్ని ధరించేడు. 'యద్భావం తద్భవతి'. నీవు భగవంతుని ఏ భావముతో విశ్వసిస్తే ఆ విధంగా రూపొందుతాడు. భావముల ప్రతిబింబమే భగవంతుడు. అందుకు మొదట భావశుద్ధి చేసుకుని, జ్ఞానసిద్ధి చేకూర్చుకోవాలి.

## 62. మరువబోకు

**మనసు, బుద్ధి, చిత్తము మరి అహంకారంబు**
**ఎందు పుట్టి, పెరిగి, ఎందడంగు;**
**అదియె శివుడు, ఆత్మ అరయంగచూడగా**
**మరువబోకుమోయి మంగళాత్మా!**

ఈ ఆత్మ అనునది సర్వత్రా వ్యాపకమైనదిగా ఉంటున్నది. ఆత్మ దేహంలో ఎక్కడో ఉంటున్నది? భావిస్తున్నాము. ఇది చాలా పొరపాటు. ఆత్మలో మనమున్నాము కాని ఆత్మ మనలో లేదు. సర్వత్రా వ్యాపించిన ఆత్మలో సర్వజీవులూ సంచరిస్తున్నారు. సమస్త ప్రపంచము ఆత్మలో ఉన్నది. కానీ, ప్రపంచములో ఆత్మ లేదు. నాలోని, ఆత్మ, నాలోని ఆత్మ అనడం అజ్ఞానం. ఈ ఏకత్వాన్ని గుర్తిస్తే మానవుని ద్వేషించే చిల్లరబుద్ధులు ప్రవేశించవు.

## 63. స్వర్గము

**స్వర్గమనగ వేరు సురలోకమున లేదు**
**నరుల లోకమందె నరయనుండు**
**తనదులోని అహముతో చంపుకున్నచో**
**అదియె స్వర్గమగును, అవనియందు.**

పురాణములు పధ్నాలుగు లోకములున్నవని చెప్పుచున్నవి. దీనికి ఏదో అజ్ఞానులు చెప్పే అర్థమును తీసికొని, పాతాళలోకము మరియు ఉత్తమలోకము లేక స్వర్గము అని విభజించుచున్నారు. అయితే ఈ లోకములన్నియు మనము ధరించే, ప్రేమించే దేహమునందే ఉన్నవి. ఏడు లోకములు పైనా, ఏడు లోకములు క్రిందాను. దేహమునకు పై భాగమైన శిరస్సు త్రికుట స్థానము అదే ఉత్తమ లోకము. అక్కడ 7 లోకములున్నవి. అవే ఊర్ధ్వ లోకములు. గరుడముక్కు(1); గంధర్వ–కన్నులు(2); యక్ష–నోరు(1); కిన్నెర–చెవులు(2); కింపురుష–స్పర్శ; ఈ ఊర్ధ్వ లోకములను అనుసరించినవారు పవిత్రమైన మానవత్వమును గుర్తించినవారని చెప్పవచ్చును. ఇవి మానవత్వానికి మకుటము పెట్టేవి. మొగ్గలు తొడిగేవి.

ఈ పై ఏడు లోకములను కాపాడు నిమిత్తము క్రింది 7 లోకములు ఏర్పడినవి. అవి హస్తలోకములు–చేతులు(2); కడుపు(1); మర్మగ్రంథులు(2); కాళ్లు(2). ఇవి అన్నియు చేరి అధో లేక పాతాళ లోకములు.

ఊర్ధ్వ లోకము యొక్క క్షేమము అధో లోకముపై ఆధారపడి యున్నది. అయితే ఈ అధో లోకములోని వాటిని సక్రమ మార్గములో వినియోగించాలి. రెండింటికీ సన్నిహిత సంబంధం ఏర్పరచాలి.

## 64. ముక్తి

**ముక్తి కోరిన నరుడు ముక్కోటి దేవతల**
**వేడుచుండుగాని వెతలు బోవు**
**తనదులోని అహము తాచంపుకొన్నచో**
**ముక్తియేల? తానె ముక్తుడగును.**

అహం జడం. జడమనగా తనను తాను గాని ఇతరులను గాని తెలుసుకొనలేకపోవడం. ఈ అహానికి ఎట్టి భయము లేదు. ఇతరులకు తలవంచడు.

అహం చావడం వల్ల మానవులు బంగారం వంటి జీవితాన్ని భ్రష్టు పట్టించుకొంటున్నారు. మానవుడు తెల్లవారినది మొదలు రాత్రి పడుకునేవరకు నా గృహం, నేను, నా వారు అనే అహంభావంతో అసలు నేను అనేదెవరో గుర్తించుకొనలేక అహంకారాన్ని ప్రకటిస్తుంటాడు. మానవత్వానికి ఈ అహంకారం విరుద్ధమైన తత్వం. ఇది పశుగుణాల్లో చేరినటువంటిది. ఇట్టి అహంకారము మానవుల్లో ప్రవేశించకుండా శ్రద్ధ వహించాలి.

బ్రహ్మప్రాప్తి క్రొత్తగా సంపాదించుకొను విషయము కాదు. జీవుడే బ్రహ్మ స్వరూపుడు. 'జీవో దేవస్సనాతనః' లౌకిక జగత్తునందు కూడా జీవుడు దేవుడై ఉంటున్నాడు. దేహధారియై, మరో ఇంద్రియ సంసర్గముల చేత తాను కేవలము మానవుడని భ్రమిస్తున్నాడు. మానవుడు అజ్ఞానము వలన తాను మానవుడినని భ్రమించుచున్నాడు కాని నిజముగా అమృతపుత్రుడని వేదమాత ఎలుగెత్తి చాటుచున్నది.

## 65. మంచివారు

**మంచివారి పొందుమహిలోన దొరుకదు**
**దుష్టులెందరైన దొరుకుచుంద్రు**
**కనికిరాళ్లు చూడ కలవు ఎందైనను**
**విలువబోలు వజ్రమొకటి కలదా?**

ఎన్ని కుక్కలైనా ఒక సింహమునకు సరి అవుతాయా? ఎన్ని విధములైన జన్మలెత్తితే గాని దైవత్వమనే ఒక్కదానికి సమానమౌతాయి? ఎంత ధనమును సంపాదిస్తే దైవత్వానికి తులతూగుతుంది? అందువలననే దైవత్వమన్నది అవతారతత్వమును స్వీకరిస్తుంటుంది. ధర్మమేమిటో, అధర్మమేమిటో, సత్యమేమిటో, అసత్యమేమిటో గుర్తించుకొనే శక్తి లేని మానవునకు గుర్తింపచేయడానికి తాను అవతరించి, ఆచరించి, అందించడానికి పూనుకొంటాడు.

మానవత్వమును తరింపచేసుకోవాలనే వ్యక్తులకు గీత మూడు విధములైన మార్గములను బోధిస్తూ వచ్చింది. మొదటిది మానవత్వము రావడమే గొప్ప అదృష్టము. రెండవది- మానవునకు దైవాపేక్ష కలగడము మహా అదృష్టము. దైవసన్నిధిని చేరి, దైవసేవలయందు, దైవ అభీష్టములందు నిమగ్నుడు కావడము పూర్ణ అదృష్టము. ఇది మూడవది.

## 66. బాహ్యదృష్టి-అంతర్దృష్టి

**ఫిలిము రికార్డును, ప్లేటును చూచిన**
**ఒక్కరీతిగానే వనరియుండు;**
**సౌండుబాక్సునందు సవరించి చూచిన**
**పదములెన్నోరీతి పలుకుచుండు.**

దేహేంద్రియముల బాహ్యదృష్టిలో దైవత్వము, మానవత్వము ఇరువురు సమానముగానే కనిపించవచ్చునుగానీ అంతర్భావములందు వేరువేరుగా ఉంటాడు. అవతారత్వము పూర్ణత్వము. మానవత్వము శూన్యత్వము. కనుకనే మానవత్వమందు పూర్ణత్వమున్నదనే సత్యాన్ని గుర్తించినప్పుడు మానవత్వము దైవత్వముగా రూపొందుతుంది. ఈ రెండింటి వ్యత్యాసము అనుభవముతో అర్థమగును. అవతారత్వము రాగద్వేషములకు అతీతమైనది. అభీష్ట మమకారములకు దూరమైనది. నిరంతరము బ్రహ్మలక్ష్యమునందు ఉండేది.

## 67. చిన్మయమూర్తి సాయిరామ

**కన్నీరు తప్పించు, కన్నీరు తెప్పించు**
**చిన్మయమూర్తి ఓ చిన్నిరామా!**
**పిచ్చిని పోగొట్టి పిచ్చిని పట్టించు**
**సచ్చిదానంద ఓ సాయిరామా!**

లోకములో అందరూ పిచ్చివారే! ధనము కావాలని ఒక పిచ్చి. ధాన్యము కావాలని ఒక పిచ్చి. స్వామి కావాలని ఒక పిచ్చి. సంసారి కావాలని ఒక పిచ్చి.

మానవమాత్రులమని విశ్వసించేవారిని సంతృప్తిపరచే నిమిత్తము దైవము అనేక నాటకములాడుతుంటాడు. అదీ ఇదీ అని ఏమాత్రము తారతమ్యము లేదు. అంతా దైవత్వమే. ఎట్టి పిచ్చిని తీసేస్తాడు? ఎట్టి పిచ్చిని పట్టిస్తాడు? లోకపిచ్చిని తప్పిస్తాడు. స్వామిపిచ్చి పట్టిస్తాడు.

ఇన్ని రకాల పిచ్చిలో దైవము కావాలనే పిచ్చి ఉత్తమపిచ్చే కదా! ఈ పిచ్చి ప్రతిఒక్కరికి అవసరము. ఈ పిచ్చి పట్టినవారు దైవానుగ్రహానికి పాత్రులవుతారు. అందుచే దైవానుగ్రహానికి పాత్రులు కావడానికి దైవపిచ్చిని అభివృద్ధి చేసుకోండి. దైవములో ఐక్యమైనప్పుడే దానికి నివారణ.

నీటిచుక్కను చేతిలో పెట్టుకొని నీటిచుక్క నీటిచుక్క అనడంకంటే ఆ నీటిచుక్కను సముద్రంలో చేర్చండి. ఆ నీటిచుక్క నీటిచుక్కగా ఉండదు. సముద్రాకారమైపోతుంది. మీవి సంకుచితభావములైనప్పటికీ, స్వార్థభావములైనప్పటికీ వాటిని దైవత్వమునకు అంకితము చేయండి. అవి అమృతత్వముగా మారిపోతాయి.

## 68. నిలకడలేనిదీబ్రతుకు

**తామరాకుపై తళతళలాడే**
**నీటిబొట్టువలె నిలకడలేనిది**
**బ్రతుకభిమానపు తెగులుపుట్టరా,**
**దిగులు దుఃఖములతెరరా లోకము.**
**హరినారాయణ హరి అనరాదా**
**హరిగోవింద హరిగోవింద**
**హరిగోవిందా అనరా మందా!**

జీవితం చాలా చంచలమైనది. అందులో రోగాలు, బాధలు అనంతం. ప్రపంచం ఆకర్షణీయముగా కనిపిస్తున్నదేగాని ఇది దుఃఖాలకు పుట్టినిల్లు. మృత్యుదేవత కరవాలం ప్రతి మానవుని శిరస్సులై వ్రేలాడుతూనే ఉన్నది. జీవితం కేవలం తామరాకుపై నీటిబొట్టువలె కనిపిస్తుందిగాని ముత్యంకాదు. అదేవిధంగా మాయ అనే ఆకుపైన జీవితాలు సుఖసంతోషాలతో ఉన్నట్లు భావిస్తున్నారు, భ్రమిస్తున్నారుగాని నిజమైన ఆనందాలు కావు. నీటిబొట్టు ఏ క్షణంలోనైనా మాయ అనే ఆకు నుండి జారి కొలను నీటిలో లీనమైనట్లే జీవితత్వపు మాయనుండి జారి ఆత్మతత్వంలో లీనం కాక తప్పదు. ఆత్మనుండి వచ్చిన నీటిబిందువు మాయపై నిలిచి, తిరిగి ఆత్మలోనే లీనమై తత్త్వం- అసి అనే మహా వాక్యానికి సరైన అర్థాన్ని నిరూపిస్తున్నది.

ఈ రూపనామాలే నా స్వరూపమని ఎవడు భ్రమిస్తుంటాడో వాడు అజ్ఞాని. అజ్ఞానమున్నంతవరకు దుఃఖము తప్పదు. మానవత్వము అజ్ఞాన కఠినత్వాల చేత ప్రకాశహీనమైనప్పుడు జ్ఞానతత్వంలోని భగవత్ ప్రేమను అనుభవిస్తే, మృదుమధురంగా మారి కాంతిమంతమవుతుంది. నిర్మల హృదయుడై తన హృదయాన్ని ప్రేమతత్వంతో నింపుకున్న భక్తుని చూచిన వెంటనే దైవానికి మనస్సు కరుగుతుంది. జ్ఞానబోధ సలుపుతాడు.

## 69. భక్తి

**ఇసుకపై వర్షజలధార లింకిపోవు**
**మధురమై నిల్చు రేగడి మసకలోన**
**చిప్పపై బడి ముత్యమై చెన్ను మీరు**
**అటులె ప్రాప్తానుసారమై అలరుభక్తి.**

దైవార్పితము చేసే ఏ కార్యక్రమము కూడా వ్యర్థము కాదు. దైవమునకు కించిన్మాత్రము అర్పితము చేసి అనంతమైన ఫలితమును భక్తుడు పొందుతాడు. పత్రమో, పుష్పమో, ఫలమో, తోయమో అనే భావముతో బలుసాకు అర్పించిన ద్రౌపదికి భగవంతుడు అనంతభాగ్యమునందించేడు. పిడికెడు అటుకులు పెట్టిన కుచేలునకు బహుళ భాగ్యములందించేడు. భక్తుడు కించిత్తయినా అర్పించినప్పుడే దైవమునుండి అనంతత్వము పొందడానికి వీలవుతుంది. ప్రేమను ఇచ్చినప్పుడే దానిని పుచ్చుకొనే అధికారముంటుంది. కాని ఈనాడు కేవలము వన్ వే ట్రాఫిక్– పుచ్చుకోవడమే తప్ప ఇచ్చుకోవడం శూన్యంగా ఉంది.

నీవు నా వైపు చూచినప్పుడు నీ రూపు నా కన్నులలో ఉంటుంది. నీ వైపు చూచినప్పుడు నా రూపు నీ కన్నులలో ఉంటుంది. దైవముపై మీ దృష్టి పడినప్పుడే దైవము దృష్టి కూడా మీపై పడుతుంది.

## 70. నిన్ను కావంగ వచ్చిన శ్రీకరుడు

**సారములేని యట్టి భవసాగరమందు, మునిగితేలుచున్**
**దారియు తెన్నుయున్గానక, తత్తరమందెడి మానసంబు నీ**
**ఓరిమియించుకింతమది, భక్తియు, శ్రీకరుడు**
**ప్రియరూపుడు నిన్ను కావగవచ్చెడి నావ కాంచరే.**

జీవితమునకు ప్రధాన సూత్రము నడవడిక. మరణించిన తర్వాత కూడా తన నడత జగత్తున నిలిచిపోతున్నది. నడతయే మానవుని బ్రతుకు. నడతలేని బ్రతుకు కేవలము జీవితములేని బ్రతుకే. లోకములో జ్ఞానము అన్నింటికంటె బలమైనదని చెప్పుతుంటారు. కాని గుణమునకు మించిన బలము ఈ జగత్తునందు కానరాదు. ఎట్టి ధనముకాని, విద్య కాని, అధికారము కాని గుణముముందు ఏమాత్రము కూడా పనికిరాదు. గుణము గ్రంథముల వలన లభించేది కాదు. ఇది

సమాజముయొక్క సన్నిహిత బాంధవ్యములచేతనే లభిస్తుంది. సమాజము యొక్క సుఖమునందే, తన సుఖము కూడా ఇమిడియున్నదనే సత్యాన్ని గుర్తించడమత్యవసరం.

మానవులలో సంబంధ బాంధవ్యాలు లేకపోవడంచేత స్వార్థము, అహంకారము, అసూయాది పైశాచిక ప్రవృత్తులు ప్రళయతాండవము సలుపుచుండ జీవితము అర్థరహితముగా రూపొందుచున్నది. అందుచే మానవుడు జగత్తుకై తమ జీవితాన్నయినా త్యాగము చేసి, పవిత్ర ఆశయలను నిలబెట్టుకొనే మానవత్వమును పోషించుకోటానికి తగిన ప్రయత్నము చెయ్యాలి.

నిరంతర తాపత్రయములచే, అంతులేని ఆశలచే, అర్థముకాని ఆవేదనలచే, అప్రాప్త, ప్రాప్తములకై ప్రాకులాడుచున్న మన దరిచేర్చుటకు కావంగ వచ్చిన శ్రీకరుని చూచి ప్రకృతి నవ్వుతుంది. ప్రకృతి భగవంతుని యొక్క శక్తియే. ప్రకృతి ఆచరించే పవిత్రసూక్తులను గుర్తించడానికి ప్రయత్నించినపుడు ప్రకృతి అగాథమైన, అనంతమైన అర్థముతో కూడి ఉన్నదని తెలుస్తుంది. స్వార్థరహిత కర్మను ఆచరించే ప్రకృతియొక్క మార్గమును ప్రతి మానవుడు కూడాను అనుసరించాలి. సర్వకర్మలు భగవత్ ప్రీత్యర్థముగా ఆచరించి, దైవాభిమానిగా ఉండాలి.

## 71. నీలోనే ఉన్నది

**బ్రహ్మదర్శనభాగ్యంబు బడయగోరి**
**వెదుకబోయెద వెచటికె వెర్రి మనసు!**
**అదియు నీలోన నున్నది గాంచుమచట**
**సత్యమును జూపుమాట ఈ సాయిమాట.**

బ్రహ్మతత్వముపై వేదములు 'కిమ్' అని, 'యత్' అని రెండు ప్రశ్నలను ముందుంచినవి. 'కిమ్' అనగా ఏమి. దైవత్వమనగా నేమి? సాకారమా? నిరాకారమా; సగుణమా; నిర్గుణమా? చైతన్యమా; జడమా? అంతర్ముఖమా; బహిర్ముఖమా? అను విచారణలకు అవకాశమునందిస్తూ వచ్చింది.

అట్టి సమయమందు 'యత్' అనగా 'ఏది' అనే రెండవ ప్రశ్న వచ్చినది. మొదటిప్రశ్న What; రెండవది Which? 'యతోవాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ' అనే సమాధానం ఆవిర్భవించింది. జగత్తంతయూ దేని నుండి పుట్టుచున్నదో, దేనినుండి పెరుగుచున్నదో, దేనియందు లయమగుచున్నదో, అదియే బ్రహ్మమని

నిర్ణయించిరి. అది వాక్కునకు మనసుకు అతీతమైనది. వివరించుటకు సాధ్యము కానిది. అది బయట ప్రపంచములో లేదు. అది తనలోనే ఉన్నదను తత్వమును ప్రేమతత్వముతో అర్థము చేసుకుని, అభివృద్ధి చేసుకోవాలి.

ఈ సమాధానము నిజమా, భ్రాంతియా అని అనుకుంటున్న సమయమున 'తత్' అనే జవాబు వచ్చింది. పై 'కిమ్', 'యత్'లకు 'తత్' అనేది సమాధానము. అదే 'తత్ త్వమ్ అసి'. ఇట్టి తత్‌ను వివరించుటకు కర్మకు కాని, ఉపాసనకు కాని సాధ్యము కాదు. దీని నిజతత్వాన్ని అర్థము చేసుకోవాలంటే ఏ నేత్రములు పెట్టుకుంటే కనబడుతుందో అట్టి జ్ఞాననేత్రములను పెట్టుకొని చూడాలి. సమస్త పదార్థములకు ఉత్పత్తిస్థానము, స్థితిస్థానము, లయ స్థానమేదో ఆ దివ్యశక్తి దైవత్వము.

'అంతర్, బహిశ్చ తత్సర్వమ్ వ్యాప్యనారాయణ స్థితః' పంచభూతములకు నిలయమైనది, నారాయణత్వము, పొట్టులేని విత్తనము జగత్తున కానరాదు. పొట్టు అనేదే జగత్తు. విత్తనమే పరతత్వము. పరతత్వమనే విత్తనము లేకుండిన జగత్తు అనే పొట్టు ఉండుటకు వీలులేదు. ఈ జగత్తు పొట్టుతో కూడిన విత్తనము.

కర్మలు రెండు విధములు. అవి లౌకికము. ఉదా: కాలకృత్యములు, ఆఫీసు పనులు మొ॥వి. (2) శాస్త్రీయములు. శాస్త్రీయములు మూడు రకములుగా నున్నవి. అవి (1) శ్రౌతము ఉదా: యజ్ఞయాగాదులు సలుపుట వేదమందలిరహస్యముల ననుసరించును. (2) స్మార్తము ఉదా: శ్రాద్ధములు పెట్టుట. సంధ్యావందనము; ఉపనయనము చేయుట మొ॥వి. (3) పౌరాణికము.

'నకర్మణా, నప్రజయా, ధనేన, త్యాగేనైకే అమృతత్వ మానశుః' అని వేదములు చెప్పినవి. ఎటువంటి కర్మలాచరించినప్పటికినీ, ఎటువంటి ధర్మములాచరించినప్పటికినీ త్యాగము లేక అమృతత్వము నందుకోలేవు. కర్మలు చిత్తశుద్ధి కలిగించును కానీ శాశ్వతానందము నీయలేవు. దైవత్వమనేది బయట ప్రపంచములో లేదు దైవము తనలోనే ఉన్నదను తత్వము అర్థము చేసుకోవాలి.

## 72. ప్రేమావతారము

**ప్రేమమయుండు శ్రీధరుడు**
**ప్రేమయె అతని దివ్యరూపము**
**ప్రేమయె సర్వరూపముల**

**ప్రీతిగ తారకమంత్రము,**
**అట్టి ప్రేమ రవంతయైన**
**వివరింపగలేక జగంబునందు,**
**తత్కామిత సత్పదార్థము**
**ఎటులకాంచగనేర్తురటయ్య, మానవా!**

ప్రేమ సమస్త జగములకు కూడానూ, సమస్త జీవులకు కూడానూ ప్రాణసమానము. కనుకనే ప్రేమయే ప్రాణసమానము. తల్లిప్రేమ, కుమారుని ప్రేమ, భార్యాభర్తల ప్రేమ, దేశప్రేమ అని అనేక రకములయినటువంటి ప్రేమలున్నవి. కాని ఇవి అన్నియునూ స్వార్థముచేతనూ, ప్రతిఫలాపేక్షతోనూ కూడియున్నవి. కాని దైవప్రేమ స్వార్థరహితమైనటువంటిది. ప్రతిఫలాపేక్ష లేనటువంటిది. ఇట్టి స్వార్థరహితమైన, ప్రతిఫలాపేక్ష లేకుండా, ప్రేమించేటటువంటి ప్రేమనే భక్తి అని చెప్పుతూ వచ్చేరు.

ఈ ప్రేమ త్రిభుజాకారముగా ఉంటున్నది. త్రికోణమనియునూ చెప్పవచ్చును. ఒకటి ఇచ్చుకోవటము, రెండవది భయము లేకుండా ఉండటము, మూడవది స్వార్థరహితమైన తత్వమును కూడటము. ప్రేమ యొక్క లక్ష్యము ప్రేమగానే ఉంటున్నది. ప్రేమి నిమిత్తమై ప్రేమను ఆశించవలెనుగానీ పదార్థ నిమిత్తమై ప్రేమను ఆశించకూడదు. ఏకాత్మభావమును అనుభవించుతూ, సర్వులయందు ఉండేటటువంటి ఆత్మతత్వము ఒక్కటే అనేటటువంటి సత్యాన్ని గుర్తించి, తనను తాను ప్రేమించినట్లు, పరులను ప్రేమించుమని భగవద్గీత బోధిస్తున్నది. ఇట్టి ప్రేమతత్వమునందు ఏకాత్మభావమును కలుగచేసేటటువంటిది భక్తి. ఈ భక్తికి క్షమ చాలా అవసరము. భగవంతుని నిమిత్తమై భగవంతుని ప్రేమించాలి కానీ ప్రాపంచిక విషయముల నిమిత్తమై భగవంతుని ప్రార్థించరాదు. ఇదే పూర్ణప్రేమ.

## 73. కర్మ భక్తిజ్ఞానము

**పూవు లేక కాయ పుట్టదు జగతి?**
**కాయ లేక ఫలము కలుగబోదు,**
**కర్మయోగి కాక భక్తుడు కాదయా,**
**భక్తి లేక జ్ఞానపదము గలదా?**

పూవు లేకుండా కాయ రావటానికి వీలులేదు. కాయ లేకుండా పండు కావటానికి వీలు లేదు. కనుక పుష్పము, కాయ, ఫలము ఈ మూడును ఒక్కటే. ఇవి ఒకదానిలో ఒకటి అంతర్భూతముగా ఉంటున్నవి. అదే విధముగా మానవునికి బాల్యము, యౌవనము, వార్ధక్యము– ఈ మూడును మూడు శరీరములుగానే మారుతూ వచ్చును. కనుక శరీరము మారుతూ వచ్చింది. అంటే మరణము కూడా శరీరము యొక్క మార్పు. ఒక దశ నుంచి ఇంకొక దశకు పోవటము. అదే విధముగనే దేహములు మారినప్పటికీ ఆత్మతత్వమనేటటువంటిది ఒక్కటిగానే ఉంటున్నది. కనుకనే ఆత్మ ఏనాటికినీ క్షీణించనటువంటిది; మార్పు చెందనటువంటిది. సర్వజీవులయందూ ఉండినటువంటి ప్రేమతత్వమే నిజమైన భగవదారాధన. ఈ అంతరార్థమును ప్రయత్నపూర్వకముగా మానవుడు తెలుసుకొని జీవితాన్ని సార్థకము కావించుకోవాలి.

ఎవరి హృదయము నిర్మలముగా, నిశ్చలముగా ఉంటున్నదో అందులో మాత్రమే ఈశ్వరత్వము సుస్పష్టముగా కనిపిస్తుంది. ఈ పరిశుద్ధత నిమిత్తము మానవులు కర్మలు ఆచరిస్తుండాలి. కర్మలను కర్మలుగా కాక కర్మయోగముగా తీర్చిదిద్దుకోవాలి. అహంకారముచేతను, ఫలాపేక్షతోను చేయునవి కర్మలుగా రూపొందును. వానిని సంహితము అంటారు. అహంకార రహితగా, ఫలాపేక్షరహితముగా చేయునవి అన్నియూ కర్మయోగముగా మారిపోతాయి. దానినే అరణ్యకము(ఉపాసనకు సంబంధించినవి) అంటారు. కర్మయందు ఉపాసన, జ్ఞానము ప్రతిబింబిస్తున్నాయి. భక్తియుందు కర్మ, జ్ఞానము ప్రతిబింబిస్తున్నాయి. జ్ఞానమునందు కర్మ, భక్తి ప్రతిబింబిస్తున్నాయి. ఈ మూడింటియందు అంతర్వాహినిగా ఉంటున్నది ఆత్మతత్వము. కనుకనే కర్మ లేక ఉపాసన, ఉపాసన లేక జ్ఞానము, మూడునూ ఏకత్వము పొందటానికి వీలు కాదు.

## 74. విడువు వక్రబుద్ధి

**కుసుమమల్లెమాల కోతికి తగిలించి**
**పట్టు పీతాంబరములు పదిలపరచి**
**రత్నసింహాసనమున రమ్యంబుగా గూర్చి**
**వదలునా తన జాతి వక్రబుద్ధి!**

కోతి వంటి మనస్సును మార్పు చేసుకోకుండా ఎన్ని పూజలు చేసినా, ఎన్ని

సాధనలు చేసినా దాని స్వభావము మారుతుందా? మానవుడు తనలోని అజ్ఞానమును పూర్తిగా నింపుకొని, గురువును పూజించి, కానుకలను చెల్లించినంత మాత్రమున కలిగిన ప్రయోజనమేమిటి? మనస్సును మార్పు చేసుకోకుండా ఎన్ని శాస్త్రములు గుర్తించిననూ, చదివిననూ ఫలితముండదు. అనుష్ఠించక, ఆచరించక, శాస్త్రములను చదవడం పాలు ఇవ్వని గోవువంటిది. మానవుని నిర్మాణమే విశ్వనిర్మాణము. మానవుడు మారినప్పుడే ప్రపంచము మారుతుంది.

ఆనాడు వానరత్వము, ఈనాడు నరత్వము. నరత్వములో అనేక జన్మల నుండి అనుభవించినట్టి వక్రత్వము, ఉగ్రత్వము ఎన్ని సత్సంగములలో చేరినప్పటికినీ వదలటము కష్టము. మన పాత జాతియొక్క లక్ష్యాన్ని మార్చుకొనడానికి ప్రయత్నము చేయకపోవడముచే ఎన్ని భౌతిక సౌకర్యములు పొందినా, ఎన్ని గ్రంథములు పఠించినా, ఎంతమంది పెద్దలను దర్శించినా, ఎన్ని సాధనలను సలిపినా ఇవి అంతర్మార్పులకు ఏ విధముగా సహాయకారిగా ఉండడము లేదు.

## 75. మత్సరము

**కోపమున్నవానికూడి చేరంగవచ్చు**
**పాముప్రక్కనైన పరుండవచ్చు**
**మత్సరంబుగల మానవుని స్నేహంబు**
**క్రూరమృగముకంటె హీనమగును.**

ఈనాటి భక్తులలోన దుశ్చింతలు డంభములు దురాలోచనలు అసూయతో నింపుకొని, పైకి మాత్రము భక్తి అనే పోలిష్‌ను వేస్తున్నారు. ఇది సరియైన భక్తి కాదు. ఇటువంటి భక్తి క్రూరత్వానికి కూడా పూనుకొంటుంది. త్రాచుపాము ప్రక్కనైనా పడుకోవచ్చును. ప్రమాదము లేదు. దుర్మార్గులతోనైనా స్నేహము చేయవచ్చు. కానీ మత్సరముగల మానవునితో కూడితే మృగముకంటె హీనమవుతాడు.

భక్తి అనే పదముకు సరియైన సార్థకతనందించాలి. ఏమి చేసినా, ఏమి చూచినా, ఏమి చెప్పినా, చిత్తశుద్ధి కలిగే మార్గాలన్ని లక్ష్యంలో పెట్టుకోవాలి. భక్తి అంటే నిజంగా భగవంతునితో అనురక్తిగా జీవించడమే. భగవంతుడు సర్వత్రా, సర్వజీవులయందున్న ఆత్మస్వరూపము. 'బీజం మాం సర్వభూతానామ్' ఈశ్వర

అంశమే సర్వ జీవులయందు కూడా ఆత్మస్వరూపమై ఉంటున్నది. 'అద్వేష్టా సర్వభూతానాం' ఎవ్వరినీ ద్వేషించకూడదు. 'సర్వ దేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి' ఎవరికి నమస్కారము చేసినా ఆ ఆరాధ్య దైవానికే చెందుతుంది. అందుచే అందరియందున్నది ఒక్కటే అన్న సత్యాన్ని గుర్తిస్తే ద్వేషము కానీ, అసూయ కానీ, మత్సరము కానీ మచ్చునకైనా కానరావు. ఈ ఏకత్వమైన ఆత్మతత్వాన్ని గుర్తించటమే సాధన యొక్క లక్ష్యము.

## 76. బహిర్యజ్ఞము-అంతర్యజ్ఞము

**వేదశాస్త్రంబులు-వివరించి బుధులచే**
**చదివించవచ్చులే-చదువవచ్చు**
**యజ్ఞయాగతపము-లధికారిజనులచే**
**చేయించవచ్చు తా-చేయవచ్చు;**
**ఇలలోన సకలతీర్థ-ములకేగనన్యుల**
**బోధించవచ్చు తా-పోవవచ్చు.**
**అష్టాంగయోగ సి-ద్ధ్యాద్యులకును బోధ**
**సలుపంగవచ్చు తా-సలుపవచ్చు;**
**కాని తమ మనోబుద్ధ్యహం-కారములను**
**నిల్పి, యంతర్ముఖము చేసి-నియతితోడ**
**నిశ్చల సమాధినిష్ఠులై-నిలుపలేరు.**
**వినుడు భారతీయులారా మీ-రనవరతము.**

మానవుడు సహజసిద్ధముగా మానవుడిగానే పుట్టుట లేదు. అనేక విధములైన జంతు జన్మముల నుండి ఈ మానవత్వము కట్టకడపటికి ప్రాప్తిస్తూ ఉన్నది. పాత జన్మముల వాసనలు, గుణములు, ప్రవర్తనలు, మానవునియందు మిగిలిఉ ంటాయి. పూర్వజన్మ సంస్కారములు ఈ జన్మమునందు మిగిలి ఉంటాయి.

అయితే ప్రతి మానవునియందు దైవత్వము, నిరంతరము దేదీప్యమానంగా ప్రకాశిస్తూ ఉన్నది. అందుచే ఇట్లు గూఢంగా, గుప్తంగా దాగి ఉన్న దైవత్వాన్ని మానవుడు తన ఆరాధనచేత అనుభవించాలి. ఆ దైవమునకు మనస్సనే యజ్ఞవేదికపైన తనలో ఉన్న దుర్గుణాలనెడి పశుత్వాన్ని బలిచెయ్యాలి. అదే అంతర్యజ్ఞము.

బహిర్యజ్ఞము అంతర్యజ్ఞము యొక్క ప్రతిబింబము. కాల, కర్మ, కార్య, కర్తవ్యాల్ని పురస్కరించుకొని, నేటి పరిస్థితులయందు బహిర్ముఖమైన యజ్ఞ ప్రతిబింబమే అంతర్ముఖంగా భావిస్తున్నాము. అంతర్ముఖమైన యజ్ఞముచేతిలో పట్టుకున్న పిట్ట. బహిర్ముఖమైన యజ్ఞము పొదలో నున్న పిట్ట కానీ పొదలో నున్న పిట్ట చేతిలో నున్న పిట్ట యొక్క ప్రతిబింబమే. ఈనాడు పవిత్ర వాతావరణాన్ని కోల్పోవటంచేత చేతిలో నున్న పిట్టను వదలి, పొదలో నున్న పిట్టకోసం ప్రాకులాడుతున్నారు ప్రజలు. అందుచే అంతర్ యజ్ఞము పవిత్రతను ప్రతివ్యక్తి గుర్తించాలి.

## 77. మనోవాక్కాయ కర్మల సాధన

**వేద శాస్త్రంబులు వివరించి–బుధులచే**
**చదివించవచ్చు, తా చదువవచ్చు,**
**యజ్ఞ యాగ తపంబులు అధికారజనులచే**
**చేయించవచ్చు, తా చేయవచ్చు,**
**ఇలలోన గల తీర్థములకేగ–అన్యులకు**
**బోధించవచ్చు, తా పోవవచ్చు.**
**అష్టాంగవిద్యలు అన్యులకుపదేశించవచ్చు.**
**తాసాధించవచ్చు, కానీ,**
**దేహేంద్రియములరికట్టి, మనసు నిల్పి**
**అంతర్ముఖము చేసి,**
**అనవతరము నిశ్చల సమానచిత్తులై నిలుపలేరు.**

జీవితము చాలా విలువైనటువంటిది. దానికి ఆధారమైన ప్రాణము మరింత విలువైనది. కానీ ప్రాణమునైనా లెక్కచేయక జీవితములో అనేక లక్ష్యములు సాధించవలసి వచ్చుచుండును. అందుచే ఈ దేహమును సదాచారములలోను, సత్కర్మలలోను, సత్ప్రవర్తనలోను ప్రవేశపెట్టాలి. అహంకారరహితమైన, స్వార్థరహితమైన కర్మలు ఆచరించిన భగవంతుని తృప్తిపరచినట్లగును. నిత్య జీవితమును యజ్ఞముగా భావించి, తమ వాంఛలను సమిధలుగా, మమకారములను నేయిగా హోమము చేసి, తమ పశుత్వ గుణములను యజ్ఞమనే బలిపీఠమునకు ఆహుతి చేయవలెను.

కొందరు మానవులు గురువులనేకుల దగ్గర మంత్రాలు తీసుకుంటారు. యంత్రాలు కట్టించుకుంటుంటారు. కొందరి దగ్గర తంత్రాలు నేర్చుకొంటుంటారు.

కానీ, మానవుడు తంత్రాలు నేర్చుకోనక్కరలేదు. మంత్రాలు పఠించనక్కరలేదు. ఇంకేవిధమైన ఉపదేశమును పొందనక్కరలేదు. మానవుని దేహమే ఒక తంత్రము. శ్వాస ఒక మంత్రము, హృదయము ఒక యంత్రము. ఈ మూడింటియందును మానవుడు మంత్రమయుడు కావాలి. ప్రతిమాట మధురమైనదిగా, వినేది సామగానంగా ఆనందంగా ఉండాలి.

మానవుడు యజ్ఞయాగ క్రతువులను ఆచరించవలెనన్న బాహ్యమైన వేదికలు, బాహ్య హోమగుండములు అక్కరలేదు. సత్యమైన వాక్కులు, పవిత్రమైన, పరోపకారమైన కార్యములు ఆచరించాలి. మనోవాక్కర్మల యొక్క చేరికనే తపస్సంటారు. తపస్సనగా కేవలం అడవులలో తలక్రిందుగ చేసి, కాళ్లు పైకి చాచి చేసే సాధన కాదు. మనస్సు, వాక్కు, కాయము, ఈ మూడింటి ఏకత్వము కలిగించుటే.

## 78. దేహమే దేవాలయము

**సకల విద్యలు నేర్చి–సభ జయించగవచ్చు**
**శూరులై రణమున–పోరవచ్చు.**
**రాజరాజై పుట్టి–రాజ్యమేలగవచ్చు**
**హేమ భూదానముల్–హెచ్చవచ్చు;**
**గగనంపు చుక్కలు–గణియింపగా వచ్చు**
**జీవరాసులపేర్లు–చెప్పవచ్చు,**
**అష్టాంగవిద్యల–నన్ని నేర్వగవచ్చు,**
**చంద్రమండలయాత్ర–సలుపవచ్చు;**
**కాని, దేహేంద్రియాదుల–కట్టిపెట్టి**

**మనసు నిల్పియు నంతర్ముఖము చేసి,**
**అనవరతము నిశ్చలమైన–యాత్మలగుచు,**
**నిలువగా లేరు మానవుల్–నియతితోడ.**

మానవుల దేహము జడమే కాని చైతన్యము కాదు. అది నిరంతరము జీర్ణించేటటువంటి స్వరూపాన్ని ధరించింది. అయితే ఇది ఒక క్షేత్రముగా, దివ్యమైన, భవ్యమైన, పవిత్రమైన దైవస్థానముగా కూడా భావిస్తారు. అయితే ఈ

దేహాన్ని ఏ విధంగా పరిశుద్ధం చేస్తున్నారు. జలముతో, soapతో, సుగంధములతో, అనేక పరిశుద్ధ ద్రవ్యములతో ఈ శరీరాన్ని పరిశుద్ధం చేసికొంటున్నారు. దానివలన కొంత ఆరోగ్యము రోగనివారణ చేసికోవచ్చు. అంతేకాని మానసిక రోగము నివారణ చేసికోటానికి వీలు కాదు. మానసికంగా బుద్ధి, వాక్కు పవిత్రం గావించుకొనకుండా పరిపూర్ణత్వం అందించనేరదు. ఇంద్రియములు కొలత వేసే పరిమితిలో వాటిని ఉపయోగపెట్టుకోవడం ఇంద్రియముల యొక్క సార్ధకత. ఇంద్రియములు పెడమార్గం పట్టడంచేత మానవత్వం, బుద్ధి మరుగునపడిపోతాయి. అందుచే జలముచేత దేహమును, సత్యముచేత వాక్కును, విద్యాతపస్సులచేత మనస్సును, జ్ఞానముచేత బుద్ధిని పరిశుద్ధం చేసికోవాలి. అప్పుడే ఈ దేహము దేవుని నిలయమై, పవిత్రమైన, దివ్యమైన, మార్గంలో అనుభవింపచేసుకోవటానికి వీలవుతుంది.

## 79. భక్తపరుడగు దాసుడే వంద్యుడగును

**సకల శాస్త్ర పురాణ-సంగ్రహవేత్తయై**
**వేదాంత వేద్యుడౌ-విబుధుడైన;**
**రక్తి యేపారగ-రమ్య హర్మ్యంబుల,**
**రమియించు రాజచంద్రముడునైన;**
**రణరంగమందు-పరాభూత రిపుడౌచు,**
**వెలుగొందు జగదేక-వీరుడైన;**
**దారిద్ర్యదేవత-దాక్షిణ్యమునగుందు,**
**దౌర్భాగ్యనిధియగు-దాసుడైన;**
**భక్తిరహితుడౌ యాజగ-భర్త కన్న**
**భక్తపరుడగు దాసుడే-వంద్యుడగును.**
**ఇంతకన్నను వేరెద్ది ఎరుకపరతు.**

దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి మానవుడు ధరించినటువంటి వస్త్రములవంటివి. ఈ ఇంద్రియముల యొక్క తత్త్వాన్ని మానవుడు చక్కగా గుర్తించినప్పుడే వాటిని వశం చేసుకునే విధానము అర్థమగును. ఏనాడు మానవుడు దానిని గుర్తించడో ఆనాడు అన్ని విధములైన ఇక్కట్లు ప్రాప్తిస్తాయి. 'దహ్య తీతి దేహః' అని ఈ దహింపబడునట్టిది, దహింపచేసేట్టిది ఈ దేహము

అనే సత్యాన్ని మానవుడు గుర్తించాలి. ఈ శరీరమునకు అద్దెకొంప అని కూడా మరొక పేరు. ఇది కేవలము అద్దెగృహముగా తయారై, కొంతకాలము మాత్రమే ఈ గృహము నందు ఆత్మనివాసము సలిపి, తర్వాత మరణమనే రెంటు చెల్లించి, పోవుచున్నది. ఈ బాడుగ ఇంటి సమాచారము అందరికీ తెలిసిన విషయమే. బాడుగనున్న వ్యక్తిని వదిలించే నిమిత్తమై అనేక విధములుగా ప్రయత్నములు సలుపుతుంటాడు యజమాని. అందుచే ఈ మరణమనే స్థితి మనసు రాకపూర్వమే, సక్రమమమైన మార్గమునందు మానవుడు ప్రవేశించి, సరైనటువంటి రీతిగా దేహములను పోషించుకుని, తద్వారా యజమానిని సంతృప్తిపరచే విధంగా ప్రవర్తించినప్పుడు దాని యజమాని ఇందులో బాడుగనున్న వ్యక్తిని గౌరవ మర్యాదలతో చూస్తుంటాడు.

## 80. కష్టసుఖములు

**కష్ట సుఖములు రెండును కలసియుండు**
**కష్టమును విడదీయ శక్యమ్ము కాదు**
**సుఖము ప్రత్యేకముగ నెందు చూడబోము**
**కష్టము ఫలించెనేని సుఖమని యంద్రు.**

ప్రతి మానవుని జీవితమునందు కష్టములు లేక సుఖములు లభించుట కల్ల. సుఖములను చూచి కష్టములు వెక్కిరిస్తుంటాయి. ఆనందమును చూచి సుఖములు పరిహసిస్తుంటాయి. ఈ ఆనంద సంతోషములకై, ఈ దుఃఖ విచారములు కాచుకొని ఉంటుంటాయి. మనసు ఎత్తు పల్లములతో చేసినది. మన పరిస్థితులు కూడానూ, ఎత్తుపల్లములతో కూడినవి. ఇలాంటి పరిస్థితులయందు మానవ జీవితము ఎత్తుపల్లములనే సుఖదుఃఖములు లేకుండా జీవించడానికి ఏ విధంగా వీలవుతుంది? కష్టము లేకుండా సుఖం అనుభవించడము వీలు కానటువంటిది. సుఖదుఃఖములనేవి ప్రత్యేకమైన స్వరూపములు కావనే సత్యాన్ని మానవుడు గుర్తించాలి.

ప్రతికూలములు సంభవించినప్పుడు మానవుడు బలహీనుడు కావడము లేక కృంగి కృశించిపోవడము సామాన్యమైన లక్షణము. కానీ అట్టి అవాంతరములు ప్రారంభమైనప్పుడు ధైర్యసాహసములచేత ఎదుర్కొని, దానిని సాధించి, అనేక విధముల ఆదర్శాన్ని అందించిన మూర్తి రామచంద్రమూర్తి.

## 81. కర్మమార్గము

**మనసు మాలిన్యములనెల్ల మట్టుపెట్టి**
**పరమ పరిశుద్ధభావముల్ పాదుకొలుప**
**జ్ఞానదృష్టియు నేర్పడి కాననగును,**
**విశ్వమంతయు ధర్మమై వెలుగునిండు**
**పువ్వు లేక కాయ పుట్టదు చెట్టున,**
**కాయ కలుగక ఫలము కలుగబోదు;**
**కర్మనిష్ఠలేక భక్తియు కలుగదు,**
**భక్తిలేక జ్ఞాన భరితుడగునా?**

మనస్సును పరిశుద్ధము చేసికొనక, పది పర్యాయములు స్నానం చేసినప్పటికీ అతను మాలిన్యుడే కాని పరిశుద్ధుడు కానేరడు. తలలు బోడిచేసి, కాషాయములు ధరించినప్పటికిని, సంకల్పాలను నిర్మూలించుకొనక, అతను సంసారియే కాని సన్యాసి కాడు. ముద్దను చేతియందుచుకొని, మూతిచుట్టూ నూరు పర్యాయములు త్రిప్పినప్పటికినీ ఆకలి తీరదు. మూతిలో పెట్టినప్పుడే ఆకలి తీరును. హృదయపూర్వకమైన భావముతో, చిత్తశుద్ధితో, నిర్మలమనస్సుతో ఆచరించుటకు ప్రయత్నించాలి. వేదములందు దీనినే కర్మమార్గమంటారు. సాధనలకు ఇది ఆధారము. చెట్టున పువ్వు లేక కాయ పుట్టదు. 'కర్మ' లేకుండా భక్తిమార్గము మానవునిలో ప్రవేశించదు. కాయ లేక ఫలము కలుగబోదు. అనగా భక్తియే లేకపోతే జ్ఞానమనే పరిపక్వత ఏర్పడదు. జ్ఞానము అనే శిఖరమును చేరాలంటే మానవుడు భక్తిని అనుభవించాలి. భక్తి స్థాయిలో జీవితము పరిపక్వ స్థితికి తెచ్చుకోవాలంటే పువ్వు అనే కర్మలయందు ప్రవేశించాలి. కనుక కర్మ వలన భక్తి, భక్తి వలన జ్ఞానము లభిస్తాయి. కర్మలేక భక్తి, భక్తిలేక జ్ఞానమును అనుభవించుటకు వీలు కాదు. సాధకులైనవారు, సాధకులు కాబోయేవారు చిత్తమును పరిశుభ్రం చేసుకొనే కర్మలు ఆచరిస్తూపోవాలి.

## 82. రాజయోగమునకు బాట

**జగతిని కీడెంచువాడు మనుజుడు కావలె మొదట**
**దనుజుల దుష్కృతులనెల్ల పొగడుచుండు వాడె, చవట**
**ధర్మ జ్ఞానముచితమని ఆధ్యాత్మికత కనుగొనుట**
**రాజయోగమునకు బాట–ఇదియే సాయి చెప్పుమాట.**

ఈనాటి యువకులు అవినీతిలో మునిగినవారు. మరొకరి నీతిని చేయజూపటానికి ప్రయత్నిస్తున్నారు. అవినీతి మార్గములో ప్రవేశించే వ్యక్తికి ఇతరుల నీతిని నిజాయితీలను చూపే అధికారము ఎక్కడ ఉంది? ఈలాంటి విద్యలు అభివృద్ధి కావడంచేత ఈనాడు యువకులయందు మానవత్వమే క్షణక్షణము క్షీణించిపోయింది.

గౌరవ మర్యాదలచేత ఆదర్శవంతమైన జీవితాన్ని విద్యార్థులు గడిపినపుడే వారు అందించే సందేశములో స్థిరత్వము ఏర్పడుతుంది. త్యాగము, శీలము రెండు నేత్రములుగా తీసుకోండి. నమ్మకాల్ని అభివృద్ధి పరచుకొండి. పవిత్ర భావాల్ని స్మరించి చింతించి, వాటిని ఆచరణయందుంచి, విద్యార్థులు సార్థకత పొందాలి.

## విద్యార్థుల ఆదర్శములు:

## 83. ఆశలు-దురాశలు

**నిగమమును హరియించి నిందు దూషణ చేసె**
**సోమకాసురుడేమి సుఖమునొందె?**
**పరసతిని ఆశించె, పది తలలవాడేమి**
**కట్టుకుపోయెను గట్టినాను?**
**ఇల సూదిమొనయంత ఈయజాలను అన్న**
**దుర్యోధనుడేమి దోచుకొనియె?**
**పసిపాపలను పట్టి కనిపెట్టి చంపిన**
**కంసుండు ఏ మార్పు కాచుకొనియె?**
**వద్దురా బాబు, ఏ ఆశ పెద్దగాను.**

మానవుడు దురాశను పెంచుకొని, లౌకిక భోగాలను ఆశించి, పశు జీవితమునకాశించును. భారతదేశమునందు ఆధ్యాత్మికత్వాన్ని, జీవితాన్ని అభివృద్ధి గావించి, దేశాన్ని పునరుద్ధరించువారుగా తయారు కావాలి.

కొంతమంది తాము చేస్తున్న తాత్కాలిక పనిని మాత్రమే లక్ష్యమునందుకొని దానినే పెద్ద ఆనందంగా భావిస్తున్నారు. కాని దాని ఫలితము ఏ ఈనెరతిగా వస్తున్నదని గుర్తించుకోలేకపోతున్నారు. సత్ఫలితాన్ని ఆశించిన సత్కర్మలనాచరించాలి.

మంచిగా ఉండి, మంచిని చేసి,మంచిని జగత్తుకు అందించడానికి ప్రయత్నించాలి. తేనెటీగలు పుష్పములందున్న మకరాన్నంతా గ్రోలి, ప్రోగు చేసి, తిరిగి ఎవరో ఒకరికి మధుర మకరందాన్ని అందిస్తాయి. అదేవిధంగా మానవులు మంచిని ఆశించి, మంచిని ప్రోగు చేసుకుని, మంచినే ఇతరులకు అందించాలి.

## 84. విద్య-జ్ఞానము

**మేఘములు మింటిపై చేరి మెదలుచుండ**
**వాటిదాపున విద్యుత్తు వరలునట్లు**
**విద్యవెనుక జ్ఞానంబు వెలయవలయు**
**సత్యమును దెల్పుమాట ఈ సాయిమాట.**

ప్రపంచములోని ప్రతి మానవుని నిత్య జీవితము పరిణామములోనే గడుస్తూ వస్తుంది. ఉన్న యదార్థము ఒక్కటి, మానవుని అనుభూతి మరొక్కటి. ప్రతీ దేశములో ప్రతీ మానవునకు నిత్యానుభవములు ఈ విధముగానే గోచరించును. భూమి ఒక గంటకు అనేక మైళ్ల వేగముతో తనచుట్టు తిరిగినప్పుడు కూడా భూమి స్థిరముగా ఉన్నట్లు మానవునకు నిత్యానుభూతి. తిరగని మానవుడు తిరుగుచున్నట్లు భావిస్తున్నాడు. ప్రతి విషయానికీ నిత్యానుభవము ఒకవైపు, శాస్త్ర ప్రమాణము ఒకవైపు ఉన్నది. అయితే నిత్యజీవితములో నిత్యానుభవములను తీసికొంటున్నాడే కాని, శాస్త్ర ప్రమాణములను తీసికొనుటకు ప్రయత్నము చేయుట లేదు. జ్ఞానము ప్రతిపదార్థము వెనుక, పదార్థమునకు మూలాధారమై దాగియుంటుంది. కనిపించే ప్రతిదానిని మానవుడు విశ్వసించక, పదార్థము వెనుక కనిపించకుండా ఉన్న జ్ఞానమును మంత్రాధారము వలన, మానసిక పరిశోధనచేత, గమనించాలి. వెదురుకర్రకు రూపము, చెరకు నుండు రసము, పశువులందు అందచందములు, బలము ఎట్లు ప్రాధాన్యమో అట్లే మానవునకు బుద్ధిబలమే శోభ. బుద్ధి నశించిన మానవత్వము నశించును. ఈ బుద్ధి అప్పటికప్పుడు వచ్చినది కాదు జన్మజన్మాంతరముల నుండీ వెంటగా, జంటగా ఉంటూ వస్తున్నది. దానిని నిజముగా గుర్తించుట అవసరము.

## 85. మనసు-బుద్ధి

**మనసు నాధారముగ గొన్న మానవుండు**
**పశువుకంటెను హీనమై పతనమగును;**

**బుద్ధినాధారముగ గొను బుధజనుండు**
**పశుపతిగ మారునని పల్కె పర్తిసాయి.**

భౌతికంగా, వైజ్ఞానికంగా మానవజాతి ఎనలేని ప్రగతిని సాధించింది. కాని నైతికంగా క్షుద్ర విమర్శలను, సంకుచిత భావాలను, స్వార్ధ, అహంకార అసూయాది పైశాచిక ప్రవృత్తులను అధిగమించలేకపోవుచున్నది. దానికి మానవ హృదయకుహరమున నాటుకొనిపోయిన స్వార్థమే కారణము. స్వార్థము మానవుని కీలుబొమ్మ చేసి ఆడించుచున్నది. ఏనాడు మానవుడు స్వార్థమనే పైశాచిక ప్రవృత్తిని తొలగిస్తారో ఆనాడు మనిషిలోని దివ్యత్వమైన ఆత్మతత్వం, పవిత్రమైన మానవత్వం ఆనాడు, ఆ జ్ఞానములతో దేదీప్యమానముగా వెలుగుతాయి.

## 86. భుక్తివిద్యలు-ముక్తివిద్యలు

**భుక్తి విద్యలన్ని బోధించి తెల్పేటి**
**గురువులెల్ల ఫలము కూర్పగలరా?**
**భుక్తి విద్యలెల్ల ముక్తి విద్యలజేసి**
**మోహంబు తెగటార్చు గురువు కలడు.**
**గురులు తెలియు సద్గురువరుండు.**

మార్పు చెందే మానవత్వముచేత మార్పు చెందని దివ్యత్వాన్ని తెలిసికొనడం అసాధ్యం. పవిత్రమైన శాస్త్రములే భారతీయుని నేత్రములు. ఇవే మానవుని సూత్రములు. ఈ శాస్త్రములందున్న జ్ఞాన సంపదను ఆర్జించేందుకు గురువు సహాయం అత్యవసరం. గురువు కేవలం బోధించువాడే గానీ మార్గమున నడిపించువాడు కాదు. గురువు కేవలము మార్గమును చూపించు స్థంభము వంటివాడు. కానీ మార్గమున నడువవలసినవాడు ప్రయాణీకుడు. గురువు అమూల్య సలహాను శిరసావహించిన తన శక్తిపై తాను ఆధారపడి దానిని తు.చ. తప్పక మార్గములో నడవడానికి ప్రయత్నించినవాడే శిష్యుడు. దైవముయొక్క ప్రతిబింబమే సర్వజీవులయందు కూడా ఆత్మస్వరూపమై ఉంటున్నదనే సత్యాన్ని గుర్తింనినప్పుడే ఏకత్వమైన మానవత్వాన్ని గుర్తించడానికి వీలవుతుంది.

## 87. పశుపతివి కమ్ము

**మనుజుడైన వాడు తనలోని దుర్గుణముల**
**నెల్ల మొదలు త్రుంచివేయవలయు;**

**పశుగుణంబులు వీడి పశుపతి కావలె**
**సత్యమైన బాట సాయి మాట.**

మానవునకు మూడు విధములైన దృష్టులున్నాయి. దేహమును ఆధారముగా చేసికొని, కులమతములను పురస్కరించుకొని, సంబంధ బాంధవ్యముల నేర్పరుచుకొనుట అజ్ఞానదృష్టి. సర్వులయందు సద్గుణములను దర్శించునది జ్ఞానదృష్టి. విశ్వమంతయు దైవ స్వరూపముని నిరూపించునది విజ్ఞానదృష్టి. అజ్ఞానదృష్టి నుండి జ్ఞానదృష్టిని ప్రయాణము సలిపి, జ్ఞానదృష్టి నుండి విజ్ఞానదృష్టిలో ప్రవేశించి, తద్వారా జ్ఞానాతీతమైన దైవత్వములో కలిసిపోవుటకు తగు ప్రయత్నము చేయాలి.

సహనము, కరుణ సమైక్యము అనుమాట సద్గుణములున్నప్పుడే ఉన్నత భావాలు అభివృద్ధి అవుతాయి. సానుభూతి, కరుణ– ఈ రెండు ఉండినప్పుడే పశు త్వము నుండి మానవత్వానికి చేరుకొనవచ్చును. మానవులు పశువులుగానే పశు ఫలాలుగా దేదీప్యముగా జగత్తునకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించాలి.

## 88. సకల సంకల్పశూన్యుడే శాంతినొందు

**దుష్ట సంకల్పములచేత దుఃఖితుడగు,**
**సత్యసంకల్పములచే సాధువగును;**
**సకల సంకల్పశూన్యుడే శాంతినొందు,**
**సత్యమును తెలుపుట, ఈ సాయిమాట.**

మానవుడు తన మనస్సులో చెలరేగే ఊహలు, సంకల్పములు ఎటువంటివో గుర్తించుకోగల్గాలి. స్వార్థముతో కూడిన సంకల్పములు, ఊహలు మానవుని హృదయములో ప్రధానపాత్ర వహించిన, మానవుడు తన దివ్యత్వాన్ని విస్మరించును. అందుచేతనే సంకల్పములను, ఊహలను ఉత్తమమైనవిగా, పవిత్రమైనవిగా, దివ్యమైనవిగా తీర్చిదిద్దుకోవడం అవసరం. స్వార్థము, స్వప్రియము అనే బాహ్య బంధములను ఏనాడు జ్ఞానాగ్నిలో భస్మము గావింతురో ఆనాడే మానవాభ్యుదయము జరుగును. మాయా, మమకార, స్వార్థాహంకారములను ఏనాడేతై అణగద్రొక్కుతారో ఆనాడే మానవత్వం మాధవత్వంచేత దివ్యత్వమవుతుంది.

మానవుడు దుర్గుణములను పెంచుకొంటూ, దుష్ట సంకల్పములలోనే

జీవితమును గడుపుచూ 'శాంతి శాంతి' అని ఆశిస్తున్నాడు. తన క్రియలకు తగిన ఫలితము దుఃఖమే. చేసేది దుఃఖమునకు సంబంధించినది చేసి, ఆనందము ఆశించిన ఎట్లా వస్తుంది? ఆనందము, ఆనందము లభించాలనుకుంటే ఆనందానికి సంబంధించిన ప్రయత్నములు చేయాలి. పాపఫలము వద్దు అని దానిని దూరము చేసికొనుటకు ప్రయత్నము చేస్తున్నాడు. కాని పాప కార్యానికి ముందంజ వేస్తున్నాడు. పుణ్యఫలము కావాలనుకున్నప్పుడు పుణ్యకార్యములు చేయాలి. పాపఫలము అక్కర్లేదని పాపానికి పూనుకోవద్దు.

మానవుడు తిరిగి పుట్టకుండా వుండే నిమిత్తమై పుట్టాలి. తిరిగి చావకుండా వుండే నిమిత్తమే చావాలి. సంకల్పరహిత జీవితము గడిపితే పుట్టుట చచ్చుట రెండూ ఉండవు. ఆశల వలన సంకల్పము కలుగను. క్రమక్రమేణా ఆశలను తగ్గించుకొంటే సంకల్పము కలుగును.

## 89. వినయ విధేయలతో దైవత్వమును గుర్తించు

**పొట్టకూటిని చేకూర్చునట్టి విద్య,**
**నీతి, ధార్మిక దృష్టిని నేర్పగలదా?**
**సహజ ధార్మికదృష్టినే చంపివేయు;**
**సత్యమును తెలుపుబాట ఈ సాయిమాట.**

తానెవరో తెలియకున్నా మానవునకు తత్వజ్ఞానమెట్లు కుదురును? లోక విద్యలన్నియూ పొట్టకూటికోసము. ఈనాటి ఆధునిక విద్యలన్నియు మానవత్వాన్ని ముక్కలు ముక్కలుగా చేస్తున్నాయి. మానవత్వాన్నే మసి కలుపుతున్నాయి. బజార్లవెంబడి తిరగటానికి మనిషివలె పుట్టాలా? కుక్కల మాదిరిగా పుట్టవచ్చునుగదా. విద్య నేర్చుకున్నందుకు వినయ విధేయతలతో దైవత్వాన్ని గుర్తించుటకు ప్రయత్నించాలి.

పశువులకు దేహము పెరిగికొలది కొమ్ములు పెరుగుతున్నాయి. అదేవిధముగ మానవునికి ధనము పెరిగేకొలదీ అహంకారమ అసూయ, స్వార్థలోభములు పెరగుతుంటాయి. ధన సంపాదనలో నీతి నిజాయితీలనే కోల్పోదురు. ఈనాటి విద్యలన్నియు నీతి నిజాయితీలను కోల్పోవుటకు ఆస్పదములగుచున్నవి. ధనార్జన నిమిత్తం అసత్యమైన అవినీతికరమైన మార్గాల్ని అవలంబిస్తున్నారు. కాబట్టి కేవలం

పొట్టకూటి నిమిత్తమై విద్యనార్జించుటకై సరియైనది కాదు. విద్య మానవత్వాన్ని వికసింపజేయుటకు, ప్రపంచమంతట వ్యాపింపచేయుట అవసరము.

అగ్ని నుండి విస్ఫులింగాలు పుట్టుతుంటాయి. అవి పుట్టినటువంటి స్థానాన్ని వదిలిపెట్టి పోతుంటాయి. ఆ కణములు పోయి, పోయి తమ అగ్నితత్వాన్ని మరిచిపోయి బొగ్గుగా మారిపోతుంటాయి. ఈ విధంగానే అగ్ని అనే దైవత్వాన్నుంచి ఈ జీవులన్నియూ కణములవలె పుట్టుతూ వచ్చేయి. కాని పుట్టినటువంటి స్థానాన్ని దైవత్వాన్ని వదిలిపెట్టి క్రమక్రమేణా బొగ్గుగా తయారైపోతున్నాయి. మాణిక్యముల వంటి మానవత్వాన్ని మరిచి, బొగ్గులకమ్ముకునే జీవితంగా తయారవుతున్నారు. జన్మస్థానమైన దైవత్వాన్ని మరచిపోతున్నాడు. స్వార్థాన్ని, సంకుచిత భావాన్ని, దుష్టసంకల్పాల్ని, అహంకారాన్ని, కుటుంబ, పుత్రవాంఛల్ని అభివృద్ధి గావించుకొంటున్నారు. ధనేషణ, దారేషణ, పుత్రేషణ అనే ఈషణ త్రయానికి లోనై దుఃఖములకు, విచారములకు, అశాంతులకు గురియైనపోతున్నాడు. అందుచే సద్గుణములు నేర్పే విద్యను నేర్చుకోవాలి. అల్పవిద్యలను విడచి అధికమైన ఆధ్యాత్మిక విద్యను ప్రయత్నపూర్వకంగా సాధించాలి.

విద్య మీదనే పారమార్థికము, వ్యావహారికము, ప్రాతిభాసికము ఆధారపడియున్నవి. ఈ మూడింటియందు ఏకత్వమైన ఆత్మతత్వాన్ని అర్థం చేసుకోవాలి. పారమార్థకమనే జలము నుండి, వ్యావహారికమనే అలలు పుట్టి, తద్వారా ప్రాతిభాసికమనే నురుగు ఆవిర్భవిస్తున్నది. ఈ మూడింటియందున్న నిత్య, సత్య తత్వాలను గుర్తించాలి. నిత్య జీవితములో పారమార్థికమును అంతర్వాహినిగా భావించి, హృదయపీఠమున ప్రతిష్ఠింపచేసుకుని, పరంపరగా పిల్లలను, తద్వారా జగత్తుకు ప్రకటించి, వ్యాపింపచెయ్యాలి.

## 90. ఈ దేహమునకు యజమాని భగవంతుడే సుమా!

**మసలలేవు, కనుమసకలు**
**మోమున ముడతలు పడి తల నెరసె కదా!**
**ముసలికోతియని పసివారనగ**
**కసరే బొమ్మ! తైతై, తైతై, తై బొమ్మా!**
**దాని తమాష చూడరే తోలుబొమ్మా!**

దేహాన్ని దేవాలయమని, దైవగృహమని అన్నారు. కాని నిజానికి అది అద్దె కొంప. ఆ ఇంటికి భగవంతుడు యజమాని. జీవుడు అద్దెకున్న వ్యక్తి. ఆ అధికారికి చెల్లించే అద్దె సద్గుణము, సత్ప్రవర్తనము, సచ్చింతనమును. కాని ఈ ఇంటిలో చేరి జీవుడు అద్దెను చెల్లించకుండా ఎగవేస్తున్నాడు. యజమాని అతనిని తరమాలని నోటీసులు పంపుతాడు. అదే తెల్లవెంట్రుకలు. కానీ మానవుడు దానిని లెక్కచెయ్యక రంగు వేసుకుంటాడు. తరువాత మరొక నోటీసు పంపుతాడు. పండ్లు ఊడగొడతాడు. అయినా పండ్లు కట్టించుకుని ఇకిలిస్తున్నాడు. తరువాత కన్నులకు పొరలు తెప్పిస్తున్నాడు. అయినా లెక్కచెయ్యక ఆపరేషన్ చేయించుకుని అద్దాలు వేయించుకుని తిరుగుతున్నాడు. ఇహ నాలుగవ నోటుసు పంపుతున్నాడు. ముడుతలు ముఖానికి తెప్పించినా, దానిని మేకప్‌తో కప్పివేస్తున్నాడు. చివరకు యజమాని రోగాలనే భటులను పంపి, మృత్యురూపంలో జీవుణ్ణి యింటి నుండి వెళ్లగొడుతున్నాడు.

దేహమున్నంతవరకు దానిని జాగ్రత్తగా చూచుకొనవచ్చునుగాని, దానిపై మమకారము మాత్రము పెంచుకోకూడదు. ఇది ధరించిన వస్త్రము. దేహము పాతబడి ముసలిబడినా దానికి బాధపడకూడదు. వయస్సైపోవుట అనగా ఈ వస్త్రము(దేహము) పాతబడుట. మరణమనగా ఈ వస్త్రమును వదలిపెట్టుట. జన్మమనగా క్రొత్తవస్త్రము వేసికొనుట. ఏది సత్యము కాకపోయినా చావు మాత్రం సత్యము.

దీపమున్నప్పుడే పనులను చక్కబెట్టుకోవాలి. పడవ చిల్లులు పడి, శిథిలము కాకపూర్వమే నదిని దాటాలి. దేహము అన్ని విధములా పటుత్వముగా ఉన్న సమయమున, బుద్ధి ఆధారముగా, చేయవలసిన సాధన, పొందవలసిన ఆనందము పొందు ప్రయత్నము చెయ్యాలి.

మానవుడు 'అహం దేహోస్మి' అనుకోవడం అహంకారము. 'అహాం జీవాస్మి' అనుకోవడం మమకారము. 'అహంబ్రహ్మోస్మి' అనుకోవడం దైవత్వము. అందువలన మానవుడు అహంబ్రహ్మాస్మి అనే 'తత్వమసి'లో కలిసిపోవాలి.

## 91. ఆత్మవిద్య కూడ అవసరం

**ఫలము లేని వృక్షమువలె**
**రసములేని ఫలమువలె**
**పాలు ఇవ్వని గోవువలె**

**పుట్టి గిట్టి ఏమి ఫలము?**
**పుట్టెరుగని పుట్టినావు**
**తన్నెరుగని పుట్టకున్న**
**పుట్టి ఇంక ఫలమేమన్నా?**

లౌకిక జీవితమునకు ఆధారమైన విద్యలు నేర్చినప్పటికి, ఆధారమైనదానికి మరింత ఆధారమైన ఆత్మవిద్య కూడ అవసరంగా భావించాలి. ఆత్మవిద్య లేకుండా, ఆధ్యాత్మిక శక్తి లేకుండా, భౌతిక విద్యలు కేవలము పాలివ్వని గోవువంటివే.

మానవుడు మానవత్వం నుంచి దూరమైపోయి, దివ్యత్వాన్ని ఎక్కడో పొందాలనుకోవడం శుద్ధ అబద్ధం. సాధ్యము కానటువంటిది. దేహభ్రాంతి ఉండినంతవరకును నేను మానవుడను అనే భ్రాంతిలో ఉండేవరకును, మానవత్వాన్ని అనుసరించాలి. మానవత్వాన్ని ఆరాధించాలి. దానినే అభివృద్ధి చేసికొంటూ, మానవాతీతమైన స్థాయికి పోయి, దేహత్వాన్ని మరచిపోవాలి. అప్పుడు దివ్యత్వమనేటటువంటిది గోచరమవుతుంది. మనిషివలె పుట్టినందుకు మనిషివలె జీవించాలి. మనిషివలె చావాలి. ఈ సత్యాన్ని గుర్తించినపుడే విద్యయొక్క అర్థాన్ని గుర్తించినవారవుతారు.

## 92. భవరోగనివారణ

**ఆకొన్నవాని ఆకలి తీరునా,**
**పంచ భక్ష్యముల పాకముల విన?**
**నిరుపేదవాని పేదరికంబు పోవునా,**
**విత్త ప్రభావంబు విన్నయంత?**
**రోగపీడితుని రోగంబు తీరునా,**
**ఔషధ మహిమంబు అంత విన్న?**

గ్రంథములను పఠించినంతమాత్రమున దాని ఫలము దక్కదు. చిక్కదు. పంచభక్ష్య పరమాన్నములను తట్టలో ఉంచుకొని, పంచభక్ష పరమాన్నం, అని నూరు పర్యాయములంటే పొట్ట నిండుతుందా?

భవరోగనివారణ కావాలంటే భగవంతుడు మనసులో నిలిచిపోవాలి. రక్తములో

కలిసిపోవాలి. సర్వత్రా ఉన్న ఈశ్వరత్వాన్ని హృదయస్థానమున అభివృద్ధిపరచుకొని, అంతర్దృష్టి ద్వారా దర్శించడానికి ప్రయత్నించాలి.

## 93. వికారమనస్సు

**మ్రాను దిద్దవచ్చు, మరి వంపు లేకుండా,**
**దిద్దవచ్చు రాయి తిన్నగాను,**
**మనసు దిద్దగలరా? మరి వంపు లేకుండా?**
**ఉన్నమాట తెలుపుచున్న మాట.**

ఈనాడు వికార మనస్సు పెరిగిపోతుంది. వికారమనస్సు రజోగుణ తత్త్వము. వికారమనస్సు మెలికలు తిరుగుతూ పోతుంది. అదేవిధంగా వికారమనస్సు ఉన్న మానవుల బుద్ధులు కూడా తిన్నగా పోవు. వంకరగా పోవును. ఏది చిక్కితే, దాన్నంతా కరుస్తూ పోతుంది పాము. వీరు కూడా అంతే. ఏది చిక్కితే దానిని విరోధంగా తీసుకుంటారు.

ఈ వికార మనస్సుకు సకార మనస్సును చేకూర్చాలి. ఏదో మనస్సు పోతూ ఉంటుంది. వాంఛలు పెరుగుతూ ఉంటాయి. తల నెరిసేకొద్దీ, పండ్లు పోయేకొద్దీ, కండ్లు చూపు తగ్గేకొద్దీ, ఏదో ఏదో ఇంకా ఇంకా అనుభవించాలనీ, జుర్రుకోవాలనీ ఆశ పడుతుంటారు. ఇంతకాలం జుర్రుకొన్నదేమిటి ఉన్నది? ఇకపైన జుర్రుకొనేదేమిటి ఉంది? కనుక మానవునకు ఉండవలసిన ఆశ ఒక్కటి. మానవుడిగా పుట్టేరు. మానవునిగా ప్రవర్తించాలి. మానవునిగా జీవించాలి. మానవునిగా చావాలి. మానవునిగా పుట్టి, మృగంగా చావడం మంచిది కాదు. ఈ సత్యాన్ని గుర్తింపచేసేది నిజమైన సకారమైన మనస్సు. సహకారము, కరుణ అను రెండు నేత్రములు పెట్టుకొని చూడాలి. నేడూ, రేపూ ముచ్చటగా మూడు దినాలు కలిసే వారితో అనవసరమైన సంబంధ బాంధవ్యాలు పెంచుకోకూడదు. నేడూ, రేపూ, ఎల్లుండీ, జీవితమంతా మనతో కలిసిమెలిసి ఉండే దైవత్వముతో సంబంధ బాంధవ్యాల్ని పెంచుకోవాలి. దైవము బయట ప్రదేశములో లేదు. తనయందే ఉన్నది. త్రిమూర్తి స్వరూపుడూ తానే! త్రికాలాబాధ్యుడు తానే! త్రినేత్రుడూ తానే! మృగ లక్షణాన్నంతా పెట్టుకుని, 'జంతూనాం నరజన్మ దుర్లభం' అంటే వచ్చిన ఫలితమేమి?

## 94. హృదయము ప్రేమమయము గావింపు

**ప్రేమరూపము బ్రహ్మంబు ప్రేమమయము,**
**ప్రేమ ప్రేమతో సంధింపనీయమగును.**
**కాన ప్రేమను పూర్తిగా కలిగియున్న**
**అద్వితీయ భాగ్యంబు అరయవచ్చు**
**అద్వితీయము నందంగ అర్హుడగును.**

మానవత్వము అతి దివ్యమైనది. భవ్యమైనది. మానవత్వముతో విద్యలనభ్యసించుట మరింత పవిత్రమైనది. విజ్ఞానము లేని విద్య, వినయము లేని జ్ఞానము, నమ్రత లేని పాండిత్యము, మాధుర్యము లేని గానము, శీలములేని జీవితము చిల్లిగవ్వకు కూడా పనికిరావు. విద్య యొక్క గమ్యము, చివరి నిష్కర్ష గుణము.

ప్రేమయే సర్వభూతముల సారము. సత్వ భూతములయందు నిరూపించే ప్రేమతత్వమే దైవారాధన. సర్వసమయముల యందునూ ఉత్తమమయిన రసము కరుణారసము. సర్వ ధర్మములయందును మానవుని కర్తవ్యము చిత్తశుద్ధి. సమస్త సాధనల యొక్క గమ్యము శాంతిసాధనము. నిజముగా ఆధ్యాత్మిక మార్గములో సౌఖ్యము, సంతోషము లభించవలెనన్న శాంతము ఒక్కటే మార్గము. ఈనాటి పాండిత్యములో విషయాలతో తల నింపుకొంటున్నామే కాని ప్రేమతో హృదయములు నింపుకోవటం లేదు. మనస్సు నుండి దుర్భావములు దురాలోచనలు, దుర్గుణములు దూరము చేసుకొనిన, హృదయము ప్రేమతో నింపుకొన వీలగును.

## 95. ఏది సుదినము?

**సద్భక్తులందరు భగవంతుడా యంచు**
**చెవులకింపుగ స్మరణ చేయుదినము;**
**బీదల వెతలన్ని ప్రీతితో నెరవేర్చి**
**అన్నదమ్ములమాడ్కినున్న దినము**
**దైవచింతన చేయు దాస బృందములకు**
**ప్రీతి మృష్టాన్నమ్ము పెట్టుదినము;**
**మహనీయులెవరైన మనకడ కేతెంచి**

**చెలిమి భగవత్కథలు చెప్పుదినము;**
**దినము కానీ, తక్కినవన్నీ తద్దినాలే.**

నిజముగా మానవునకు ఇట్టి పవిత్రమైన దినములే ప్రధానమైనవి. ఇట్టి పవిత్రమైన సుదినములు మానవునకు చాలా అరుదు.

తెల్లవారినది మొదలు, బాలురు మొదలు వృద్ధులవరకు అత్యంత ఆనందోత్సాహములతో దైవచింతన చేయుచున్న దైవదర్శనమునకై, వైభవమునకై కన్నులు కాయలు కాచుకొంటూ, ఎదురుచూస్తూ వచ్చిన పవిత్ర సుదినము చాలా గొప్పది.

## 96. అక్షరజ్ఞానము ఆధ్యాత్మిక జ్ఞానము కానేరదు

**కాగితంబునందు కల్గిన అక్షరాల్**
**చదివినంతనె ధరణి చతురుడగునా?**
**అక్షరంబులయందు అర్థంబులను నెరిగి**
**చదువునట్టివాడే శ్రేష్ఠుడగును.**

ఈనాటి విద్యావిధానము కేవలము ధనము నార్జించే నిమిత్తము, పొట్టను పోషించే నిమిత్తము, జీవితమును సుఖంగా అనుభవించే నిమిత్తము ఏర్పడినదిగా భావిస్తున్నారు. కాని అంతఃకరణమును పరిశుద్ధము గావించునదే విద్య. నైతికంగా, ఆధ్యాత్మికంగా శీలసంపదను క్రోడీకరించుకొనునదే విద్య. వినయవిధేయతలను చేకూర్చునదే విద్య. మంచి చెడ్డలను విచారించు సమయమందు మానవత్వానికి సహాయము కావించునటువంటిదే విద్య. విజ్ఞానతత్త్వముతోబాటు లౌకికజ్ఞానమును, అనుభవజ్ఞానమును అందించునట్టిదే విద్య.

విద్య అనగా గ్రంథములలో ఉన్న అక్షరములను వ్రాయడమూ, చదవడమే కాదు. అంతర్, బహిర్ తత్వములను ఎరిగింపచేసేటటువంటిది. మానవత్వానికి మకుటము తొడిగేటటువంటిది. కనుక ఇలాంటివిద్యకు మానవుడు ఉన్నత స్థానమందించినప్పుడే మానవత్వము కూడా రాణిస్తుంది.

Education is not for living. It is for life.

## 97. జననీ జన్మభూమి

**ఇది నా మాతృదేశము**
**ఇది నా ప్రియ మాతృభాష**
**ఇది నా మతమంచు**
**ఎదగొట్టని పీనుగొకడు వసుధన్ గలడా!**

కన్నతల్లినిగాని, జన్మమిచ్చి దేశమునుగాని విశ్వసించడము మానవుని కర్తవ్యము. మాతృభూమియందు సరియైన సౌకర్యములు లేకపోయినప్పటికిని, సిరిసంపదలతో తులతూగిపోయినప్పటికి, ఆత్మజ్ఞానము అనే ఆనందముతో ఇతర దేశములకు ఆదర్శాన్ని అందిస్తూ వస్తున్నది. భారతదేశముయొక్క ఆదర్శములను ఇతర దేశములవారు అనేక విధములుగా క్రోడీకరించుకొని, తద్వారా భారతదేశముపైన అనేక విధములైన కక్షలు సాధిస్తూ వస్తున్నారు. వేదములుగానీ, వేదాంగములుగానీ, ఉపనిషత్తులుగానీ, భగవద్గీతగానీ- అన్నియు విజ్ఞానమందిరాలు. విజ్ఞానఖనులు. అందుచే దేశము యొక్క అభిమానము, మాతృమూర్తియందు అభిమానములేని వ్యక్తి భారతదేశమందు కానరాడు.

## 98. విద్యను దేశ కళ్యాణమున కుపయోగించు

**విద్య డిగ్రీల కొరకనే-వెర్రి వీడి**
**సేవకావృత్తి నీవెపుడు-సేయబోక**
**దేశ సౌభాగ్యమెన్నుచు-దీటు లేక**
**గడపవలయును జీవిత-గరిమమింత.**

కేవలం విద్యతో బుర్రను నింపుకోవడం కాదు. లోకములో నున్న విషయములనన్నిటినీ తలలో చేర్చుకుని తబ్బిబ్బైపోయే జీవితాన్ని మానవుడు గడుపకూడదు. భారమైన డిగ్రీలు తల మీద పెట్టుకొని, మరింత భారమును అనుభవించేదానికంటె, ఉత్తమమైన ప్రేమతో హృదయమును నింపుకోవాలి. గొప్ప విద్యావంతులైపోయి వేలకువేలు, లక్షలకు లక్షలు ధనమును ఆర్జించిన ధీరులు కూడానూ వారి విద్యలను ధనార్జనకై ధారపోస్తున్నారు కానీ దేశముయొక్క క్షేమమునకు ఏ మాత్రమూ కాదు. విద్యార్థులు త్యాగశీలురైన పవిత్రమైన భావముచేత ఆర్జించిన విద్యను దేశ కళ్యాణమును కోరుతూ ఉపయోగించాలి.

## 99. దేశ సంస్కృతిని శ్రేయపరుచు

**విద్య డిగ్రీలకొరకను వెర్రివీడి**
**సేవకావృత్తికై ఆశ చెందబోక**
**స్వీయదేశీయ సౌభాగ్య శ్రేయపరచి**
**జనులు శ్రామికవిద్యలన్(జదువ) వలెను.**

జీవితమునకు జాతినీతులే పునాదులు. శీల నీతులే పునాదులు. ఆధ్యాత్మికమే ఆయువుపట్టు. సత్సంగమే జీవితమునకు శోభనందించును. భారతీయుల పవిత్ర జీవితములో నిత్యసత్యమై ప్రకాశించు ప్రాచీన సాంప్రదాయములనూ, సంస్కృతికీ కాలానుగణముగా సంస్కరించుకొని, సందర్శించుకొని ఆచరించుటకు కావలసిన ప్రయత్నములనూ, ప్రోత్సాహమునూ అందించుటే విద్య యొక్క నిజమైన కర్తవ్యము. ఆధ్యాత్మిక వికాసమునూ, పవిత్రతనూ ప్రసాదించని విద్య విద్య కానేరదు. దేశముయొక్క సంస్కృతి జాతికి జీవకర్ర. దేశమునకు వెన్నెముక.

## 100. గురువు నేర్పదగిన విద్య

**సద్గుణములు, సద్బుద్ధి, సత్యనిరతి**
**భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనములు**
**నేర్పునదె విద్య, నేర్పునదె గురువు;**
**విద్యార్థి నేర్వవలయు.ః**
**ఇంతకన్నను వేరేది ఎరుకపరతు**
**సాధుసద్గుణ గణ్యులౌ, అధ్యాపకులారా!**

ఈనాడు భారతదేశమున విద్య అభివృద్ధికి విరుద్ధమైనదిగా గోచరించుచున్నది. కేవలము మానవత్వాన్ని మరిపింపచేసే ప్రక్రియగా గోచరించుచున్నది. కష్టించి, శ్రమించి, తమ శక్తి సామర్థ్యములను అభివృద్ధి గావించి, సమాజమునకు అందించే విశాల హృదయములున్నటువంటిదే విద్య యొక్క లక్ష్యము. ఇట్టి సచ్ఛీలమే లేకుండిన విద్య యేమాత్రము రాణించదు. ఈనాడు ఆచరణీయ విద్య, అనుభవముగల గురువు అగోచరములు. విద్యావంతులు మానవత్వానికి మొగ్గలు తొడుగాలి. క్రియాశీలత వెల్లివిరియాలి. సంఘశ్రేయస్సుకు సర్వోన్నత స్థితిని కలిగించాలి. అన్నముకోసమై కాక, ఆశయాలకోసమై జీవించాలి. ఇదియే నిజమైన శీలము.

'విద్యా తపోభ్యాం పూతాత్మ' అన్నారు. అనగా విద్య తపస్సుగా మారాలి. తమస్సుగా మారకూడదు. మానవత్వాన్ని చక్కగా గుర్తించుకొనే విశిష్టతను ఆర్జించుకోవాలి. అట్టి ఆదర్శ విద్యార్థులను తయారుచేసేమూర్తులే ఆదర్శ అధ్యాపకులు.

## 101. సరసవిద్య

**విశ్వశాంతి చేకూర్చు విధము నేర్పి**
**సంకుచిత భావముల సమయచేసి**
**ఐకమత్యము సహజీవనాదికము**
**సమత నేర్పుటయె కాదె సరసవిద్య.**

**ఇసుకలో వర్షజలధార లింకిపోవు**
**మధురమ నిల్చు రేగడి మసకనేల**
**చిప్పపైబడిన ముత్యము చెన్నుమీరు**
**అటులె ప్రాప్తానుసారమై అలరువిద్య.**
**విత్+య=విద్య. 'విత్' అనగా చీకటి. 'య' అనగా పోగొట్టు.**

విద్య రెండు విషయములను ప్రబోధిస్తున్నది. అజ్ఞానమను చీకటిని పోగొట్టునది విద్య. జీవితము అనగా ఏమిటి? దానినేవిధముగా గడుపవలయును అను విషయమును గురించి తెలుపును. అంతేగాక జీవనభృతి విషయమును బోధించును. ఇందులో మొదటిదానిని పారమార్థిక విద్య అందురు. ప్రాచీన కాలములో విద్యతోబాటు నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విషయములను బోధించెడివారు. నేటి క్రమశిక్షణారహితము. అతిస్వేచ్ఛగ జీవితము గడపటానికి ప్రోత్సాహమునిస్తున్నది.

ఈనాడు కొందరు Arts subjects ను, కొందరు Science subjects ను చదువుచున్నారు. కాని అందరి గమ్యము ఒక్కటే అన్న విషయము గుర్తించుట లేదు. ఈ భౌతిక విద్యలన్నియు చిన్న చిన్న నదులవంటివి. ఆధ్యాత్మిక విద్య సాగరము వంటిది. 'నదీనాం సాగరోగతి' అన్నట్లు విద్యలన్నియు ఆధ్యాత్మిక విద్యయందే లీనమగుచున్నవి.

విద్యార్థులు సంకుచిత భావములతో నుండరాదు. భగవద్భక్తి లేనిచో మానవత్వము జడత్వమును పొందును. అనన్యభక్తి విశ్వాసములు, వినయము

విద్యార్థులకవసరము. Duty, common sense, devotion లో first class రావలయును. Common sense లేని విద్య వలన ప్రయోజనము లేదు. భక్తితో భగవంతుని అనుగ్రహమునకు, ప్రేమకు పాత్రులు కావలయును. మీరీ ఆదర్శమునే అందరికీ అందించి సచ్ఛీలముతో, త్యాగముతో, ఔదార్యముతో ప్రవర్తిస్తే స్వామికి ఆనందం.

## 102. విశ్వవిరాట్ రూపము

**మంచికాలము పదవులు**
**మంచిబ్రదుకు కోరుచుందురు, మానవుల్,**
**కోరబోరు మంచిబుద్ధులు, జ్ఞానంబు, మంచినడత**
**సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులారా!**

పూర్ణ మానవత్వాన్ని పొందుటకు జ్ఞానము, భక్తి, కర్మ అనే త్రిమూర్తిత్వము అవసరము. ఈ మూడింటిలో మొదటిది తల, రెండవది హృదయము, మూడవది చేతులు. ప్రతి మానవునిలోను తలనంటి విచారణాశక్తి, హృదయమునంటి కారుణ్యశక్తి, చేతులనంటి క్రియాశక్తి ఉండాలి. ఈ మూడింటిని బలపరుచుకొనే నిమిత్తమై మానవత్వాన్ని అభివృద్ధిపరచుకోవాలి. ఈ మూడింటిచేరిక అయినప్పుడే 'Love of SAI' అవుతుంది.

మానవునకు కర్మాచరణ అతిప్రధానము. తన హృదయమే బోధకుడు, కాలమే ఉత్తమగురువు. ప్రపంచమే ఉత్తమ గ్రంథము. పరమాత్ముడే ఉత్తమమిత్రుడుగా ఉండాలి. భగవంతుడనగా కర్మలచేత కట్టుబడక, విశాలమైన అనంతమైన వ్యక్తిత్వమే ఈశ్వరత్వము. దానినే Life × Infinity=God అన్నారు. అనగా ఒక్క దేహమును అనంత దేహములతో హెచ్చించినపుడు ఇదే విశ్వవిరాట్ రూపము.

## 103. స్మరింపుము రామనామమున్

**చక్కెరకంటె తీపి**
**దధిసారముకంటె రుచ్యము**
**నోటనుపల్క పల్కగా అమృతమే అనిపించును గాన**
**నిత్యమీచక్కనిదాని మనసాస్మరింపుము రామనామము.**

రామనామము వేదసారము. రామచరితము పాలసంద్రము. శ్రీరామచంద్రుడు సరయూనది వంటివాడు. ఈ సరయూనది మానస సరోవరంలో పుట్టింది. అనగా శ్రీరామచంద్రుని జన్మస్థానం మనస్సు. సరయూనది ప్రవాహముయొక్క రుచి కరుణ. ధర్మమనగా ఇది చేయాలి, ఇది చేయకూడదు అనే నిబంధన మాత్రమే కాదు. కరుణ ప్రేమలతో హృదయాన్ని నింపుకోవాలి. రామాయణంలోని ప్రధాన సత్య ధర్మ ప్రేమ కరుణా రసములతో కూడియున్న రామరసాన్ని గ్రహించటం రామాయణ పారాయణ చేసేవారి కర్తవ్యం.

రాముడు సామాన్య మానవునివలె మానవుల మధ్య సన్నిహితంగాను, అనురాగంగాను సంచరించి మానవులకు ఆదర్శప్రాయుడైనాడు. రాముడు తమో గుణాన్ని(శూర్పణఖ) సంహరించాడు. రజో గుణాన్ని(అహల్య) అణగద్రొక్కాడు. సాత్వికగుణాన్ని(సీతను) స్వీకరించేడు. ప్రతి మానవుడు తనలోని తమో రజో గుణాల్ని తొలగించుకొని రామునికి ప్రీతికరమైన సాత్విక గుణాన్ని పెంచుకోడానికి ప్రయత్నం చేయాలి.

రాముడు అనవసరమైనదాన్ని పరిహరించి అవసరమైనదాన్నే స్వీకరించేడు. నిత్య సత్యధర్మములనే పాటించేవాడు. ధర్మమును నిరూపించునదే యజుర్వేదము. కాబట్టి రాముడు యజుర్వేదము వంటివాడు. రాముడు సమదృష్టి కలవాడు. సమచిత్తుడు. ఆకర్షింపలేని భూమిగాని, రమింపరాని రామతత్వము కానీ లేదు. రాముడు దశరథుని పుత్రుడు కాని, కౌసల్య కుమారుడుగాని, లక్ష్మణుని సోదరుడుగాని, విశ్వామిత్రుని శిష్యుడుగాని, సీతభర్తగాని కానేరదు. రాముడనగా హృదయమును రమింపజేసెడి శక్తి స్వరూపుడు. ఇదే భారతీయుల మతం. అదే రాముని అభిమతం. ఋషుల వ్రతం.

రాముడు జనసుఖదాయకుడు. రఘుకోల నాయకుడు. కౌసల్యకిశోరుడు. 'రమయతీతి రామః' అనగా జనులకు సుఖాన్ని అందించేవాడు అని అర్థం. రాముడు పతితపావనుడు. పతితులనగా దేహమనో, బుద్ధులచే బలహీనులు. రాముడు సాత్విక పతితుడైన శబరిని, జటాయువును, నీచ జాతికి చెందిన గుహుని ఉద్ధరించడం చేసేడు.

ఈనాడు రాముని ఆదర్శ మానవుడని మానవులు గ్రహించి, తమలోని రామతత్వము సార్థకము చేసుకుని, రాముడు నడచిన మార్గంలో నడచి ఆదర్శవంతులైన మానవులుగా నిరూపించుకోవాలి.

## 104. మది స్మరింపుడు కృష్ణనామమున్

**మది స్మరింపుడు కృష్ణనామమున్**
**చక్కెరకంటె తీపి, దధి సారముకంటెను రుచ్యమౌను, కెం**
**పెక్కిన తెనెకన్న అతితృప్తినిడున్ మరిపల్క పల్క పెం**
**పెక్కుచునుంటచే అమృతమేయనిపంచును గాన నిత్యమీ**
**చక్కనిదాని మీరుమది సంస్మరియింపుడు కృష్ణనామమున్.**
**నిత్యమున్ మదిలో స్మరియింపుడు కృష్ణనామమున్.**

మానవుడు బ్రహ్మతత్త్వము అనే సత్యాన్ని గుర్తించాలి. బ్రహ్మతత్త్వమును గుర్తించిన తర్వాత అందులో ఐక్యమగుటకు ప్రయత్నించాలి. దానినే 'అథాతోకర్మ జిజ్ఞాస, అథాతో బ్రహ్మజిజ్ఞాస' అన్నారు. కర్మ జిజ్ఞాస మొదటిది, ధర్మజిజ్ఞాస రెండవది. బ్రహ్మజిజ్ఞాస మూడవది. ఈ జిజ్ఞాస తత్త్వములనే త్రిమూర్తులను పండితోత్తములు అనేక విధములుగా వాదోపవాదములు చేసి శోధిస్తూ వచ్చేరు.

జన్మించడమే ఒక కర్మ జిజ్ఞాస. మన జననమే కర్మకు మూలకారణము. కర్మ ద్వారా మానవుడు కొన్ని ధర్మములు ఆచరిస్తూ వస్తున్నాడు. కర్మ ధర్మ స్వరూపంగా నిరూపించాలి. కర్మను బ్రహ్మ స్వరూపంగా రూపొందింపచేసుకోవాలి. అదియే మానవుని కర్తవ్యకర్మ.

## 105. ప్రజ్ఞాతత్త్వము

**పగటివేళల చుక్కలు కనపడని భంగి**
**శ్రీకరుండైన పరమాత్మ నాకు నరుడా!**
**కానరానంత మాత్రాన**
**అతడు లేడని అనగలవా?**

పగలు కూడా ఆకాశములో నక్షత్రములున్నవి. కానీ అవి కనుపించవు. ఎందుచేత? సూర్యుని వెలుగు ఎక్కువగా ఉండుటచేత వానిని చీకటి ఆవరించినది. కానీ రాత్రిపూట మనకు చీకటి ఏర్పడినప్పుడు ఈ చుక్కలను చూస్తున్నాము. కాబట్టి చీకటిలో వెలుతురు, వెలుతురులో చీకటి ఉంటుంది. ఇది Scientific Truth. వెలుతురు, చీకటి ఒక దానికొకటి సంబంధము లేకుండా ఉండలేవు.

కానీ మానవులు చీకటిని వెలుతురు లేకుండా భావిస్తారు. ఇది ఒక భ్రమ.

చెవులలో, కన్నులలో, నాలుకలో, చర్మములో, నాసికా రంధ్రములలో ఆయా కర్మలను చేయించే శక్తి ఒకటి ఉంది. అదే ప్రజ్ఞానము. ఈ ప్రజ్ఞానతత్త్వము మానవుని జీవితములో వికాసమును, విజ్ఞానమును అందిస్తుంది. దానినే 'ప్రజ్ఞానం బ్రహ్మ' అన్నారు. దానినేవిధంగా గుర్తించాలి? దాని తత్వమేమిటి? అన్ని జీవులయందు ఉండేది ఒకే ఒక దివ్యత్వమని గుర్తించి వర్తించాలి. దానినే Bible లో all life is one, my deal son, be alike to everyone' అన్నారు. దివ్యత్వములేని పదార్థము ఏదీ లేదు. అన్నింటిలోనూ ఉన్న ఈ దివ్యశక్తినే ఆత్మతత్వమని అంటారు. ఇదే "వేదాహ మేతం పురుషం మహాంతం, ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్". ఈ పురుషత్వమునకు అర్థము చైతన్యవంతమైన స్వరూపము. దీనినే 'ఇచ్ఛారామోభవతి, ఆత్మారామోభవతి, తక్తోభవతి, ముక్తోభవతి' అని అనేక రకాలుగా వారి వారి భావావేశములను అనుగుణ్యంగా వర్ణించేరు. స్వరూపములు భిన్నములు కానీ అందులో ఉన్న తత్వము ఒక్కటే.

## 106. ఏకత్వము

**జీవుడనే దేహమందు, హృదయమందు దేవుడుండు.**
**రెండు కూడా ఆటలాడి ఒకరినొకరు వీడుచుండు.**
**బొమ్మలాటలాడించే సూత్రధారి ఒకడు ఉండు**
**కాని రెండు కూడా ఆటలాడి ఒకరినొకరు వీడుచుండు,**
**చూడ రెండు ఉండినప్పటికిని, ఒకటిలోన రెండు ఉండు.**

మానవత్వము దైవత్వము అనేటటువంటివి ఏకత్వముతో కూడినటువంటివే కాని భిన్నత్వములో చేరినటువంటివి కాదు. ఇంద్రత్వము, రుద్రత్వము లాంటి బ్రహ్మత్వము మానవత్వములో ఉన్నటువంటి అంశములే తప్ప అన్యము కాదని మానవుడు గుర్తించవలెను.

మానవునియందు ఉన్నటువంటి లోకతత్వమునే ఒక విధమైన మానవత్వముగా భావించుచూ అందులో ఉన్నటువంటి దివ్యత్వమునే దైవత్వముగా విశ్వసించుచూ దివ్యత్వము, మానవత్వము ఒకే ఒక నరత్వమునందు ఏర్పడినటువంటివను సత్యమును గ్రహించవలెను.

## 107. మానవత్వమునగా

**అన్నియు తెలిసినవారు అతనియందు లేరు;**
**ఏమియు తెలియక ఎవ్వడుండు?**
**కొంచెమెరిగినవాడు కించిజ్ఞుడగునయా;**
**ఉన్నమాట తెలుపుచున్నమాట.**

'జంతూనాం నరజన్మ దుర్లభం'– అన్ని జీవరాశులయందు కూడను మానవజన్మము ఉత్కృష్టమైనది; పవిత్రమైనటువంటిది, సార్థకమైనటువంటిది; దివ్యమైనటువంటిది. ఇట్టి విలువైన, పవిత్రమైన, గంభీరమైన మానవత్వమును కేవలము అర్థము చేసుకొన మసిబొగ్గువలె ఉపయోగపెట్టుకొనుచున్నాడు మానవుడు. దివ్యమైన మానవత్వమును, పవిత్రమైన మార్గమును అవలంబించే నిమిత్తమై దివ్యత్వమును ఆశించుచున్నాడు. ఆ దివ్యత్వము తమయందే, తమ హృదయాంతరాళమునందే ఉన్నది కాని, అన్యదేశమునందు కాని, స్థానమునందు కాని లేదను సత్యమును కూడా గుర్తించాలి.

భగవత్‌రతి కలిగిన భారతదేశమునందు తన యొక్క నిజతత్వమును మరచినటువంటివాడు నిజముగా మానవుడు కాడనే చెప్పవచ్చును. మానవత్వమనగా దివ్యత్వముతో కూడిన ఆత్మతత్వమను సత్యమును గుర్తించవలెను.

## 108. వసుదైక కుటుంబము

**భాస్కరబింబే దీప్తం దైవం.**
**లోచనమధ్యే సుప్తందైవం.**
**శితకరమండల గుప్తం దైవం.**
**త్రిగుణిత భువనం వ్యాప్తం దైవం.**

సూర్య మండలమునందు ప్రకాశించునటువంటి దీప్తి దైవస్వరూపము. ఈ లోచన మండలములో నిద్రించుచున్నట్టి దృష్టియే దైవము. చంద్రమండలమునందు గుప్తంగా దాగియున్న శీతలతత్త్వమే దైవము. త్రిగుణితమైన ఈ బ్రహ్మాండమంతా వ్యాపించినది కూడా దైవమే.

ప్రపంచమంతయు ఒక్క భగవంతుని కుటుంబము. భగవంతుని శక్తియే ప్రపంచములో అందరిలోను ధరించియున్నది.

# శ్రీ సత్యసాయి ఆశయము

**యుగయుగాంతరముల నుండి యుర్విమీద,**
**పేరుగన్నట్టి భరతభూమాతకీర్తి,**
**సాయి సిద్ధాంతములచేత సానబెట్టి,**
**వన్నెబెట్టుడు మీరిక సున్నితముగను.**

భారతీయ సంస్కృతి విజ్ఞాన మహాసముద్రము. అనాదికాలము నుండి భారతీయ సంస్కృతిపైన అనేక విధములైన అవాంతరములు వ్రాలి, దానిని క్షీణింపచేయడానికి ప్రయత్నాలు సలుపుతూ వచ్చేయి. బుద్ధమతము, జైనమతము, ముస్లిమ్ మతము, క్రిష్టయన్ మతము, ఇంకా ఎన్నో మతములు భారతీయ మతమును ఛిన్నాభిన్నము చేయుటకై పూనుకొన్నాయి.

**మతములన్ని చేరి మంచినే బోధించె**
**తెలిసి మెలగవలెను-తెలివి తోడ**
**మరులు మంచివైన-మతమేమి చెడ్డది**
**వినుము భారతీయ వీరసుతుడా!**

అన్నట్లు సర్వమత సమ్మిళితమైన మతిస్వరూపమే ఈ మతమనే సత్యాన్ని గుర్తించాలి. అన్ని మతములు కూడాను ఒక్క దివ్యత్వాన్ని బోధించే సత్యసూక్తులని గుర్తించి, వర్తించాలి. స్వార్థపరులు చేసే కులతత్వాలలో కుస్తీలు, మతతత్వాలతో మారణహెూమాన్ని అరికట్టాలి. 'మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మానం' అన్నట్లు ఈ మూడింటి ఏకత్వములో మహాత్మునిగా రూపొంది, సాయిసిద్ధాంతములను అనుభవించి, ఆచరించు భరత భూమాతకీర్తిని ఇనుమడింపచేయాలి. అదే సాయి ఆశయము.

# శ్రీ సత్యసాయితత్వము

చెంత చేరెనటంచు సంతసించెదరన్న
వెంటనే ఎడబాటు చింత గూర్చు;
ఏడిపించుటె సాయి వేడుక అందురా
కడుపుబ్బ నవ్వించు నడుమ నడుమ
పొగడుచున్నాడని పొంగిపోయెదరేమొ
తప్పకప్పుడె ఎగతాళి చేయు
అభయమిచ్చెను గాన హాయినుండెదరన్న
పడు బాధలకు అంతు పట్టకుండు

వెనుక కేగనీడు, చననీడు ముందుకు,
మనసు మరులు గొలుపు, మధనపెట్టు
ఇట్టి చిన్నసాయి, చిన్మయమూర్తిని
ఎట్టులెరుగగలరు ఇలను మీరు.

అయినప్పటికీ

యస్ అనువానికి యస్సనురా,
నో అనువానికి నో అనురా
నో యస్సులు నీ నోటికి కానీ
సాయికి సర్వము యస్.యస్.యస్.

జగత్తునకు హద్దు ఉన్నది. దైవత్వమునకు హద్దులు లేవు. ఎన్ని యుగములు అనుభవించి, ఆనందించినప్పటికీ తరుగదు. పూర్ణముగానే ఉండి మరింత ఆనందము నందిస్తుంది. శాశ్వతానందమును అనుభవించగోరు వ్యక్తులు నిత్య జీవితములో సక్రమమైన మార్గమును అనుసరిస్తూ దివ్యత్వమైన దైవత్వమును గురించి చింతించాలి.

'అనన్యాశ్చింతయం తోమాం' అని భగవంతుడిచ్చిన హామీ అనన్య భక్తులనే కాని, ఏ పావుగంటో, అరగంటో, గంటో భగవంతుని చింతించే 'పార్ట్ టైం డివోటీస్' కి కాదు. 'నన్నే నిరంతరము స్మరించేవారి యోగక్షేమములు చూచుకుంటానన్నాడు భగవంతుడు. అందుచే స్వార్థ అహంకారములను తొలగించుకొని దివ్యత్వాన్ని చేరుకొండి. సామాన్య భక్తి నుంచి అనన్యభక్తికి

చేరుకోవడానికి ప్రయత్నించండి. మొగ్గ విచ్చి పరిమళాన్ని వెదజల్లినట్లు మనసు వికసించి విశాలమైన సత్య, సహన, శాంతి, ప్రేమ పరిమళాలను వెదజల్లాలి.

హృదయం పవిత్రంగా ఉండి భగవదనుగ్రహం సంపాదించినవారికి భయానికి ఏమాత్రం ఆస్కారం లేదు. అన్నింటికి మిన్నయైన దైవానుగ్రహమొక్కటి ఉంటే ఏ గ్రహమూ ఏమీ చేయలేదు.

సర్వత్రా ఉన్న భగవంతుడు సాకారంగా కన్పించకున్నా అతని జాడను, నీడను మానవుడు అనుభవిస్తూనే ఉన్నాడు. దగ్గర దూరములకు ప్రియమే కారణము. ప్రీతితో ఆరాధిస్తే దూరంగా ఉన్నా దైవము దగ్గరగా వస్తాడు. దూరముగా ఉన్న మానవునకు దగ్గర ఉండి కూడా దూరమైపోతాడు. దగ్గర దూరమనేది రావడం పోవడం కాదు. దృష్టికి ఆ విధంగా గోచరిస్తాడు 'యద్భావం తద్భవతి'.

## శ్రీ సత్యసాయి దీక్ష

అఖిల మానవులకు నానందమొనగూర్చి
    రక్షించుచుండుటే దీక్ష నాకు
సన్మార్గమును వీడి చరియించువారల
    పట్టి కాపాడుటే వ్రతము నాకు
బీదసాదలకైన పెనుబాధ తొలగించి
    లేమిని బాపుటే ప్రేమ నాకు
మంచి చెడ్డలు కూడ మనసులో సమముగా
    భావించుచుండుటే భక్తి నాకు

అనగ బేరొంది నాయండ నలరువారి
నెన్నడును మరువనివాడే నన్నమాట
నెట్టికుచితము మదికినే నేర్పకుందు
అట్టి నా పేరు చెడుట యెట్లగును భువిని.

సమస్త లోకా సుఖినోభవంతు

# సూచిక


విషయము - పద్యము పుట

1. ఉన్నదొక్కటే - ఎద్ది లేదనుచుంటిమో అద్ది కలదు ........................ 1
2. నిన్ను నీవు వెదకుచుండు! - అహంకారపడకు నరుడా! ................... 1
3. దైవమును గొల్వనిదే రాదు దండిశక్తి - ఎమ్మేలు బిఏలు ................... 2
4. ఇకనైన కన్నులు తెరు - ఆంగ్లవిద్యాభిమానంబు ఆవరించుటచే ........... 3
5(అ). నిష్ఫలమైన విద్యలు - పుస్తకముల్ పఠించితిని ...................... 4
5(ఆ). నేర్పవలసిన-నేర్వవలసిన విద్య - సత్ప్రవర్తన, సద్బుద్ధి, సత్యనిరతి, 5
6. పునాదిగోడలు నాల్గు - సత్య ధర్మ ప్రేమశాంతులు లేకున్న ............... 5
7. చిత్తశుద్ధి - వేద వేదాంగములు వల్లె వేసియున్న .......................... 6
8. హీనుడవగుణంబు మానలేడు - చదవులన్ని చదివి-చాల వివేకియై ....... 7
9. చావు లేని చదువు చదువవలయును - తరచి, చదువు చదువ ........... 8
10. మంచిచెడ్డలు
(అ) మంచిచెడ్డలు-దైవనిర్ణయం - ఒకటి చెడు అటంచు, ................ 9
(ఆ). మంచిపని చేసి చెడ్డను చెందలేము - చెడ్డపని చేసి ................. 9
11. దుర్బుద్ధులు దూరము చేయి - దుర్బుద్ధులు వినుతలలున్న.............. 10
12. పాతివ్రత్యము - గత జీవుడగు పతిన్ బ్రతికించి యముగెల్చె ........... 11
13. ఉద్యోగములు-ఉవిదలు
(అ). గృహమును దిద్దు గృహిణి ఎవరు? - ఉద్యోగములు చేయ....... 12
(ఆ). సుఖము సున్న - ఉద్యోగము చేయ ముదితలందరు పోగ........ 13
14. ఈనాటి విద్యా విధానము - మాథమాటిక్సు మరువక పఠియించు...... 14
15. ఆత్మరూపుడు - చావు పుటుక లేనట్టి శాశ్వతుండు ....................... 15
16. బ్రహ్మ నీకిచ్చిన బరువుమాలను ప్రేమమాలగా మార్చుకో -
తల్లిగర్భము నుండి జన్మించినపుడు ..................................... 16
17. సుఖ దుఃఖములకు కర్మమే కారణము -
(అ) కర్మమున పుట్టు జంతువు ............................................. 16

(ఆ) కర్మమున పుట్టుజంతువు, .............................................. 16
18. కర్మఫలప్రదాత భగవంతుడు - (అ) కర్మమున పుట్టు జంతువు......... 17
(ఆ) కాంక్ష తోడ నెందు కర్మంబు లొనరింప ........................... 17
19. బుద్ధులు బండబారు - ఎన్ని విద్యలు నేర్చి ఏమి ఫలము .............. 18
20. నామసంకీర్తనము - 'శ్రవణం, కీర్తనం, విష్ణోః స్మరణం, ................. 19
21. స్వార్థరహితుడే దేశనాయకుడు - దేశ సేవకుండె దేశనాయకుడైన ...... 19
22. మానవత్వం యొక్క పరిపూర్ణత్వం - నరుని జీవితమ్ము నల్లుల.......... 20
23. సృష్టి స్థితి లయములు - బ్రహ్మ సృష్టి చేయు బ్రహ్మాండమునెల్ల......... 21
24. గురుడెవరు? - సకల సద్గుణములు చక్కగా లేకున్న ..................... 21
25. నేటి గురువులు - దేహభ్రాంతి లేని మోహమింతయు లేని .............. 22
26. నిజమైన గురుడు
త్యాగశీలుడైన యోగవరుడే గురుడు - దేహభ్రాంతియు లేక, ............ 23
27. సద్గుణము లేకున్న గురువులు కారు -సర్వ సద్గుణములు ................ 23
28. భగవదనుగ్రహునకు గుణమే ప్రధానము - వాల్మీకి ఎవ్వని వంశము .. 24
29. మొదట దుష్టగుణములు సూక్ష్మంగానే ఉంటాయి -
కొలది కొలదిగా పుట్టును తొలుత, చెదలు ................................ 25
30. విద్యార్థులు కోరవలసిన ది మంచి నడత-నైతిక గౌరవం -
మంచి కాలము పదవులు ..................................................... 26
31. మంచి కోర్కెలు - మంచి కాలము, పదవులు, మంచి బ్రతుకు......... 26
32. సర్వ చింతలబాపు సర్వేశ్వరుని భక్తికొనుడు - పుట్టుట ఒక చింత..... 27
33. ముందున్నది మొసళ్ళ పండుగ - అందము ప్రాయము శక్తికలదని .... 28
34. చిత్తశుద్ధి - పంకజాక్షుని పూజ-పలు మారు సేయక..................... 28
35. ఆత్మతత్వము - చిత్తశుద్ధిలేని రిత్తసాధకులకు .............................. 29
36. ఆత్మ - కంటిగ్రుడ్డుకు కాటుక అంటనట్లు ................................ 30
37. ఆత్మానందము - ఆత్మతత్వమెరుగ ఆనందమగును, ....................... 30
38. సూత్రధారి - జీవుడనే దేహమందు దేవుడుండు .......................... 31


39. దివ్యత్వము–బాహ్యత్వము – గోడ కట్టువాడు గోడతో పాటుగా .......... 31
40. సర్వసాక్షి – చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు ........................... 32
41. సర్వ వేదాంత గ్రంథాల సారము – సర్వ వేదాంత గ్రంథాల ............ 32
42. ఆత్మయే బ్రహ్మ–బ్రహ్మయే ఆత్మ – సూక్ష్మమైనట్టి అణువున............... 33
43. పాపము – దైవమనగ వేరు దేశమందున లేదు .......................... 34
44. పుణ్యము–పురుషార్థము – చక్రములు లేని రథము....................... 34
45. సత్యం–శివం–సుందరం – చంద్రునికి కలువయే శృంగారం............. 35
46. చేసి చెప్పు – చెప్పుట సులభంబు, చేయుట కష్టంబు, .................. 36
47. పరిపూర్ణ ప్రేమ – (అ) పూర్ణప్రేమయందె పుట్టును సౌఖ్యంబు.......... 36
(ఆ) పూర్ణప్రేమయందె పుట్టును సౌఖ్యంబు................................ 37
48. తత్త్వమెరిగిన–ధన్యుడు – లోని శత్రువులకు లొంగిపోయినవాడు......... 37
49. ప్రేమమయము బ్రహ్మంబు –
ప్రేమరూపము బ్రహ్మంబు, ప్రేమమయము.................................. 38
50. నీటిబుడగ – నీటియందు పుట్టి నీటనే తేలుచు........................... 38
51. పరమాత్ముడు ఒకడే:
అనేకత్వంలోని ఏకత్వం గుర్తించాలి – అల్లాయంచు మహమ్మదీయులు . 39
52. శ్రీపతి కరుణవేడు – పాపభయంబుపోయె, పరిపాటయిపోయెను ........ 40
53. భారత భాగ్యవిధాత – పక్వఫలము వృక్షమునుండి పడిన భంగి......... 41
54. సృష్టికర్త – పొగకు మూలము నిప్పులపుంజముండ, ..................... 42
55. మీ పరమ లక్ష్యం – కామితార్థంబులిలను–కల్పతరువు.................... 42
56. భక్తి–భుక్తి – నిదురనుండి లేచి మరి నిద్దురపోయెడుదాక................ 43
57. జ్ఞానము – వేషభాషలందు గర్వించరాదు,.................................. 44
58. నీవెవరో తెలిసికో – పుట్టపై మర్దించిన పాము మరణించునా?......... 45
59. ధర్మమే దైవము – ధర్మమెచటనుండు నచట–దైవముండు ................ 45
60. దేహము–దేహి – దేహము పాంచభౌతికము–దేహముకూలక ............. 45
61. అవతరణ – అవతరించుట అనుటలో అర్థమేమి? ....................... 46

62. మరువబోకు - మనసు, బుద్ధి, చిత్తము మరి అహంకారంబు.......... 47
63. స్వర్గము - స్వర్గమనగ వేరు సురలోకమున లేదు........................ 48
64. ముక్తి - ముక్తి కోరిన నరుడు ముక్కోటి దేవతల........................ 48
65. మంచివారు - మంచివారి పొందుమహిలోన దొరుకదు .................. 49
66. బాహ్యదృష్టి-అంతర్దృష్టి - ఫిలిము రికార్డును, ప్లేటును చూచిన ......... 50
67. చిన్మయమూర్తి సాయిరామ - కన్నీరు తప్పించు, కన్నీరు తెప్పించు ..... 50
68. నిలకడలేనిదీబ్రతుకు - తామరాకుపై తళతళలాడే........................ 51
69. భక్తి - ఇసుకపై వర్షజలధార లింకిపోవు .................................. 52
70. నిన్ను కావంగ వచ్చిన శ్రీకరుడు - సారములేని యట్టి భవసాగర ..... 52
71. నీలోనే ఉన్నది - బ్రహ్మదర్శనభాగ్యంబు బడయగోరి ...................... 53
72. ప్రేమావతారము - ప్రేమమయుండు శ్రీధరుడు........................... 54
73. కర్మ భక్తిజ్ఞానము - పూవు లేక కాయ పుట్టదు జగతి?................. 55
74. విడువు వక్రబుద్ధి - కుసుమమల్లెమాల కోతికి తగిలించి ................ 56
75. మత్సరము - కోపమున్నవానికూడి చేరంగవచ్చు.......................... 57
76. బహిర్యజ్ఞము-అంతర్యజ్ఞము - వేదశాస్త్రంబులు-వివరించి బుధులచే..... 58
77. మనోవాక్కాయ కర్మల సాధన- వేద శాస్త్రంబులు వివరించి-బుధులచే.. 59
78. దేహమే దేవాలయము - సకల విద్యలు నేర్చి-సభ జయించగవచ్చు.... 60
79. భక్తపరుడగు దాసుడే వంద్యుడగును - సకల శాస్త్ర పురాణ- .......... 61
80. కష్టసుఖములు - కష్ట సుఖములు రెండును కలసియుండు............. 62
81. కర్మమార్గము - మనసు మాలిన్యములనెల్ల మట్టుపెట్టి.................... 63
82. రాజయోగమునకు బాట - జగతిని కీడెంచువాడు మనుజుడు కావలె.. 63
83. ఆశలు-దురాశలు - నిగమమును హరియించి నిందు దూషణ చేసె... 64
84. విద్య-జ్ఞానము - మేఘములు మింటిపై చేరి మెదలుచుండ ............ 65
85. మనసు-బుద్ధి - మనసు నాధారముగ గొన్న మానవుండు ............... 65
86. భుక్తివిద్యలు-ముక్తివిద్యలు - భుక్తి విద్యలన్ని బోధించి తెల్పేటి.......... 66
87. పశుపతివి కమ్ము - మనుజుడైన వాడు తనలోని దుర్గుణముల......... 66

88. సకల సంకల్పశూన్యుడే శాంతినొందు - దుష్ట సంకల్పములచేత........ 67
89. వినయ విధేయలతో దైవత్వమును గుర్తించు - పొట్టకూటిని చేకూర్చు.. 68
90. ఈ దేహమునకు యజమాని భగవంతుడే సుమా! - మసలలేవు,....... 69
91. ఆత్మవిద్య కూడ అవసరం - ఫలము లేని వృక్షమువలె................. 70
92. భవరోగనివారణ - ఆకొన్నవాని ఆకలి తీరునా,......................... 71
93. వికారమనస్సు - మ్రాను దిద్దవచ్చు, మరి వంపు లేకుండా,............. 72
94. హృదయము ప్రేమమయము గావింపు -
ప్రేమరూపము బ్రహ్మంబు ప్రేమమయము,................................ 73
95. ఏది సుదినము? - సద్భక్తులందరు భగవంతుడా యంచు.............. 73
96. అక్షరజ్ఞానము ఆధ్యాత్మిక జ్ఞానము కానేరదు -
కాగితంబునందు కల్గిన అక్షరాల్ ............................................ 74
97. జననీ జన్మభూమి - ఇది నా మాతృదేశము .............................. 75
98. విద్యను దేశ కళ్యాణమున కుపయోగించు -
విద్య డిగ్రీల కొరకనే-వెర్రి వీడి ............................................. 75
99. దేశ సంస్కృతిని శ్రేయపరుచు - విద్య డిగ్రీలకొరకను వెర్రివీడి ......... 76
100. గురువు నేర్పదగిన విద్య - సద్గుణములు, సద్బుద్ధి, సత్యనిరతి.......... 76
101. సరసవిద్య - విశ్వశాంతి చేకూర్చు విధము నేర్పి ......................... 77
102. విశ్వవిరాట్ రూపము - మంచికాలము పదవులు......................... 78
103. స్మరింపుము రామనామమున్ - చక్కెరకంటె తీపి......................... 78
104. మది స్మరింపుడు కృష్ణనామమున్ - మది స్మరింపుడు కృష్ణనామమున్ . 80
105. ప్రజ్ఞాతత్త్వము - పగటివేళల చుక్కలు కనపడని భంగి.................... 80
106. ఏకత్వము - జీవుడనే దేహమందు, హృదయమందు దేవుడుండు. ...... 81
107. మానవత్వమునగా - అన్నియు తెలిసినవారు అతనియందు లేరు; ...... 82
108. వసుదైక కుటుంబము - భాస్కరబింబే దీప్తం దైవం. ...................... 82

***

# శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక సూత్రములు



సంకలనము

**తూములూరు ప్రభ**

**తూములూరు కృష్ణమూర్తి**

# శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక సూత్రములు

*సంకలనము:*
**తూములూరు ప్రభ**
**తూములూరు కృష్ణమూర్తి**

*ప్రచురణ:*
**తూములూరు పబ్లికేషన్స్**
'అనసూయ' సి–66,
దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలనీ,
హైదరాబాద్ – 500 007.
ఫోన్: 040–27427083, టెలీఫ్యాక్స్: 27428904
సెల్‌ఫ 9391087255, 9849384829
E-mail: tkm_hyderabad@yahoo.co.in
mrtumuluruk@gmail.com

*వెల:* **రూ. 60/=**

*ముద్రణ:*
**విప్ల కంప్యూటర్ సర్వీసెస్**
(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)
నల్లకుంట, హైదరాబాద్– 500 044
ఫోన్: 27654003, 27677078, 27676910
E-mail: viplavision@gmail.com

# సమర్పణ

"డిగ్రీలు, డిప్లమాలు, యజ్ఞయాగాది క్రతువులు మొదలైనవేవియు అజ్ఞాన నివృత్తినొసగజాలవు. దేహమను పుట్టలో, మనస్సను బిలములో దాగుకొని యున్న అజ్ఞానమను సర్పము కామ్యకర్మలచేత చంపబడదు. శ్రద్ధావాన్ లభతేజ్ఞానం– శాస్త్రవచనము లందు, దైవవాక్యములందు విశ్వాసము కలవారికే జ్ఞానము లభించును.

'జ్ఞానదేవతు కైవల్యమ్'– ఆత్మజ్ఞానము తప్ప మరే మార్గములు మోక్షమును అందించలేవు. వంటకు కావలసిన పదార్థములనన్నిటిని సమకూర్చుకొన్నను, అగ్ని లేకపోయినచో వంట ఎట్లు వండలేమో, అటులనే పొట్టకూటి విద్యలెన్ని నేర్చినను, కామ్యకర్మలెన్ని చేసినను ఆత్మజ్ఞానము లేకుండిన ముక్తి లభించదు. పుణ్య నదీ జలములో స్నానము చేసినంత మాత్రమున ముక్తి లభించవచ్చునన్న నిరంతరం ఆ నదిలోనే జీవించు జలచరముల స్థితి ఏమిటి? గుహలలో జీవించినంత మాత్రమున ముక్తి లభించునన్న అందులోనే వాసము గావించుకొని జీవించుచున్న ఎలుకలు, క్రూరమృగములకు లభించునదేమి? కందమూలాదులతో జీవించి ఆకులలములు మేసి తపించిన మోక్షమన్న, ఆకులను, తుంగగడ్డలనే తిని జీవించు మేకలు, పందులు ముక్తికి పోవలసిందనదేనా? ఒడలునిండా బూది పూసుకొనుటయే తపస్సన్న బూడిదలో పొర్లాడు కుక్కలూ, గాడిదలూ మోక్షార్హత కాదు. ఆత్మజ్ఞానం సంపాదించాలి" అంటారు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా.

అట్టి ఆత్మజ్ఞానార్జనకు వేదాంత శాస్త్రములుపకరించును. వేదాంతశాస్త్రము బ్రహ్మ సూత్రము. సూత్రములంటే కొద్దిశబ్దములలో, స్వల్ప అక్షరపదాలతో గొప్పదైన, సారభూతమైన, అనంత అర్థాన్ని స్ఫురింపచేయునది. ఒక్కొక్క సూత్రము **ఒక్కొక్క విధముగ వ్యాఖ్యానింపబడినది.** ఒక్కొక్కరు తమ తమ విశ్వాసములను, అభిరుచులను, అనుభవాలను, ఆనందాన్ని పురస్కరించుకొని ఈ సూత్రాలకు వ్యాఖ్యానాలు వ్రాసారు" బాబా.

కలియుగ అవతారపురుషులైన భగవాన్ శ్రీసత్యసాయిబాబా **తాము చేపట్టిన అనేక గుణ మత ధర్మపునరుద్ధరణ కార్యక్రమములలో ఒకటిగా, అనేక సందర్భములలో తమ దివ్యోపన్యాసములను మానవాళికి అందిస్తున్నారు.** ఆ దివ్యోపన్యాసముల ప్రారంభములో ఒక పద్యమును(సూత్రమును) ఆశువుగా చెప్పి, **బాబా ఆధ్యాత్మిక వివరణ తమ ఉపన్యాసములో పొందుపరచి, ప్రజలలో నిద్రాణంగా ఉన్న ఆత్మజ్ఞానజ్యోతిని వెలిగించి, వారిని విజ్ఞానవంతులుగా చేసి, విచక్షణతో కార్యాచరణ చేసి, ఆ ఆత్మజ్ఞానముతో వారు మోక్షప్రాప్తికి అర్హులగునట్లు చేయుట భగవానుల సంకల్పము.** "శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక సూత్రములు", వారి నోటనే వెలువడిన భాష్యములను ఇందు క్రోడీకరించడ మైనది. భగవానుల అనుగ్రహంతో ఇది మానవుల ఆధ్యాత్మిక పురోగమనాని కుపకరిస్తుందని ఆశిస్తున్నాము. దీనిని భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి చరణముల ముందు భక్తిశ్రద్ధలతో నిండు మనస్సుతో ఉంచుతున్నాము.

14.4.83

**తూములూరు ప్రభ**

**తూములూరు కృష్ణమూర్తి**

నిరాకారమూ, నిరంజనమూ, నిర్గుణమూ అయిన పరబ్రహ్మమే తానుగా మానవాకృతి ధరించి భూమిపై అవతరించిన విషయం బాబా ఎల్లప్పుడూ గుర్తు చేస్తారు. ప్రతిఒక్కరూ కోరుకునే గమ్యం, మార్గదర్శి, సంరక్షకుడూ ఆయనే. ఆయన తన ప్రసంగాల్లోనూ, రచనలలోనూ ఇదే సత్యాన్ని వ్యక్తం చేస్తుంటారు. తన ఉపన్యాసాన్ని ప్రారంభించేముందు బాబా సంస్కృతంలో కాని, తెలుగు లోకాని ఒక చిన్న పద్యాన్ని ఆలపిస్తారు. మన కళ్ళముందు కదలాడే మాయ తెరలను తొలగించి, మానవులను సంస్కరించటం కోసమై ఆయన అవలంబించే విధానం గురించి ఆ పద్యం ఒక సూచనను తెలియచేస్తుంది. "భౌతికమైన, ఆధ్యాత్మికమైన కీర్తిని ప్రసాదించి ధృవుణ్ణీ, దేమునియందు కల విశ్వాసాన్ని తృంచివేయటానికై అనేక చిత్రహింసల పాలుచేసిన క్రూరుల బారి నుండి ప్రహ్లాదునీ కాపాడిన విష్ణుదేవుడే, దుర్భర దారిద్ర్యంతో, నిరుపేద జీవితాన్ని గడుపుతూ కూడా భగవంతునియందు విశ్వాసం కోల్పోని కుచేలుని బ్రోచిన గోపాలుడే ఈనాడు సచ్చిదానందమూర్తిగా వెలసి ఇక్కడ ఉన్నాడు. మంచివారి హృదయ సింహాసనములను అధిష్టించి పాలించేవాడుగా దారితప్పి తిరిగే వారికి కరుణతో కాపాడి సరైన మార్గంలో నడిపించే నాయకుడే ఈ అవతారమూర్తి" అని ప్రకటించారు బాబా.

ఇంకొక సందర్భంలో బాబా అప్పటికప్పుడు అశువుగా ఒకపద్యాన్ని పాడి వినిపించారు.

"ఏమాత్రం ఆలస్యం, అంతరాయం కలగకుండా ప్రతిరోజూ సూర్యుడు ఒకే విధంగా ఎలా ఉదయిస్తున్నాడు? ఎలా అస్తమిస్తున్నాడు? మన కళ్ళకు ఆనందాన్ని కలిగిస్తూ ఆకాశంలో తళుక్కున మెరిసే తారలు సూర్యోదయం కాగానే ప్రకాశవంతమైన తమ ముఖాలను చోటు చేసుకుని అవి ఎక్కడ దాక్కున్నాయో ఇసుమంతైనా మనకు తెలియనివ్వవెందుకని? ఊపిరిపోస్తుండెందుకు? సాగరసంగమానికై ఉరకలు వేస్తూ రాళు ్ళ, గుట్టలూ, మిట్టలూ, బండలూ, కొండలూ దాటి ప్రవహించే నదులు గర్జించేదెందుకు? ఒక దైవాన్ని తమలో దాచుకుని కూడా ఈ మానవులు ఒకరినొకరు భిన్నంగా, తమ లక్ష్య సాధనలో, ఆశయాలలో, ఆచరణలో వేరువేరు దృక్పథాలను కలిగి ఉండేదెందుకు?

వీటన్నింటికీ సమాధానం ఏమిటో తెలుసా? ఇవన్నీ ఈ విధంగా ఇలా ఉ ండాలని నేను వాటిని శాసించటమే ఇందుకు కారణం అంటూ ఒక పద్యాన్ని అశువుగా చెప్పారు బాబా. *(సత్యం శివం సుందరం, నాల్గవభాగం పుట. 119/120)*

"బాబావారి అనుగ్రహముతో ఈ పుస్తకము ఇరవై అయిదు సంవత్సరముల తరువాత ప్రచురింపబడుచున్నది. వారి కృపకు మేము కృతజ్ఞతాంజలులు అర్పించుచున్నాము.

ఫిబ్రవరి, 2009

**తూములూరు ప్రభ**
**తూములూరు కృష్ణమూర్తి**

# ముందుమాట

**"మధురమైన భాష మంజుల గళముతో**
**భక్త కోటిహృదిని భర్తిచేయు,**
**సూటిమాట పలికి సూక్ష్మధర్మంబులే**
**చెప్పుచుండు సాయి యొప్పుమీర".**

భగవాన్ సత్యసాయిబాబా తమ దివ్యోపన్యాసములను అనేక తరగతుల, తరహా ప్రజలనుద్దేశించి ఇచ్చుచుందురు. ఏ క్రమములో వారి 'ఆధ్యాత్మిక సూత్రము' లను పొందుపరచాలని తర్జన వచ్చినపుడు బాబా ఏ విధంగా ప్రజల మానసిక పరిణతిననుసరించి, **ఆధ్యాత్మిక సౌధాన్ని** అధిగమింపచేయడానికి ఒకో మెట్టుగా పైకి తీసుకువెళతారో, ఆ క్రమంలోనే సామాన్యంగా విద్యార్థులు, స్త్రీలు, మానవులు, గురువులు ఎట్లు ఆదర్శప్రాయంగా ఉండాలో వివరించేవి, తర్వాత జటిలమైన మానవత్వము, ఆత్మ, ఆత్మతత్వము, దివ్యత్వము, బ్రహ్మతత్వము ఆదిగాగల ఆధ్యాత్మిక విషయాలను పొందుపరచడమైనది.

## శ్రీ సత్యసాయి అవతరణము

**ఏ గుణంబు గణించి-ఏతెంచెనో నాడు**
**ప్రహ్లాదు పాలింప పరమపురుషు**
**దేగుణంబు గణించి-ఏతెంచెనో నాడు**
**కరిని గాచెడితరి-కమలనయను**
**దేగుణంబు గణించి-ఏతెంచెనో నాడు**
**ధ్రువ కుమారుని సాక-రూఢిమీర**
**నే గుణంబు గణించి-ఏతెంచెనో నాడు**
**బలి చక్రవర్తి గావంగనోర్చి**
**ఆ గుణంబె గణించి యా యమరవంద్యు**
**డార్తజనులను బాలించునట్టివాడు**
**శ్రీనివాసుండు లోకైక చిన్మయుండు**
**వెల్గె పర్తీశుడై నేడు పృథివియందు**

**పది దినంబుల నుండి పస్తుండువానికి,**
**మంచి భోజనము లభించినట్లు,**
**చెరువు బావులనీళ్లు కరవైనప్పుడు,**
**వరుసగా వర్షంబు కురిసినట్లు;**
**సంతతి లేకను చింతిల్లువానికి,**
**పుణ్యసుపుత్రుండు పుట్టినట్లు;**
**కూటికి లేకను అల్లాడుచున్నటి,ః**
**నిరుపేదకు భక్ష్యంబు దొరికినట్లు;**

ధర్మనాశనముగుచున్న ధరణియందు,
ప్రభవమందెను 'శ్రీసాయి' పర్తియందు.
ఇంతకన్నను వేరెద్ది ఎరుకపరతు,
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులారా!

## శ్రీ సత్యసాయి అభయము

ఏ దేశమేగినా ఈ నామమే సుమీ
సత్యసాయీశుడనుచు నిత్యపఠన,
ఏ ఊర చూచినా ఈ నామమే సుమీ
సత్యసాయీ అనుచు నిత్యజపము
ఏ చోట విన్నను ఈ నామమే సుమీ
సాయిరామా అనుచు నిత్యజపము,
ఎచ్చోట చూచినా ఈ నామమే సుమీ
సత్యసాయీ అను నిత్యభజన
ఇట్లు విశ్వమెల్లడ వ్యాప్తియై వెలయునట్టి
భక్తజనులకు ప్రాపుయై బరగునట్టి,
భక్తినొసగి రక్షించెడు శక్తిమయుడు
పర్తివాసుడు మిమ్మేల ఎత్తుకొనడు.

ఆ, నందబాలుడే ఆనందబాలుడై
తనవారి గుర్తింప తరలివచ్చె;
ఆ, రామచంద్రుడే ఆరామచంద్రుడై
తన బంటులను కనుగొనగవచ్చె;
ఆ, యీశుడే బాలసాయీశుడై నేడు
తన గుంపుతో ఆడుకొనగ వచ్చె;
ఆ మహావిష్ణువే యీ మహావిష్ణువై
తన ఆయుధములు చేకొనగవచ్చె;
అల్ల పరమాత్మయను బొమ్మలాటగాడు
తాను జీవుల రంగస్థలాన నిలిచి
ఆడు ఆనాటి ఈనాటి ఆట జూచి
సుంత వర్ణించి కొంత సంతసముగనుడు.

మీ దుఃఖములను, రోగములను, సందేహములను, బాధలను నాకు సమర్పించి, వాటికి బదులు ఆనందమును నా నుండి పొందండి. నేనాందస్వరూపుడను. రండి. మీరు నన్ను విస్మరించినా, మిమ్ము నేను వదలిపెట్టను. దారి తెలియనట్టి, తెలిసియు విశ్వాసములేని మీ వంటి వారికొరకే నేను వచ్చినది. దాహముతో మీరు దోసిలి పట్టితే, మీరెక్కడ ఉన్నా, ఏ వేళనైనా, నేను వచ్చి అమృతము పోస్తాను. నేను మీ వెంటనే, జంటనే, ఇంటనే, కంటనే, కంటికి రెప్పవలె యున్నాను. మీరు కలవరపడనవసరము లేదు.

**– సంకలన కర్తలు**